కశ్మీర్‌లో జోజిలా టన్నెల్..



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 9 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 154 | పేజీలు:12 | వెల రూ.5

గయానాలో డాక్టర్.. ఇండోర్‌లో పేషెంట్



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## నేడే.. చేప ప్రసాదం

పోలీస్ యంత్రాంగం నిరంతరం నిఘా

జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా



హైదరాబాద్,జూన్ 8(మనం న్యూస్): ప్రతీ సంవత్సరం మగశిర కార్తి సమయంలో.. బత్తిన సోదరులు చేప ప్రసాదం పంచిపెట్టడం ఆనవాయితీ. ఈసారి కూడా ప్రభుత్వ సహకారంతో ఈ కార్య కమాన్ని సోమ, మంగళవారలలో బత్తిన కుటుంబం భారీ ఏర్పాట్లతో నిర్వహిస్తోంది. ఈసారి కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఈ సంవత్సరం దాదాపు 1.5 లక్షల మంది ఈ చేప ప్రసాదం కోసం హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధ్వర్యంలో బత్తిని కుటుంబం నిర్వహిస్తోంది. ఉదయం 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుంది. ఈసారి టోకెన్ విధానాన్ని అమలు

...మిగతా 2లో

### రాష్ట్రానికి నిధులపై...బీజేపీ ఎంపీలు

# ప్రధాని మోడీని నిలదీయాలె

### రెండున్నరేళ్లలో నేనేం చేయలేదని నన్ను విమర్శిస్తున్న మీరేం చేశారు



- గాజులరామారంలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్
- నగరాన్ని అభివృద్ధి చేసేందుకే మూడు కార్పొరేషన్లు
- నగరంలో లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇండ్ల నిర్మాణం
- ఎన్నికలకు ఆరు నెలల ముందే రాజకీయాలు
- నిధులు రాకుండా అడ్డుపడుతున్న కిషన్ రెడ్డి
- రాబోయే 24 నెలలు అభివృద్ధిపైనే మా దృష్టి
- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సభలో రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 08(మనం బ్యూరో): తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను పంపిస్తే మోడీ ప్రధాని అయ్యారు. మరి ఆ ఎంపీలు రాష్ట్రానికి ఏం తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు ప్రధాని మోడీని నిధుల విషయంలో నిలదీయాలని డిమాండ్ చేశారు. రెండున్నరేళ్లలో రాష్ట్రానికి ఏం చేయలేదని నన్ను విమర్శిస్తున్నారు. మోడీ ఏం చేశారో ఎన్ని

...మిగతా 2లో



## టెస్టు చరిత్రలోనే భారత్ అతిపెద్ద విజయం

చండీగఢ్: అఫ్గానిస్థాన్తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్లో టీమ్ఇండియా భారీ విజయం సాధించింది. భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. టెస్టుల్లో టీమ్ఇండియాకు ఇది అతిపెద్ద విజయం కావడం విశేషం.

..వివరాలు 12లో

## హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్‌నాథ్ ఎన్నిక చెల్లదు

- హైకోర్టు సంచలన తీర్పు

హైదరాబాద్,జూన్ 8(మనం,ప్రత్యేక ప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ ఎన్నిక చెల్లదని, అతడిని వెంటనే పదవి నుంచి తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్పెషల్ ఏజీఎం నిర్వహించి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. 2023 అక్టోబర్ ఎన్నికల్లో అమర్‌నాథ్ కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో అప్పటి అధ్యక్షుడు జగన్ మోహన్ రావు చేతిలో ఓడిపోయారు. అయితే జగన్ మోహన్ రావు సమర్పించిన 'శ్రీ చక్ర క్లబ్' పత్రాలు నకిలీవని, ఆ క్లబ్ ఉనికిలోనే లేదని అమర్‌నాథ్ బీసీసీఐ అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో 2018లోనే జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి ఈ క్లబ్ మార్పు చట్టవిరుద్ధమని

...మిగతా 2లో

## దురుద్దేశంతోనే సీఎంపై బీఆర్ఎస్ విమర్శలు

- నాజీలు పెట్టిన హిట్లర్ బంకర్‌లా ప్రగతి భవన్
- గతంలో కేసీఆర్ తాను హిట్లర్‌నని వ్యాఖ్యానించారు
- కేటీఆర్ అంబేద్కర్ గురించి మాట్లాడటం శతాబ్దపు జోక్: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 8(మనం బ్యూరో): రాజకీయ దురుద్దేశంతో బీఆర్ఎస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డిపై పనికట్టుకుని విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హిట్లర్

...మిగతా 2లో

## ఎబోలాపై హై అలర్ట్

- విదేశీ ప్రయాణికులు తప్పుడు సమాచారం ఇస్తే ఎపిడమిక్ డిసీజెస్ యాక్ట్
- శంషాబాద్ విమానాశ్రయంలో స్క్రీనింగ్, సర్వైలెన్స్ వ్యవస్థ
- అనుమానితుల శాంపిల్స్ సేకరణ, టెస్టులపై అలసత్వం వద్దు
- వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మంత్రి దామోదర ఉన్నత స్థాయి సమీక్ష

హైదరాబాద్, జూన్ 8(మనం బ్యూరో): ఎబోలా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు, పర్యవేక్షణ చర్యలు, వివిధ శాఖల

...మిగతా 2లో

## నీట్ రీ-ఎగ్జామ్..

### లాక్‌డౌన్‌లో పేపర్ రూపకర్తలు..!




ఢిల్లీ, జూన్ 8 : మరో రెండు వారాల్లో నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ జరగనుంది. పేపర్ లీక్ ఆరోపణలతో ఇప్పటికే ఓసారి పరీక్షను రద్దు చేయడంతో రీ-టెస్ట్ నిర్వహణ విషయంలో ఎన్టీఏ అత్యంత అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. పేపర్ తయారీ దశ నుంచే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నీట్ యూజీ పేపర్ తయారుచేసిన నిపుణులు, పర్యవేక్షకులు, ట్రాన్స్‌లేటర్‌లు సహా ఈ ప్రక్రియలో భాగస్వాములైన ప్రతిఒక్కరినీ ప్రస్తుతం అత్యంత భద్రత కలిగిన రహస్య ప్రాంతంలో ఉంచినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. వీరిపై భద్రతా అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంచారని తెలిపాయి. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు, ఇతర కమ్యూనికేషన్

...మిగతా 2లో




### కలిసి ఉంటేనే నిలబడతాం

## విడిపోతే పడిపోతాం

- రాహుల్ గాంధీ

ఢిల్లీ , జూన్ 8: కలిసికట్టుగా ఉంటేనే నిలబడతామని, విడిపోతే పడిపోతామని లోక్సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ విషయాన్ని భాగస్వామ్య పార్టీలు గుర్తెరిగి, ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బీజేపీ నుంచి ఎదురయ్యే సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూట్ క్లబ్‌లో సోమవారంనాడు జరిగిన 'ఇండియా' కూటమి సమావేశంలో రాహుల్ గాంధీ 15 నిమిషాల సేపు ప్రసంగించారు. కూటమి పార్టీలు ఒకరిపై మరొకరు పైచేయి సాధించాలని అనుకోకుండా కలిసి కట్టుగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని, బీజేపీ నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని

...మిగతా 2లో

## పకడ్బందీగా 'సర్'

- అధికారులకు పోలీసులు భద్రత కల్పించండి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 8(మనం న్యూస్) : ఓటర్ల జాబితా సవరణలో భాగంగా భారత ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు ఫీల్ స్థాయిలో విధులు నిర్వహించే బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు తగిన భద్రత, సహకారం అందించాలని, అలాగే సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ పోలీస్‌లు

...మిగతా 2లో

### విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో

## ఘోర ప్రమాదం



### 9మంది మృతి.. పలువురికి గాయాలు

- ఉక్కు ద్రవం లిఫ్ట్ చేస్తుండగా ప్రమాదం
- ప్రధాని, సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- మృతుల కుంటుబాలకు రూ. 2 లక్షలు
- క్షతగాత్రులకు రూ. 50వేలు
- ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన కేంద్రం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- క్షతగాత్రులకు ఆసుపత్రిలో వైద్య సేవలు
- మిన్నంటిన మృతుల కుటుంబాల రోదన

హైదరాబాద్,జూన్ 8(మనం, ప్రత్యేక ప్రతినిధి)ః ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ స్టీల్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, ఎస్టీసీ-3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ సోమవారం సాయంత్రం ఒక్కసారిగా పేలడంతో ఉక్కుద్రవం లీకైంది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో 9 మంది కార్మికులు అక్కడికక్కడే మృతిచెందగా పలువురు క్షతగాత్రులయ్యారు. తీవ్రగాయాలపాలైన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. దాదాపు 1500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్‌ను ల్యాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగినట్లుగా అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. ప్రమాద ఘటనతో స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. సమాచారమందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఉక్కుకర్మాగారంలోని ఎస్ఎంఎస్-2, ఎస్టీసీ-3, హీట్ ఎఫ్‌జీలో భారీ మొత్తంలో ఉక్కుద్రవం లీకవ్వడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయనిసంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆరుగురిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వివరించారు.


**మృతుల,క్షతగాత్రుల వివరాలు :**

విశాఖ ప్రమాదంలో అప్పారావు, కృష్ణ, ప్రభాకర్ రావు, అప్పలరాజు, త్రినాథ్, రమణ, కుమార్‌లు మృతిచెందినట్లుగా గుర్తించారు. మరో ఇద్దరికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. వీరిలో ఐదుగురు విశాఖ

...మిగతా 2లో

## తక్షణమే ఇరాన్‌ను వీడండి..

### భారతీయులకు అడ్వైజరీ



టెహ్రాన్, జూన్ 8 : ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మరోసారి తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఇరాన్‌ను వీడాలని అక్కడి భారత పౌరులకు సూచించింది.

''ఈ ప్రాంతం(పశ్చిమాసియా)లో నెలకొన్న తాజా పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణాలను మానుకోవాలని సూచిస్తున్నాం. ఇక, ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో వెంటనే ఆ దేశాన్ని వీడాలని హెచ్చరిస్తున్నాం'' అని ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది.

ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైన నాటినుంచి భారత్ పలుమార్లు ఇలాంటి ప్రయాణ సూచనలు జారీ చేసింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత దాదాపు 1600 మందికి పైగా భారత పౌరులను ఇరాన్ నుంచి తరలించింది. ఇక, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల పశ్చిమాసియా దేశాల నుంచి దాదాపు 6 లక్షల మంది భారత పౌరులు స్వదేశానికి తిరిగొచ్చినట్లు విదేశాంగశాఖ వెల్లడించింది.

ఇదిలాఉండగా.. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య

...మిగతా 2లో

### ఫిలిప్పీన్స్‌లో భూకంపం

## 32మంది మృతి

- సునామీ హెచ్చరికలు జారీ



శాంటోస్, జూన్ 8 : దక్షిణ ఫిలిప్పీన్స్‌ను సోమవారం తెల్లవారుజామున భారీ భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.8గా నమోదైంది. ఈ భూకంపం ధాటికి 32 మంది మృతి చెందగా.. దాదాపు 200 మంది గాయపడినట్లు సమాచారం. మరోవైపు, తీరప్రాంతంలోని పలు నగరాల్లో ఆస్తి నష్టం చోటు చేసుకొంది. ఈ భూప్రకంపనలకు జనరల్ శాంటోస్ నగరం వణికిపోయింది. ఈ నగరంలో 7 లక్షల మంది జనాభా ఉంటారు. ఇక్కడ ట్యూనా ప్రాసెసింగ్ పరిశ్రమ చాలా పెద్దది. జనరల్ శాంటోస్ అంతర్జాతీయ విమానాశ్రయం కూడా తీవ్రంగా దెబ్బతింది.

ఈ ప్రకృతి విలయాన్ని గత కొన్ని దశాబ్దాల్లో ఫిలిప్పీన్స్‌ను తాకిన అత్యంత శక్తిమంతమైన భూకంపాల్లో ఒకటిగా పేర్కొంటున్నారు. ఈ భూకంపం ప్రభావానికి పలు భవనాలు కుప్పకూలిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. జనరల్ శాంటోస్‌లో పలు భవనాలు పాక్షికంగా కుప్పకూలగా.. అక్కడి అంతర్జాతీయ విమానాశ్రయం సైతం స్వల్పంగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ఓ ముఖ్యమైన వంతెనకు బీటలు ఏర్పడిన అధికారులు చెబుతున్నారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భూకంపం రాగానే.. ప్రభావిత తీర ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేసిన అధికారులు.. తక్షణమే ఎత్తైన ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు.

జనరల్ శాంటోకు నైరుతి దిశగా

...మిగతా 2లో

### మైక్ కిందపడేసి..

## ఇంటర్వ్యూను వదిలిన ట్రంప్

వాషింగ్టన్, జూన్ 8 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వ్యవహారశైలితో తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో బహిరంగంగా తన అసహనాన్ని వ్యక్తంచేసిన ఆయన.. మైక్ తీసి కిందపడేశారు. ఇక చాలు అంటూ బయటకు వెళ్లిపోయారు.

మీట్ ది ప్రెస్ ఇంటర్వ్యూలో భాగంగా ఇరాన్ యుద్ధంపై ట్రంప్‌నకు ప్రశ్నలు ఎదురయ్యాయి. ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న చర్చలు ఎక్కడివరకు వచ్చాయని హోస్ట్ అడిగారు. అలాగే గత ప్రభుత్వం అన్యాయంగా పలువురిని లక్ష్యంగా చేసుకుందని ఆరోపిస్తూ.. వారికి పరిహారం ఇచ్చే ఉద్దేశంతో ప్రతిపాదించిన యాంటీ వెపనైజేషన్ స్కీమ్‌ను గురించి ప్రశ్నించారు. ఈ చర్చ సందర్భంగా మీడియాపై ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. అలాగే 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ తాను చేసిన ఆరోపణలను సమర్థించుకున్నారు. అయితే వీటన్నింటికి ఆధారాలు చూపించాలంటూ హోస్ట్ క్రిస్టెన్ వెల్కర్ పదేపదే అడిగారు. దీంతో ట్రంప్ సహనం కోల్పోయారు.

''చాలా ఆధారాలున్నాయి. ఆ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది. మళ్లీ ఇప్పుడు కాలిఫోర్నియాలో జరుగుతోన్న మేయర్ ఎన్నికల్లోనూ అదే



...మిగతా 2లో

# కశ్మీర్‌లో జోజిలా టన్నెల్.. ప్రారంభానికి సిద్ధం

కశ్మీర్, జూన్ 8 : జమ్ముకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలను అనుసంధానించే జోజిలా టన్నెల్ ప్రాజెక్టు మరో చారిత్రక మైలురాయిని చేరుకుంది. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం జోజిలా టన్నెల్‌ను ప్రారంభించనున్నారు. 13.153 కిలోమీటర్ల పొడవైన ఈ టన్నెల్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమవుతున్న సింగిల్ ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగ మార్గంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాజెక్టు పూర్తైన తర్వాత శ్రీనగర్-లద్దాఖ్ మధ్య నిరంతర రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.

# 32మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

8 మైళ్ల దూరంలో 6.2 మైళ్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో 10 అడుగుల ఎత్తున సునామీ అలలు విరుచుకుపడొచ్చని ఫిలిప్పీన్స్ వాసులను హెచ్చరించారు. మరోవైపు ఇండోనేషియా, మలేసియాలో 3 అడుగుల ఎత్తు వరకు సముద్రపు అలలు ఎగసిపడే అవకాశం ఉందని పసిఫిక్ సునామీ సెంటర్ పేర్కొంది. తైవాన్, జపాన్, పపువా న్యూ గునియా కూడా ప్రభావితం కావొచ్చని అంచనా వేశారు. ఫిలిప్పిన్స్ తీరంలో మూడడుగుల ఎత్తు వరకు సునామీ అలలు ఎగసిపడ్డాయి.

# తక్షణమే ఇరాన్‌ను వీడండి..

(మొదటి పేజీ తరువాయి)

ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది. టెహ్రాన్‌కు చెందిన మషహర్ పెట్రోకెమికల్ ప్లాంట్‌పై దాడి చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఘటనలో ప్లాంట్ తీవ్రంగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. నైరుతి ఇరాన్‌లో పెట్రో కెమికల్స్ ఎగుమతుల్లో మషహర్ కాంప్లెక్స్ అత్యంత కీలకమైనది.

# ఇంటర్వ్యూను వదిలిన ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతోంది. ఓటింగ్ పూర్తయినా కౌంటింగ్ ఆలస్యమవుతుండటం ఇందుకు నిదర్శనం'' అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ వల్ల ఆలస్యమవుతుండొచ్చని హోస్ట్ పేర్కొనగా.. ఆ వాదనను అధ్యక్షుడు తోసిపుచ్చారు. ఆ చర్చ తీవ్రరూపం దాల్చడంతో..''ఇక చాలు ఆపేద్దాం. థ్యాంక్యూ'' అంటూ మైక్రోఫోన్‌ను తీసేసి, కిందపడేశారు. ఇంటర్వ్యూను కొనసాగిద్దాం అంటూ హోస్ట్ కోరగా.. ఇప్పటికే చాలా సమయం ఇచ్చానంటూ మధ్యలోనే వెళ్లిపోయారు.

# పకడ్బందీగా 'సర్'

(మొదటి పేజీ తరువాయి)

పెట్రోలింగ్ ను నిర్వహించాలని సంబంధిత పోలీసు అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు.మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈసందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఈనెల 25న ప్రారంభం అవుతుందని, బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, తిరిగి వాటిని సేకరించాలని ఆయన సూచించారు. అలాగే ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పాల్గొనే బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్ల పేర్లను, ఫోన్ నెంబర్లను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేయాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా సమన్వయం చేసుకోవడానికి పోలీసు అధికారుల ఫోన్ నెంబర్లను కూడా ఎన్నికల అధికారులు సేకరించుకోవాలని సూచించారు.

ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలని డీఈఓలను ఆదేశించారు.

ఈసందర్భంగా హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ విధుల్లో పాల్గొనే అన్ని బీఎల్ఓలు, ఇతర అధికారులకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు, పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ), గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పాలనాధికారులు,డీఈఓలు, ఆయా జిల్లాల పోలీస్ కమిషనర్లు, డిప్యూటీ సీఈఓ (ఎఫ్ఏసీ), నోడల్ అధికారులు, పీఎం-ఐటీ, ఇతర సంబంధిత అధికారులు కూడా పాల్గొన్నారు.

# ప్రధాని మోడీని నిలదీయాలె

(మొదటి పేజీ తరువాయి)




నిధులు ఇచ్చారో, రాష్ట్ర అభివృద్ధికి నేనేం చేశానో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1674.74 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మియాపూర్‌లో నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం మాట్లాడుతూ ఎన్నికలకు ఆరు నెలల ముందు రాజకీయాలు మాట్లాడుకుందామనీ, ఈ రెండేళ్లు కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయనీ, ఈ ప్రధాన నగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కాలుష్యం కారణంగా ఢిల్లీలో స్కూళ్లు, ప్రధాని కార్యాలయాన్నే మూసేశారని, ముంబైలో వర్షాలు పడితే ప్రజలు పడవల్లో ప్రయాణిస్తారని గుర్తు చేశారు. నీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు రాకుండా కిషన్ రెడ్డి అడ్డుపుల్ల వేస్తున్నారనీ, సబర్మతి, గంగా, యమునా నదులను ప్రక్షాళన చేస్తే ఆహా, ఓహో అన్నారు. మూసీ ప్రక్షాళనకు సహకరించమని బీజేపీ ఎంపీలు మోడీని అడిగారా ? రాష్ట్రానికి విడుదల చేసే విషయంలో బీజేపీ ఎంపీలు ప్రధాని మోడీని నిలదీయాలని డిమాండ్ చేశారు. విశ్వనగరం అని గొప్పలు చెప్పుకుంటే సరిపోదనీ, అందుకు అనుగుణంగా అభివృద్ధి జరగాలన్నారు. అందుకే మెట్రో దశ విస్తరణ చేపడుతున్నాం, గాజులరామారంలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మిస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్‌లో లక్ష ఎల్ఐసీ, ఎంఐజీ ఇళ్లను కట్టి పేదల కష్టాలను తీరుస్తామనీ, ఎక్కడ ఉన్న వారికి అక్కడే ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. రాబోయే 24 నెలలు అభివృద్ధిపైనే మా దృష్టి ఉంటుంది. రాజకీయాలకు అతీతంగా నగరాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ మహా నగరం వేగంగా విస్తరిస్తోందనీ, ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి మహా నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించామని స్పష్టం చేశారు. పోలీస్, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం ఉండేలా సరిహద్దులు నిర్ణయించామనీ, జెండాలు, ఎజెండాలకు అతీతంగా మన నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని స్పష్టం చేశారు. చేవెళ్ల, మెదక్, మల్కాజ్‌గిరి ఎంపీలు బీజేపి వాళ్లే ఉన్నారనీ, ఆ ఎంపీలకు రాష్ట్రానికి నిధులు తెచ్చే బాధ్యత లేదా ? అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి నిధులు రాకుండా అడ్డుకుంటున్నది కిషన్ రెడ్డి కాదా ? మీ అవినీతి, అహంకారంతో తెలంగాణ ప్రజలకు నష్టం చేయకండి, నేను ప్రధానిని కలిస్తే కిషన్ రెడ్డి ప్రధానిని కలుస్తాడు, నేను కేంద్ర మంత్రిని కలిస్తే, ఆయన కేంద్ర మంత్రిని కలుస్తాడు, తెలంగాణకు నిధులు రాకుండా కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నాడనీ, ఇలాగే చేస్తే మీరు ఢిల్లీకి పోకుండా చేస్తారనీ, రాష్ట్రంలో మీకు పుట్టగతులు లేకుండా చేస్తారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎబోలాపై హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

మధ్య సమన్వయం తదితర అంశాలపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. శంషాబాద్ విమానాశ్రయంలో స్క్రీనింగ్, సర్వైలెన్స్ వ్యవస్థలను మరింత బలోపేతం చేశామనీ, ప్రభావిత దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించి వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు ఇద్దరు అనుమానితులను గాంధీలో ఐసోలేషన్‌లో ఉంచి వారి శాంపిల్స్‌ను టెస్టుల కోసం పూణేలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించగా, అక్కడ చేసిన టెస్టుల్లో వారిని వైరస్ నెగెటివ్ వచ్చిందని మంత్రికి వివరించారు. విదేశాల నుంచి వచ్చే కొంత మంది ప్రయాణికులు తమకు ఇచ్చిన అడ్రస్‌లో ఉండటం లేదని తెలిపారు. ఈ అంశంపై మంత్రి దామోదర సీరియస్‌గా స్పందించారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తమ చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలను కచ్చితంగా సక్రమంగా అందించాల్సిందేననీ, తప్పుడు సమాచారం ఇచ్చే వారిపై ఎపిడమిక్ డిసీజెస్ యాక్ట్ సహా వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. అనుమానిత శాంపిల్స్ సేకరణ, టెస్టులు చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం వద్దని అధికారులకు సూచించారు. తప్పుడు సమాచారం అందించినట్లయితే చట్టపరమైన చర్యలు, కేసుల నమోదు వంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని విమానాశ్రయంలోనే ప్రయాణికులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. విదేశీ ప్రయాణికులతో సమర్థవంతంగా కమ్యూనికేట్ చేసేందుకు ఇఫ్లూ సహకారం తీసుకోవాలనీ, ఎబోలా ప్రభావిత దేశాల్లో ఎక్కువగా మాట్లాడే ఫ్రెంచ్, అరబిక్, స్వామిలి సహా అవసరమైన విదేశీ భాషల్లో మాట్లాడగల సిబ్బందిని 24 గంటల్లో విమానాశ్రయంలో అందుబాటులో ఉంచాలని ఈ సందర్భంగా మంత్రి దామోదర అధికారులకు స్పష్టం చేశారు.

# సీఎంపై బీఆర్ఎస్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధాంతాలను పాటిస్తామని సీఎం చెప్పలేదని స్పష్టం చేశారు. సోమవారం సీఎల్పీ మీడియా సెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఏదైనా పని సాధించే వరకు విశ్రమించని వాడిని హిట్లర్ అంటారనీ, అదే స్ఫూర్తితో ఏ పనినైనా పట్టుదలతో సాధించాలని మాత్రమే సీఎం చెప్పారని స్పష్టం చేశారు. దాన్ని నాజీ హిట్లర్‌తో పోల్చడం సరికాదని వ్యాఖ్యానించారు. గతంలో కూడా కేసీఆర్ తాను హిట్లర్‌నని వ్యాఖ్యానించారనీ, ఆ మాటలు అన్న కేసీఆర్ హిట్లర్ సిద్ధాంతాన్ని అమలు పరిచారా ? కేటీఆర్ మీ నాన్నను అడుగని నిలదీశారు. భూకబ్జాదారుల గుండెల్లో భయం పుట్టిస్తుంటే కొందరు ఓర్వలేక పోతున్నారని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. హైడ్రా చట్ట పరిధిలోనే పని చేస్తుందనీ, రాజ్యాంగం, చట్టం ప్రకారమే నోటీసులు ఇస్తుందని పేర్కొన్నారు. ఒకరు విదేశాలు, మరొకరు జిల్లాలు తిరుగుతూ రాజకీయ విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేస్తున్నారు. తాపీ మేస్త్రీకి తలనొప్పి వస్తే గోడ కూలిన చందంగా కేటీఆర్ వ్యవహార శైలి ఉందనీ, కేసీఆర్ కేటీఆర్ ప్రజాస్వామిక విలువల గురించి మాట్లాడటమంటే గురివింద గింజ తన కింద నలుపు ఎరుగట్లేనన్నారు. కేటీఆర్ అంబేద్కర్ గురించి మాట్లాడటం అంటే శతాబ్దపు జోకేనన్నారు. పదేళ్లపాటు కేసీఆర్ సెక్రటేరియట్‌కు రాలేదనీ, ప్రగతి భవన్‌కు ఎవరినీ రానివ్వలేదనీ స్వయంగా మంత్రులు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను కూడా రానివ్వలేదని విమర్శించారు. నాజీలు పెట్టిన హిట్లర్ బంకర్‌లా ప్రగతి భవన్ ఉండేదనీ, వాటిని మేం తొలగించాం, అది గాంధీ మార్గమా ? ఫోన్ ట్యాపింగ్ చేయడం ప్రజాస్వామ్యమా ? అని ప్రశ్నించారు. దొంగతనాలు, కబ్జాలు జరుగుతుంటే మహాత్మా గాంధీ చేతులు కట్టుకుని కూర్చొమ్మని చెప్పలేదనీ, ప్రభుత్వ భూములను కబ్జా నుంచి రక్షిస్తే బీఆర్ఎస్ నాయకులు ఎందుకు బాధపడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పైన ప్రజలు ఎందుకు విసిగిపోయారు ? దేని గురించి విసిగిపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు. మా డీఏన్ఏలో హింస లేదు, దాన్ని సహించమనీ, బీఆర్ఎస్ తాలిబన్ విధానంలో పని చేస్తే అందరూ అదే విధంగా పని చేస్తారని అనుకుంటోందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు.

# 2027 నాటికి అన్ని ప్రాజెక్టులు పూర్తిజేస్తాం

- భూసేకరణ, పునరావాస పనులు
- మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలి
- మంత్రి ఉత్తమ్ ఆదేశం

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 2027 నాటికి ప్రధాన ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇందుకు భూసేకరణ, పునరావాస పనులు మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నీటి పారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించి పాలమూరు ప్రాజెక్టులపై ఫాస్ట్రాక్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం జూన్ 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి ఉత్తమ్ అధికారులకు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కీలక దశ డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని ఆజ్ఞాపించారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం పంప్ హౌస్లకు తక్షణమే విద్యుత్ కనెక్టివిటీ కల్పించాలన్నారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు కోసం 2,200 ఎకరాల భూసేకరణ ప్రారంభమైందని ఉత్తమ్ తెలిపారు. రాజీవ్ భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల భూసేకరణకు గడువు ఖరారు చేయాలని మంత్రి ఆదేశించారు. నెట్టెంపాడు ప్రాజెక్టుతో అదనంగా 58 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో సౌర విద్యుత్ వినియోగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. పనితీరు సరిగా లేని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాలమూరు రైతుల దశ మార్చే ప్రాజెక్టులపై ప్రభుత్వం ఫుల్ ఫోకస్ పెట్టినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు.

## హెచ్‌సీఏ అధ్యక్షుడు

# అమర్‌నాథ్ ఎన్నిక చెల్లదు

(మొదటి పేజీ తరువాయి)




తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా, హెచ్‌సీఏ కార్యకలాపాలు ఆగకూడదనే ఉద్దేశంతో రన్నరప్‌గా నిలిచిన అమర్‌నాథ్‌ను అధ్యక్షుడిగా జస్టిస్ కైత్ ప్రకటించారు.అయితే, రన్నరప్‌గా ఉన్న వ్యక్తిని అధ్యక్షుడిగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం అమర్‌నాథ్ ఎన్నిక నిబంధనలకు విరుద్ధమని తేల్చడంతో హెచ్‌సీఏ చర్చనీయాంశమైంది.

# గయానాలో డాక్టర్.. ఇండోర్‌లో పేషెంట్

- అరుదైన హార్ట్ సర్జరీ

ఇండోర్, జూన్ 8 : భారత సంతతి డాక్టర్ వైద్య రంగంలో అరుదైన ఘనత సాధించారు. గయానా దేశంలో ఉన్న డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ భారత్‌లోని ఇండోర్‌లో ఉన్న పేషెంట్‌కు రోబోటిక్ హార్ట్ సర్జరీ చేసి రికార్డు సృష్టించారు. 20,000 కిలోమీటర్ల దూరం నుంచి రిమోట్ సాయంతో ఈ ఆపరేషన్ చేసి.. అత్యంత సుదూర రోబోటిక్ కార్డియాక్ టెలిసర్జరీ చేసిన వైద్యుడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పారు.

దీంతో గతంలో ఫ్రాన్స్ నుంచి భారత్‌లోని ఇండోర్‌లో ఉన్న పేషెంట్‌కు(10,000 కిలోమీటర్ల కమ్యూనికేషన్ దూరం)లో నిర్వహించిన రోబోటిక్ కార్డియాక్ టెలిసర్జరీ రికార్డును డాక్టర్ సుధీర్ అధిగమించారు. భారత్‌లో అభివృద్ధి చేసిన ఎస్ఎస్ఐ మంత్ర సర్జికల్ రోబోటిక్ సిస్టమ్‌ను ఉపయోగించి ఈ శస్త్రచికిత్సను నిర్వహించారు. ఈ ప్రక్రియ కోసం టెలి-సర్జన్ కన్సోల్‌ను ఉపయోగించారు. ఇది ఒక కాంపాక్ట్ చైర్-ఆధారిత రోబోటిక్ నియంత్రణ వ్యవస్థ. భౌగోళికంగా దూరంగా ఉన్నప్పటికీ ఇండోర్‌లోని రోబోటిక్ చేతులు, శస్త్రచికిత్స పరికరాలు సర్జన్ చేతి కదలికలను అనుకరిస్తూ శస్త్రచికిత్స నిర్వహించాయి.

హై-డెఫినిషన్ త్రీడీ విజువలైజేషన్, అధునాతన రోబోటిక్ నియంత్రణలు ఈ సంక్లిష్టమైన గుండె శస్త్రచికిత్సను కచ్చితత్వంతో నిర్వహించడానికి సహాయపడ్డాయని డాక్టర్ పేర్కొన్నారు. ఆపరేషన్‌కు భారత్‌లోని మణిపాల్ హాస్పిటల్స్, పలువురు డాక్టర్లు సహకరించినట్లు వెల్లడించారు. ఈ ఘనత దేశ ఆరోగ్య సంరక్షణ రంగంలో ఓ విప్లవాత్మకమైన ఘట్టంగా గయానా అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ ఇర్ఫాన్ అలీ అభివర్ణించారు.

# విడిపోతే పడిపోతాం

(మొదటి పేజీ తరువాయి)

విజ్ఞప్తి చేశారు. 'ఓటు చోరీ' వంటి పలు అంశాల విషయంలో భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం లోపించడం, కూటమిలో భాగస్వామ్యం కలిగిన కొన్ని పార్టీలు సైతం కాంగ్రెస్‌పై తరచు విమర్శలు చేస్తుండటంపై రాహుల్ గాంధీ అంసతృప్తి వ్యక్తం చేసారు. గత లోక్‌సభ ఎన్నికలను ప్రస్తావిస్తూ, బీజేపీని ఓడించడం కష్టమేమీ కాదని, అయితే అంతర్గత కుమ్ములాటతోనే మనకు మనం బలహీనమవుతున్నాయనే విషయాన్ని విపక్షాలు గుర్తించాలని సూచించారు. 2019 లోక్సభ ఎన్నికల్లో బీజేపీ 303 సీట్లు సాధించినప్పటికీ ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్లకే పరిమితమైంది. 2019లో 52 సీట్లు మాత్రమే సాధించిన కాంగ్రెస్ పార్టీ అనంతరం జరిగిన 2024 ఎన్నికల్లో 99 స్థానాలు గెలుచుకుంది. ఇటీవల లోక్‌సభలో విపక్షాలన్నీ ఏకతాటిపై నిలబడటంతో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విజన బిల్లు వీగిపోయింది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల జరిగిన సుమారు నెలరోజుల్లోనే 'ఇండియా' కూటమి తాజాగా ఢిల్లీలో సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో అస్సాం, బెంగాల్లో బీజేపీ విజయం సాధించగా, కేరళలో కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. తమిళనాడులో టీవీకే విజయ్ విజేతగా నిలిచారు. పూర్తి మెజారిటీ రాకపోవడంతో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల మద్దతుతో అధికారం చేపట్టారు. కాగా, మూడేళ్ల క్రితం జాతీయ స్థాయిలో ఏర్పడిన 'ఇండియా' కూటమి ఇకనుంచి ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని న్యూఢిల్లీ సమావేశంలో నిర్ణయించారు. తదుపరి సమావేశం వచ్చే ఆగస్టులో హైదరాబాద్‌లో జరుపుతామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు.

# నేడే చేప ప్రసాదం



(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు, దీనివల్ల జనాల రద్దీని సమర్థంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.ఈ చేప ప్రసాదం ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు చికిత్సగా బత్తిని కుటుంబం దశాబ్దాలుగా అందిస్తోంది. ఈ ఏడాది టోకెన్ విధానం ప్రవేశపెట్టడం ద్వారా రద్దీని నియంత్రించడంతో పాటు, పంపిణీ ప్రక్రియను మరింత సజావుగా నిర్వహించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ టోకెనులు ఎగ్జిబిషన్ గ్రౌండ్ దగ్గరే అందుబాటులో ఉండనున్నా యి. రద్దీ ఆధారంగా పంపిణీ సమయాలను నిర్ణయిస్తారు.

**చేప ప్రసాదం చివరి వ్యక్తికి కూడా అందాలిః**

ప్రజలునమ్మకం విశ్వాసంతో అధిక సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్నారు. సోమవారం ప్రభుత్వ సలహాదారులు, మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ లతో కలసి జిల్లా కలెక్టర్ చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో పాల్గొని బత్తిని కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. దాదాపు 180 సంవత్సరాలుగా కొనసాగుతున్న చేప ప్రసాదం పంపిణీ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న బత్తిని కుటుంబం సేవలను ఆమె ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కార్యక్రమం నిర్వహణకు గత 15 నుంచి 20 రోజులుగా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టిందన్నారు. రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో అధికారులు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షణచేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మత్స్య శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని అన్నారు. అలాగే అన్ని శాఖలు సమన్వయంతో కలసి పనిచేస్తున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. చేప ప్రసాదం స్వీకరించిన ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బత్తిని కుటుంబ సభ్యులకు మరోసారి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, నాంపల్లి తహసీల్దార్ నయిాముద్దీన్, మారేడుపల్లి తహసీల్దార్ అసదుల్లా తదితర అధికారులు పాల్గొన్నారు.

# నీట్ రీ-ఎగ్జామ్..

(మొదటి పేజీ తరువాయి)

పరికరాలేవీ వీరికి అందుబాటులో ఉంచలేదట. కేవలం అనుమతి పొందిన సిబ్బందికి మాత్రమే ఈ ప్రాంగణంలోకి ప్రవేశం కల్పిస్తున్నారు. జూన్ 21న నీట్ రీ-ఎగ్జామ్ పూర్తయ్యేంతవరకు వీరు ఈ లాక్‌డౌన్‌లోనే ఉండనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి.

నీట్ పేపర్ లీక్‌తో జాతీయ టెస్టింగ్ ఏజెన్సీపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. దీంతో రీ-ఎగ్జామినేషన్ విషయంలో అలా జరగకుండా పక్కా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకోసం మల్టీ లేయర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించినట్లు ఇప్పటికే అధికారులు వెల్లడించారు. పేపర్ తయారీ నుంచి ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజీ, రవాణా, పంపిణీ వరకు అన్ని దశల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలుచేస్తున్నారు. పేపర్ రవాణా కోసం వాయుసేన విమానాలను వినియోగించనున్నారు.

ఇదిలాఉండగా.. రీ-ఎగ్జామ్ పేపర్ సైతం లీక్ అయిందంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. దీన్ని ఎన్టీఏ తీవ్రంగా ఖండించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం అవాస్తవం, మోసపూరితమని పేర్కొంది. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా మే 3న నీట్ పరీక్ష జరగ్గా.. ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం తీవ్ర దుమారం సృష్టించిన విషయం తెలిసిందే. దీంతో మే 12న ఆ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహిస్తామని ఎన్టీఏ ప్రకటించింది. జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.15 వరకు నీట్ యూజీ రీ-ఎగ్జామినేషన్ జరగనుంది.

# హమ్మయ్య.. రుతుపవనాలు వచ్చేశాయ్?

## 2-3 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశం

హైదరాబాద్, మనం ప్రతినిధి : గత కొంతకాలంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రంలోకి సోమవారం ప్రవేశించాయి. నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా ఇవి రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. దీంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. ఈ నెల 4న కేరళను తాకిన రుతుపవనాలు క్రమంగా కదులుతూ కర్ణాటక, ఏపీలోని పలు ప్రాంతాలను దాటి తెలంగాణలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో రానున్న రెండు, మూడు రోజుల్లో తెలంగాణలోని మరిన్ని ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్లోని ఇతర ప్రాంతాలకు ఇవి విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, జూన్ 11-12 తేదీల మధ్య రుతుపవనాలు గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతాన్ని తాకే అవకాశం ఉంది. జూన్ 15 నుంచి 18వ తేదీలోగా రాష్ట్రంలోని మధ్య, ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఇవి పూర్తిగా విస్తరిస్తాయని భావిస్తున్నారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఉక్కు కర్మాగాయం ఉద్యోగులు కాగా, ముగ్గురు ఒప్పంద కార్మికులని అధికారులు వివరించారు. మరోవైపు రావూరి మల్లికార్జునరావు, అర్జున అప్పారావు, సూరిబాబు, పల్లెల శ్రీనివాస్, సత్యనంద్, పైడిరాజులను సమీపంలోని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, ఇప్పటి వరకు 9 మంది మృతి చెందినట్లు అధికారులు ధృవీకరించారు. మృతదేహాలను స్టీల్ ప్లాంట్ జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

కర్మాగారంలోని స్టీల్ మెల్ట్ షాప్ ఎస్ఎంఎస్-2 విభాగంలో ద్రవరూప ఉక్కును తరలిస్తున్న సమయంలో ఒక్కసారిగా ల్యాడిల్ నుంచి హాట్మెటల్ బకెట్లు కిందపడిపోయాయి. ఈ ఊహించని ఘటనతో వేడివేడి ద్రవం ఒక్కసారిగా చుట్టుపక్కల ప్రాంతంలో పెద్దమొత్తంలో ఒలికిపోయింది. ఆ సమయంలో అక్కడ విధుల్లో ఉన్న పలువురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్లాంట్ లో 1500 హీట్ డిగ్రీస్ వేడితో వెళ్తున్న స్టీల్ మెటల్ లిక్విడ్ లాడిల్ నుంచి కింద పడటంతో 8 మంది కార్మికులు అక్కడికక్కడే మరణించారు. మరుగుతున్న ద్రవం నేరుగా కార్మికులపై పడటంతో కార్మికులంతా బూడిదయ్యారు. మృతుల్లో కాంట్రాక్ట్ కార్మికులు, రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరోవైపు మంటలు ఎగసిపడుతుండగా.. వాటిని అదుపుచేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ప్రమాద తీవ్రత కారణంగా మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విశాఖ ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. మృతుల కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలిపారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై అధికారులతో మాట్లాడారు. పలువురు కార్మికులు చనిపోవడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఘోర ప్రమాదంపై కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖమంత్రి హెచ్డీ కుమారస్వామి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడానని, అక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులను అధికారులు పరిశీలిస్తున్నారని బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. విజయనగరం పర్యటనలో ఉన్న హోంమంత్రి అనిత.. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన విశాఖకు బయలుదేరారు.

విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించి వివరాలపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అనిత హామీ ఇచ్చారు. కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఘటనపై ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో కార్మికులు మృతిచెందడం తీరని విషాదమని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేశారు.

గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రంగం క్షతగాత్రులకు వైద్యం, ప్రమాద స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తుందని ట్వీట్ చేశారు

విశాఖ స్టీల్స్‌లో గతంలోనూ పలు మార్లు భారీ ప్రమాదాలు జరిగాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 2012లో 19 మంది ప్రాణాలు కోల్పోయిన ఘోర ప్రమాదం తర్వాత మరోసారి స్టీల్ ప్లాంట్లో విషాదం చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది..

అలాగే 2012 జూన్ 13న జరిగిన ప్రమాదం స్టీల్ ప్లాంట్‌లో ఆక్సిజన్ ప్రెజర్ టెస్టింగ్ చేస్తుండగా పేలుడు సంభవించి.. ఏకంగా 19 మంది సజీవ దహనమయ్యారు. ఇందులో ఐదుగురు జీఎం స్థాయి సీనియర్ అధికారులు ఉన్న విషయం విదితమే.

# సాంకేతికంగా మరింత బలోపేత కావాలి

- పోలీసు అధికారులకు డీజీపీ ఆదేశాలు



హైదరాబాద్, జూన్ 8(మనం,ప్రత్యేక ప్రతినిధి): దేశంలోనే సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ముందంజలో నిలిచిన తెలంగాణ పోలీస్ శాఖ టెక్నాలజీ పరంగా మరింత ముందుకు సాగాలని డీజీపీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని యూనిట్ అధికారులతో సోమవారం డీజీపీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ . ఇటీవలి కాలంలో అందుబాటులో ఉన్న టెక్నాలజీ వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం, క్షేత్ర స్థాయిలో అమలులో లోపాలు ఉండటం వల్ల కొన్ని అంశాల్లో వెనుకబడిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. టెక్నాలజీ అనేది కేవలం సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధితో మాత్రమే పరిమితం కాకుండా వాటిని సమర్థవంతంగా వినియోగించడం, సమాచార సవరణ, రియల్ టైమ్ డేటా నిర్వహణపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉన్న డిజిటల్ పోలీసింగ్ అప్లికేషన్‌లు, టీజీ కాప్ యాప్స్, ఇతర సాంకేతిక వేదికల అభివృద్ధి, వాటి అమలుపై ప్రతీ ఒక్కరూ దృష్టిసారించాలన్నారు. వ్యవస్థలను రూపొందించడం మాత్రమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం అత్యంత ముఖ్యమని తెలిపారు.

**టెక్నికల్ టీమ్ :**

పోలీస్ శాఖలో టెక్నికల్ అంశాలపై నిరంతర అభివృద్ధి, పర్యవేక్షణ, అమలు కోసం ప్రత్యేక టెక్నికల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. ఈ బృందం ద్వారా సాంకేతిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారాలను వేగవంతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు.ప్రతి డేటా ఫీల్ స్థాయిలో రియల్ టైమ్‌లో అప్డేట్ అవుతూ ఉండాలని, వ్యవస్థల్లో నమోదయ్యే సమాచారం ఖచ్చితంగా, సమగ్రంగా ఉండాలని డీజీపీ సూచించారు. ప్రస్తుతం చేపట్టిన డిజిటల్ కార్యక్రమాల్లో సుమారు 60 శాతం వరకు మాత్రమే పురోగతి సాధించామని, అయితే ఆశించిన స్థాయిలో అమలు జరగలేదని తెలిపారు.రియల్ టైమ్ ఇన్వెస్టిగేషన్‌లో డిజిటల్ ఫోరెన్సిక్స్, డిజిటల్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్ , సాంకేతిక ఆధారిత దర్యాప్తు విధానాలను మరింత విస్తృతంగా వినియోగించాలన్నారు. టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా దర్యాప్తు వేగవంతం కావడంతో పాటు నేర పరిశోధనల్లో నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు.

**డిజిటల్ రికార్డులు:**

పోలీసు శాఖలోని అధికారులు సీసీటీఎన్ఎస్, ఎస్సీఆర్‌బీ రిపోర్టులు డేటాబేస్‌తో పాటు ఇతర డిజిటల్ రికార్డులను నిరంతరం అప్‌డేట్ చేయాలని అధికారులకు డీజీపీ ఆదేశించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పలు అప్లికేషన్‌లు , ఫిట్నెస్ ఎగ్జామినేషన్ మాడ్యూల్స్, సీడీ పార్ట్ అవర్స్ వంటి వ్యవస్థలు పూర్తిస్థాయిలో వినియోగించ లేదన్నారు.ప్రత్యేకంగా ఎస్‌హెచ్‌ఓలు కేసులకు సంబంధించిన ప్రతి అంశాన్ని సమయానికి సిస్టమ్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎఫ్ఐఆర్‌లు, క్రైమ్ వివరాలు, సీడీ పార్ట్స్, 41 సీఆర్‌పీసీ, అరెస్ట్ వివరాలు, ఫామ్-54, సైంటిఫిక్ ఎవిడెన్స్, చార్జీషీట్లు వంటి అంశాలను నిర్దిష్ట సమయంలో అప్‌డేట్ చేయాలన్నారు. దీంతో డేటా ఆధారిత పోలీసింగ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.రియల్ టైమ్ మానిటరింగ్ సిస్టమ్‌ను సమర్థవంతంగా వినియోగిస్తే క్రైమ్ అనాలిసిస్, మంత్లీ క్రైమ్ రివ్యూలు, ట్రెండ్ స్టడీస్, కేసుల పర్యవేక్షణ మరింత సులభతరం అవుతుందని డీజీపీ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీజీపీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, డీజీ టెక్నికల్ సర్వీసెస్ వి.వి. శ్రీనివాసరావు, డీజీ ఆర్గనైజేషన్ స్వాతి లక్రా, సాంకేతిక విభాగ అధికారులతో పాటు వివిధ యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆగస్టు నుంచి రైల్వే కొత్త రిజర్వేషన్ సిస్టమ్

## ప్రయాణికులకు మరింత సులువుగా రైల్వే టికెట్లు



హైదరాబాద్, మనం ప్రతినిధి : భారతీయ రైల్వే ప్రయాణికులందరికి భారీ శుభవార్త చెప్పింది. టికెట్ బుకింగ్ విధానంలో గత కొన్ని దశాబ్దాలుగా ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. ఆగస్టు నుంచి సరికొత్త 'ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్' విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. దాదాపు 1986 నుంచి వాడుకలో ఉన్న పాత సాంకేతిక విధానాన్ని ఈ సరికొత్త వ్యవస్థతో పూర్తిగా మార్చేయనుంది.

**మరింత వేగంగా బుకింగ్స్**

ఈ సరికొత్త అప్ గ్రేడ్ వల్ల ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. దీనివల్ల నిమిషాల వ్యవధిలోనే లక్షలాది టికెట్లను ఎలాంటి సర్వర్ సమస్యలు లేకుండా బుక్ చేసుకోవచ్చు. ఈ కొత్త సిస్టమ్కు మారే ప్రక్రియపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలోని రైల్ భవన్లో ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సాంకేతిక మార్పుల సమయంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగరాదని అధికారులను ఆదేశించారు.

**డిజిటల్ వైపు ప్రయాణికులు**

రైల్వే శాఖ 2002 సంవత్సరంలో ఇంటర్నెట్ ఆధారిత టికెట్ బుకింగ్ను ప్రారంభించింది. అప్పటి నుంచి కౌంటర్ల కంటే ఆన్లైన్లో బుక్ చేసుకునేవారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న మొత్తం రైల్వే టికెట్లలో దాదాపు 88 శాతం బుకింగ్స్ కేవలం డిజిటల్ ప్లాట్ఫామ్ల ద్వారానే జరుగుతున్నాయి. ఈ భారీ డిమాండ్‌కు అనుగుణంగానే పాత వ్యవస్థను అధునాతన సాంకేతికతతో రైల్వే మారుస్తోంది.

**'రైల్ వన్' యాప్ రికార్డు..**

రైల్వే శాఖ డిజిటల్ విప్లవంలో భాగంగా గతేడాది జులైలో ప్రారంభించిన 'రైల్ వన్' యాప్ సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం ఏడాది లోపే ఈ యాప్ 3.5 కోట్ల డౌన్లోడ్లను దాటేసింది. ఈ ఒక్క యాప్ ద్వారానే టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, రైలు లైవ్ స్టేటస్, ప్లాట్ఫామ్ సమాచారం, ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రస్తుతం ఈ యాప్ ద్వారా రోజూ సుమారు 9.29 లక్షల టికెట్లు బుక్ అవుతున్నాయని రైల్వే శాఖ వెల్లడించింది.

**ఏఐ వెయిటింగ్ లిస్ట్**

కొత్త సిస్టమ్తో పాటు ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వెయిటింగ్ లిస్ట్ టూల్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతోంది. మనం బుక్ చేసుకున్న వెయిటింగ్ లిస్ట్ టికెట్ కన్ఫర్మ్ అవుతుందా లేదా అనే అవకాశాలను ఈ టూల్ ముందుగానే అంచనా వేస్తుంది. దీని అంచనా కచ్చితత్వం గతంలో 53 శాతంగా ఉండగా.. ఇప్పుడు ఏకంగా 94 శాతానికి పెరిగింది. దీనివల్ల ప్రయాణికులు తమ ప్రయాణ ప్లాన్లను మరింత సులభంగా మార్చుకోవచ్చు.

# మహానందిలో యోగా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఈఓ




మహానంది, జూన్8,మనంన్యూస్: రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ ఆదేశాల మేరకు మహానంది లోని పోచా బ్రహ్మానంద రెడ్డి విశ్రాంతి భవనంలో యోగా శిక్షణా కార్యక్రమాన్ని వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ ల వేదమంత్రోచ్చారణ మధ్య ఈఓ శ్రీనివాస రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుండి 8వరకు జరిగిన యోగా శిక్షణలో గురువు సంపత్ గురూజీ పాల్గొని యోగాసనాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈఓ మధు, సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి, నీలకంటేశ్వర రాజు, సుబ్బారెడ్డి,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసులు 'ప్రణాళిక'లకు ప్రాధాన్యమివ్వాలి

- సీపీల సమావేశంలో డీజీపీ ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 8(మనం,ప్రత్యేక ప్రతినిధి): రాష్ట్ర పోలీస్ శాఖకు సంబంధించి కమిషనరేట్ల, పోలీసు స్టేషన్‌ల పరిధులు, సరిహద్దు గ్రామాల విభజన అంశాలపై పోలీసులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సీపీలకు డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఈక్రమంలో డీజీపీ కార్యాలయంలో పోలీసు కమిషనర్‌లతో సోమవారం డీజీపీ విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీసు సర్కిళ్లు, జోన్లు, గ్రామాల పునర్విభజన వంటి అంశాలు అన్ని శాఖలకు అనుకూలంగా ఉండేలా పోలీసు కమిషనర్‌లు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా నేపాల్‌కు చెందిన వ్యక్తులు గృహ సేవకులుగా పనిచేస్తూ కొన్ని నేరాల్లో పాల్గొంటున్న నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా డొమెస్టిక్ సర్వెంట్స్ సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ముఖ్యంగా వారు ఎక్కడ నివసిస్తున్నారు, ఎక్కడ పనిచేస్తున్నారు అనే సమాచారాన్ని డేటాబేస్ రూపంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు.



సీసీటీఎన్ఎస్ 2.0 అమలు, సీఐడీ వ్యవస్థ బలోపేతం, మాన్యువల్ ప్రక్రియల ఆధునీకరణ, భవిష్యత్ కార్యాచరణలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నవంబర్ నెలలో పోలీస్ ట్రీట్ నిర్వహణతో పాటు అక్టోబర్‌లో మహిళా పోలీస్ కాన్ఫరెన్స్ నిర్వహించాలని నిర్ణయించామని, మహిళా పోలీసులకు 33 శాతం రిజర్వేషన్ సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, లా అండ్ ఆర్డర్, ఫీల్ డ్యూటీలలో మరింత అవకాశాలు కల్పించాలన్నారు.

**టెక్నాలజీకి ప్రాధాన్యం :**

పోలీసు శాఖలో సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలి పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగం మరింత పెరగాల్సిన అవసరం ఉందని డీజీపీ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్ ద్వారా కోర్ అప్లికేషన్లు, సీసీటీఎన్ఎస్ 2.0 అమలు, టీజీ కాప్స్ వ్యవస్థ వినియోగంపై డీజీపీ అధికారులు చర్చించారు. ముఖ్యంగా డయల్-100, రౌడీ షీటర్లు, వాహనాల సెర్చింగ్, హిస్టరీ షీటర్ల డేటా వంటి అంశాలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వేగంగా అందుబాటులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు.అలాగే ఏఐ ఆధారిత పోలీసింగ్, డ్రోన్స్, హెచ్‌ఆర్ఎంఎస్, డేటా ఇంటెలిజెన్స్, స్మార్ట్ అప్లికేషన్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో హోంశాఖ కార్యదర్శి శిఖా గోయల్,ఇంటెలిజెన్స్ డిజి విజయ్ కుమార్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, లా అండ్ ఆర్డర్ డిజి మహేష్ భగవత్, టి జి టెక్నికల్ సర్వీసెస్ డి జి వి వి శ్రీనివాస రావు, హైదరాబాద్ కమిషనర్ సజ్జనర్, ఆక్టోపస్ డీజీ అనిల్ కుమార్, హోమ్ గార్డ్స్ డీజీ స్వాతి లక్రా, మల్టి జోన్ -1 చంద్రశేఖర్ రెడ్డి, రోడ్ సేఫ్టీ ఐ జి రమేష్ నాయుడు, ఐ జి పి ఎల్ గజరావు భూపాల్, ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, సైబరాబాద్ కమిషనర్ ఎం రమేష్ రెడ్డి, మల్కాజిగిరి కమిషనర్ సుమతి తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యార్థులకు మరో శుభవార్త..

**2026-27 విద్యా సంవత్సరానికి సెలవులు ఖరారు**

**13 రోజులు దసరా, 5 రోజులు సంక్రాంతి సెలవులుంటాయని వెల్లడీ**

**23 ఏప్రిల్ 2027 చివరి పనిదినం...ఏప్రిల్ 24 నుండి జూన్ 13, 2027 వరకు వేసవి సెలవులు**



హైదరాబాద్, మనం ప్రతినిధి : రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు తెలంగాణ విద్యాశాఖ మరో కీలక వార్త చెప్పింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 2026-27 విద్యా సంవత్సరపు వార్షిక అకడమిక్ క్యాలెండర్‌ను సైతం పాఠశాల విద్యాశాఖ సోమవారం అధికారికంగా విడుదల చేసింది. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, సిలబస్ పూర్తి చేయడానికి వీలుగా మొత్తం 227 పనిదినాలను విద్యాశాఖ ఖరారు చేసింది. ఈ కొత్త క్యాలెండర్ ప్రకారం తెలంగాణలో ఎంతో వైభవంగా జరుపుకునే దసరా పండుగకు ఈసారి భారీగానే సెలవులు దక్కాయి. అక్టోబర్ 10, 2026 నుండి అక్టోబర్ 22, 2026 వరకు మొత్తం 13 రోజుల పాటు దసరా సెలవులను ప్రకటించారు. అలాగే సంక్రాంతి పండుగ పురస్కరించుకుని జనవరి 13, 2027 నుండి జనవరి 17, 2027 వరకు మొత్తం 5 రోజుల పాటు పాఠశాలలకు సెలవులు ఉంటాయి. ఈ విద్యా సంవత్సరానికి గానూ ఏప్రిల్ 23, 2027ను చివరి పనిదినంగా విద్యాశాఖ నిర్ణయించింది. ఆ తర్వాత ఏప్రిల్ 24, 2027 నుండి జూన్ 13, 2027 వరకు విద్యార్థులకు వేసవి సెలవులు ఉంటాయి. తిరిగి జూన్ 14, 2027న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయి. పాఠశాల విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నిర్దేశిత పనిదినాలు ఉండేలా ఈ క్యాలెండర్‌ను రూపొందించారు. నిర్ణీత సమయంలోగా సిలబస్‌ను పూర్తి చేయాలని, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా అకాడమిక్ ప్లాన్‌ను అమలు చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. ముఖ్యంగా అక్టోబర్‌లో వచ్చే దసరా సెలవులను, జనవరిలో వచ్చే సంక్రాంతి సెలవులను విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ప్రయాణ ప్రణాళికల కోసం ముందుగానే ప్లాన్ చేసుకునేలా ఈసారి ముందే స్పష్టతనిచ్చారు. ప్రైవేట్ పాఠశాలలు కూడా విద్యాశాఖ ప్రకటించిన ఈ అధికారిక క్యాలెండర్‌ను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. పరీక్షల పూర్తి వివరణాత్మక షెడ్యూల్ త్వరలోనే జిల్లాల వారీగా పాఠశాలలకు చేరనుంది.

# సీబీఎస్ఈ కీలక నిర్ణయం


- రీ-ఎవాల్యుయేషన్ నుంచి కోఎంప్ట్ సంస్థ తొలగింపు
- సీబీఎస్ఈ సొంత సర్వర్లలోకి డేటా మార్పిడి
- ఐఐటీ నిపుణుల కమిటీ సూచనతో నిర్ణయం
- పునఃసమీక్ష కోసం 1.6 లక్షల దరఖాస్తులు
- ఫలితాల కోసం వెబ్ సైట్ చూడాలని సూచన

హైదరాబాద్, మనం ప్రతినిధి : కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) సంచలన నిర్ణయం తీసుకుంది. 12వ తరగతి బోర్డు పరీక్షల జవాబు పత్రాల రీ-ఎవాల్యుయేషన్ ప్రక్రియ నుంచి 'కోఎంప్ట్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థను తప్పించింది. ఈ విషయాన్ని ఐఐటీ నిపుణుల కమిటీ సభ్యుడొకరు అధికారికంగా ధృవీకరించారు. ఈ ఏడాది బోర్డు ఫలితాల తర్వాత ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానంలో అనేక సాంకేతిక లోపాలు, గందరగోళం తలెత్తిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఈ సంస్థకు చెందిన సర్వర్లలో భద్రతా లోపాలు ఉన్నాయని సైబర్ నిపుణులు గుర్తించారు. దీంతో విద్యార్థుల మార్కులు, డేటా భద్రతను దృష్టిలో ఉంచుకుని సీబీఎస్ఈ తాజా నిర్ణయం తీసుకుంది. మొత్తం జవాబు పత్రాల డేటాను కోఎంప్ట్ సర్వర్ల నుంచి సీబీఎస్ఈ తన సొంత సర్వర్లలోకి మార్చేసింది. అయితే, ఇకపై రీ-ఎవాల్యుయేషన్ ప్రక్రియ మొత్తం సీబీఎస్ఈ అధికారిక వెబ్ సైట్ ద్వారానే జరగనుంది. దీనివల్ల విద్యార్థుల డేటాపై బోర్డుకు పూర్తి నియంత్రణ, భద్రత ఉంటుందని ఐఐటీ కాన్పూర్ నిపుణులు స్పష్టం చేశారు. అయితే ఈ సంస్థను తొలగించడానికి గల కచ్చితమైన కారణాలను బోర్డు ఇప్పటివరకు బహిరంగంగా వెల్లడించలేదు. కానీ ఐఐటీ మద్రాస్, ఐఐటీ కాన్పూర్ నిపుణుల కమిటీ సూచనల మేరకే ఈ మార్పు జరిగినట్లు తెలుస్తోంది. మరోవైపు ఫలితాల అనంతరం మార్కుల వెరిఫికేషన్, రీ-ఎవాల్యుయేషన్ కోసం విద్యార్థుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. జూన్ 3న ప్రారంభమైన ఈ దరఖాస్తుల విండో జూన్ 7 అర్ధరాత్రితో ముగిసింది. ఈ ఐదు రోజుల్లోనే దాదాపు 1.6 లక్షల మంది విద్యార్థులు సుమారు 3.8 లక్షల జవాబు పత్రాల పునఃసమీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారని బోర్డు వెల్లడించింది. అయితే దరఖాస్తు చేసుకునే సమయంలో కొంతమంది విద్యార్థులకు 'రోల్ నంబర్ నాట్ ఫౌండ్' అని రావడంపై సీబీఎస్ఈ స్పష్టత ఇచ్చింది. మొదటి దశ స్కాన్డ్ కాపీల కోసం దరఖాస్తు చేసుకోని వారికి మాత్రమే అలా చూపిస్తుందని బోర్డు స్పష్టం చేసింది. సైబర్ దాడులను అడ్డుకుంటూ సాంకేతిక బృందాలు ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని.. విద్యార్థులు ఎలాంటి అవాస్తవాలను నమ్మకుండా కేవలం అధికారిక వెబ్ సైట్‌ను చూడాలని సూచించింది.

# మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

## రాష్ట్ర మహిళలకు మంత్రులు సీతక్క ,పొన్నం ప్రభాకర్ పిలుపు

హైదరాబాద్, జూన్ 08(మనం న్యూస్): తెలంగాణ మహిళా సాధికారత చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న మహిళా శక్తి మహాసభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధి, నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఈ మహాసభ ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ మహాసభలో మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఆయన సభలో వివరించనున్నారు. అదే వేదికపై మహిళా సంఘాలకు ప్రస్తుతం అందుతున్న రూ.5 లక్షల రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. సభ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల చెక్కులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ అద్దె బస్సుల హైర్ చార్జీల కింద రూ.20.30 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్ఆర్టీసీకి రూ.199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న నమూనా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.అలాగే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు



ఇప్పటివరకు కలిగిన రూ.10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను సభలో వివరించనున్నారు. తెలంగాణ నలుమూలల నుంచి మహిళా శక్తి ఒకే వేదికపై సమీకృతం కానున్న ఈ మహాసభ, మహిళల ఆర్థిక ప్రగతి ప్రయాణంలో మరో చారిత్రక మైలురాయిగా నిలవనుంది. సోమవారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే భాగస్వాములుగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన, సూక్ష్మ వ్యాపారాల విస్తరణ, ఉపాధిఅవకాశాల పెంపునకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు ఈ మహాసభలో భాగస్వామ్యం కావాలని, మహిళా ఐక్యత, ఆత్మవిశ్వాసం, ఆర్థిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే ఈ చారిత్రక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# కార్పొరేట్‌కు దీటుగా ''తెలంగాణ గురుకులాలు ''

- విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యపై రాజీ లేదు
- ఫుడ్ పాయిజన్ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు
- గురుకులాల్లో అడ్మిషన్‌ల నుంచి అకాడమిక్స్ వరకు పూర్తి పారదర్శకత పాటించాలి
- టీజీఎస్డబ్ల్యూఆర్ఈఐఎస్ సిబ్బందితో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్ష



హైదరాబాద్, జూన్ 8(మనం న్యూస్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు రాష్ట్రంలోని పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలవిద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రాలని, విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, పోషకాహార విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, జోనల్ అధికారులు, ప్రధాన కార్యాలయ సిబ్బందితో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ గురుకులాలు నేడు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని అన్నారు. ఈ స్థాయికి తీసుకురావడంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు, క్రమశిక్షణ, భద్రత వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యంతో చూడాలని ఆదేశించారు.

**ఫుడ్ పాయిజన్ ఘటనలకు అవకాశం ఇవ్వొద్దు:**

ఇటీవలి కాలంలో కొన్ని విద్యాసంస్థల్లో చోటుచేసుకున్న ఆహార సంబంధిత ఘటనలను ప్రస్తావించిన మంత్రి, గురుకులాల్లో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల కొనుగోలు నుంచి వంట ప్రక్రియ, నిల్వ, పంపిణీ వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు.

**ప్రణాళికాబద్ధమైన బోధన:**

ఈ విద్యా సంవత్సరాన్ని మరింత ఫలవంతంగా మార్చేందుకు ప్రతి పాఠశాల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు.పీరియడ్ వారీగా పాఠ్యాంశాల బోధన, వారాంత సమీక్షలు, నెలవారీ విద్యా ప్రగతి నివేదికలు తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వారికి అదనపు అకాడమిక్ సపోర్ట్ అందించాలని తెలిపారు.పదో తరగతి, ఇంటర్మీడియట్, జేఈఈ, నీట్, క్లాట్, సీయూఈటీ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని మంత్రి స్పష్టం చేశారు.ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించాలని, అడ్మిషన్ల విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం,అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.విద్యుత్ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ, హాస్టల్ గదులు, వంటశాలలు, మరుగుదొడ్ల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు.విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని అడ్లూరి స్పష్టం చేశారు.

**విద్యార్థులే కేంద్రబిందువు:**

ప్రతి విద్యార్థిని తమ సొంత పిల్లలుగా భావించి చూసుకోవాలని, వారి విద్యా ప్రగతి మాత్రమే కాకుండా ఆరోగ్యం, మానసిక స్థితి, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. గురుకులాలు కేవలం పరీక్షల్లో మార్కులు సాధించే కేంద్రాలు కాకుండా, సమాజానికి బాధ్యతగల పౌరులను తయారు చేసే సంస్థలుగా నిలవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. సిబ్బంది సంక్షేమం, సేవా సంబంధిత అంశాలు, పరిపాలనా సమస్యలపై సంస్థ యాజమాన్యంతో ప్రత్యేకంగా చర్చించి సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సిబ్బంది సంతృప్తి, విద్యార్థుల విజయానికి పరస్పర సంబంధం ఉందని, అందుకే ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.తెలంగాణ గురుకులాలను దేశంలోనే అత్యుత్తమ రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి (ఎఫ్ఏసీ) కంభంపాటి శారద, డిప్యూటీ సెక్రటరీ డి. శ్రీనివాసులు, అసిస్టెంట్ సెక్రటరీ చిన్న సాయిలు, ఓఎస్‌డీ వై.జే. విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## మృగశిర కార్తె

ఎండలు మండే రోహిణి కార్తె
ఎండలు తగ్గి ఋతుపవనాలు
ప్రవేశిస్తే వార్తే
మృగశిర వర్షాలు తెచ్చే వర్ష కార్తె!
రైతన్నలకు శుభ వార్తే!
నిత్య జీవనోపాయ వర్ష ధార
పెద్దల అనుభవం ఎరిగిన
పవన ధార!
తొలకరి జల్లుల నిర్గం పండుగ
ప్రకృతి మార్పులు చెప్పకనే చెప్పగా
ఇంగువ బెల్లం ఇష్టంగా తినంగా
వ్యాధి నిరోధక శక్తి పెరుగు బలంగా!
తొలకరిలో వర్షాలు కురిస్తే
పుడమి తల్లి పులకరిస్తుంది
సమయానికి వర్షాలు కురిస్తే
రైతన్న ఏరువాక సాగిస్తే
నేలతల్లి సిరుల పంటలు కురిపిస్తుంది!
సర్వ ప్రాణులకు మృగశిర
చల్లని ఆనందాల ఆశల ధార!

**- పట్లోళ్ల బక్కారెడ్డి**
9705315250

## మృగశిర

తెలతెలవారంగా వెలుగుల కూత
ఉడుకు గాలుల కుతకుత
నరకం చూపిన కరెంటుకోతల కథ
ఉదయాలు ఎర్రని ఆకాశం
వేడి నిట్టూర్పుల వేసవిజీవితం
ముగించ మృగశిర రా
చరచర రవికిరణబాణాల
తడిసిన చెమట స్నానాల
చిట చిట ప్రాణాలను
కరుణించ మృగశిర రా
మాగాయ మహారుచులు
శర్కర శారపలుకుల
మధురఫల మామిడి పానకాలు
చలువ చల్లలు చెరుకు నిమ్మ రసాలు
పాల,పరికి,మొర్రి ,ఈత పండ్లు
తాటిముంజలు తేనీటి సంజలు
దూరముంచ మృగశిర రా
చెరువు ,వాగు ఈత సరదాలు
చన్నీటిస్నానాల సాయంత్రాలు
శెలవుల ఆటవివిడుపులకు
శెలవులిచ్చి మృగశిర రా
నీరు లేక ఎండిన వాగువంకలు
చెత్తాచెదారం నిండి పారని నాలాలు
గిరిపల్లెలు,కొండకోన గ్రామాల
తల్లడిల్లిన నీటిఎద్దడి కాలాలను
తనివితీర తడప తరలి మృగశిర రా
తొలకరి వానల్లో ఏరువాక సాగుబడులు
తలుపులుతెరుచుకొనే చదువుసందెల బడులు
ఒడినింపుకునే సుడులు లోతైన మడులు
అడుగడుగునా అందాలనీటి అలజడుల
వానకారుకు స్వాగతం పాడ మృగశిర రా
కొమ్మల కోటిచూపులు
అమ్మల కోనేటి ఎదురుచూపులు
ఆకలిని ఎడబాపే అమ్మల శ్వాసలు
ఆరుగాలం శ్రమించే అన్నదాతల ఆశలు
నైరుతి రుతుపవనాల
స్వరాల వరాల మృగశిర రా
మేఘాల పొలకువ
మెరుపుల మెలకువ
తొలకరి చినుకుల కువకువ
సూర్యుడిని కమ్మిన
నల్లనిమబ్బుల చల్లని వేకువ
హాయి రాగాల మిరుగై మృగశిర రా.

**- రమేశ్ నల్లగొండ**
8309452179

## చేప ప్రసాదం

తరతరాలుగా వస్తున్న నాటువైద్యం మోటువైద్యం
బాగుపడిన వాళ్లు బాగుపడుతుందని
నమ్మకం గల వాళ్లు పర్వాలేదని ఊగిస లాడెవాళ్లు
నమ్మకం తో వచ్చే వాళ్లు జనం పెరిగారు
బత్తిని సోదరుల చేపమందు
పేరు నలుదిశలా ప్రాకిపోయింది...
ఆస్తమాతో...ఉబ్బసంతో.. శ్వాసకోస వ్యాధితో
శత విధాల మందులువాడి నమ్మకం కోల్పోయి
దగ్గిదగ్గి ఆయాసంతో తల్లడిల్లి
నలుగురితో కలియతిరగ లేక
లో లోపలే కుమిలి పోయి
బతుకీడుస్తున్న వారికి ఉచితం గా చేప మందు
ఇంకే ముందీ
నగరంలో జనం రద్దీ
మృగశిర కార్తే మురిసింది...
చిన్న పెద్ద యువకులు
ముదుసలి ముతక
కాస్త వ్యాధి ఉన్నవాళ్లు
మెండికేసి తగ్గక బాధ పడెవాళ్లు
చేపమందైన
చేవమందని
ప్రకృతి చల్లబడె ముందు
రోగం కుదుటబడె మందని
రోగులు చీమల పుట్టల్లా...
చేప ప్రసాదం
ఉబ్బసానికి వరం మెరగం కార్తె
పంపిణీ రోజు అంటు జనం దూకుడు
నగరానిపు కీర్తి పెంచుడు

**- రేడియమ్**
9291527757

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం**
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి

– ఎడిటర్

# వ్యంగ్యాన్ని ఆయుధంగా మార్చిన ‘కాక్రోచ్’

భారత రాజకీయాల్లో కొత్త పార్టీలు, కొత్త ఉద్యమాలు, కొత్త నినాదాలు ఆవిర్భవించడం పెద్ద ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. కానీ ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వేదికగా వెలుగులోకి వచ్చిన ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సిజెపి) మాత్రం ఒక సాధారణ రాజకీయ పక్షంలా కాకుండా, వ్యవస్థపై ఎక్కుపెట్టిన ఒక వ్యంగ్యాత్మక డిజిటల్ నిరసన అస్త్రంగా చర్చనీయాంశమైంది. ఇది సంప్రదాయ రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా కాకుండా... నేటి యువతలో పెరుగుతున్న అసంతృప్తి, నిరుద్యోగ సమస్య, డిజిటల్ సంస్కృతి మరియు రాజకీయ విమర్శల సమ్మేళనంగా అర్థం చేసుకోవాల్సిన సరికొత్త పరిణామం ఇది.

ఈ సరికొత్త వేదిక ‘కాక్రోచ్ జనతా పార్టీ’ ఆవిర్భావానికి సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు నేపథ్యంగా నిలిచాయి. గౌరవనీయ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన కాక్రోచెస్ (బొద్దింకలు), పరాన్నజీవులు వంటి వ్యాఖ్యలు దేశ యువతను ఉద్దేశించి చేసినవేనా అనే చర్చ అంతర్జాలంలో పెద్ద ఎత్తున మొదలైంది. తదనంతరం ఆయన స్పష్టత ఇస్తూ.. తన వ్యాఖ్యలు కేవలం నకిలీ డిగ్రీలు లేదా తప్పుడు అర్హతలతో వృత్తుల్లోకి చొరబడే వారిని ఉద్దేశించినవే తప్ప, దేశ యువతను కాదని స్పష్టం చేశారు. అయితే, అప్పటికే ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియా వేదికగా తీవ్ర ప్రతిస్పందనకు దారితీశాయి. యువత ఈ పదాలను తమకు జరిగిన అవమానంగా భావించి నిరసనకు దిగింది.

సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తిన నిరసన వాతావరణంలో అభిజీత్ దిప్కే అనే యువకుడు ఈ సరికొత్త డిజిటల్ వేదికకు నాంది పలికారు. ఇది ముందస్తు ప్రణాళికతోనో లేదా వ్యూహాత్మకంగానో స్థాపించిన రాజకీయ పార్టీ కాదు. సోషల్ మీడియాలో వచ్చిన ఒక చిన్న ఆలోచన, కొద్దిసేపట్లోనే ఒక ‘మీమ్’ రూపం దాల్చి, అక్కడి నుంచి నిరసనగా మారి, చివరికి ఒక శక్తివంతమైన యువ వేదికగా రూపాంతరం చెందింది. వ్యవస్థ చేత అణచివేయబడే బొద్దింకలన్నీ ఒకటైతే ఎలా ఉంటుంది? అనే ఒకే ఒక్క ఆలోచనతో మొదలైన ఈ ప్రస్థానం, ఊహించని స్థాయిలో వైరల్ అయ్యింది.

‘కాక్రోచ్ జనతా పార్టీ’ అనేది ప్రస్తుతం భారత ఎన్నికల సంఘం గుర్తించిన అధికారిక రాజకీయ పార్టీ కాదు. ఇది కేవలం ఒక డిజిటల్ నిరసన ఉద్యమం మాత్రమే. ఎన్నికల సంఘం జాబితాలో దీనికి ఎలాంటి అధికారిక గుర్తింపు లేదు. అయితే, అధికారిక ముద్ర లేనంత మాత్రాన ఈ వేదిక ప్రభావాన్ని తక్కువ అంచనా వేయలేం. ఎందుకంటే ఇది ఎన్నికల గుర్తింపు పొందకపోయినా, డిజిటల్ ప్రపంచంలో ఒక సామాజిక- రాజకీయ ప్రతిస్పందనగా నిలిచింది. ఆధునిక కాలంలో రాజకీయ ప్రభావం కేవలం అసెంబ్లీ సీట్లతోనే కొలవబడదు..ప్రజల భావోద్వేగాలను తాకగల సామర్థ్యంతో కూడా కొలవబడుతుంది.

ఈ ఉద్యమానికి అసలు శక్తిని అందించింది దాని భాష. ఇది సంప్రదాయ రాజకీయ వేదికల్లా గంభీర ఉపన్యాసాలు, సిద్ధాంతపరమైన నినాదాలతో నడిచే ఉద్యమం కాదు. నేటి డిజిటల్ తరం సోషల్ మీడియాలో మాట్లాడే భాషే దీనికి ప్రాణం. మీమ్స్, వ్యంగ్య వ్యాఖ్యలు, పదునైన విమర్శలు, డిజిటల్ హాస్యం, ఆవేదన, కోపం - ఇవన్నీ కలిసిన కొత్త తరహా రాజకీయ వ్యక్తీకరణగా ఇది రూపుదిద్దుకుంది.

ఈ వేదిక అధికారిక వెబ్‌సైట్‌లో కనిపించే నినాదాలే దాని భావజాలాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి. వ్యవస్థ మర్చిపోయిన సామాన్య ప్రజల కోసం పెట్టిన పార్టీ, పోయిన ప్రజా డబ్బుకు లెక్కను గట్టిగా అడిగే వేదిక, మమ్మల్ని తొక్కేయాలని చూశారు... కానీ మేము తిరిగి లేచివచ్చాం, కలిసికట్టుగా... దృఢంగా... అజేయంగా... ఈ నినాదాలు కేవలం ఆకర్షణీయమైన పదబంధాలు మాత్రమే కావు. అవి ఒక తరం మనస్తత్వానికి ప్రతిబింబాలు. సమాజం చిన్నచూపు చూసినవారే, తమపై వేసిన అవమాన ముద్రను తిరిగి ప్రతిఘటన చిహ్నంగా మార్చుకుంటే ఎలా ఉంటుందో ఈ ఉద్యమం చూపిస్తోంది. ఒకప్పుడు ఎగతాళికి ఉపయోగించిన పదాన్నే, ఇప్పుడు ఐక్యతకు, నిరసనకు, ఆత్మ గౌరవానికి ప్రతీకగా మలచుకోవడం ఈ వేదిక ప్రత్యేకత. ఇది కేవలం ఒక డిజిటల్ ట్రెండ్ కాదు. నేటి యువత తమ బాధను, అసంతృప్తిని, ఆవేదనను కొత్త భాషలో వ్యక్తపరుస్తున్న సంకేతం. వ్యంగ్యంగా కనిపించినా... లక్ష్యాలు మాత్రం సమాజాన్ని ఆలోచింపజేస్తాయి.

కాక్రోచ్ జనతా పార్టీను కేవలం ఒక సరదా మీమ్ పేజీగా లేదా సోషల్ మీడియా ట్రెండ్‌గా కొట్టిపారేయలేని ప్రధాన కారణం దాని మ్యానిఫెస్టో. బయటకు ఇది వ్యంగ్యంతో, మీమ్ సంస్కృతితో నిండిన డిజిటల్ ఉద్యమంలా కనిపించినా, అందులో ప్రతిపాదిస్తున్న అంశాలు మాత్రం దేశ రాజకీయ వ్యవస్థ, ప్రజాస్వామ్యం, మీడియా, న్యాయ వ్యవస్థ, ఎన్నికల పారదర్శకత వంటి కీలక అంశాలపై పదునైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

ఈ వేదిక విడుదల చేసిన ఫైవ్ పాయింట్ అజెండాలోని అంశాలు యువతలో పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తున్నాయి. పదవీ విరమణ తర్వాత ప్రధాన న్యాయమూర్తులకు రాజకీయ పదవులు ఇవ్వడాన్ని వ్యతిరేకించడం ద్వారా న్యాయవ్యవస్థ స్వతంత్రతపై చర్చకు తెరలేపింది. ఓట్ల తొలగింపుపై కఠిన చర్యలు కోరుతూ ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను ప్రశ్నించింది. మహిళలకు 50 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సమాన అవకాశాల అవసరాన్ని ముందుకు తెచ్చింది.




అంతేకాకుండా, పెద్ద కార్పొరేట్ సంస్థల ఆధీనంలో ఉన్న మీడియా ప్రభావాన్ని ప్రశ్నిస్తూ స్వతంత్ర మీడియా అవసరాన్ని ప్రస్తావించింది. పార్టీలు మారే ఎమ్మెల్యేలు, ఎంపీలపై దీర్ఘకాల నిషేధం విధించాలని చెప్పడం ద్వారా రాజకీయ అవకాశవాదంపై వ్యంగ్యాత్మక విమర్శ చేసింది.

ఈ డిమాండ్‌లు సంప్రదాయ రాజకీయ పార్టీల ఎన్నికల హామీల మాదిరిగా కనిపించవు. ఇవి అతిశయోక్తి, వ్యంగ్యం, డిజిటల్ హాస్యం రూపంలో వ్యక్తమవుతున్న సామాజిక-రాజకీయ అసంతృప్తికి ప్రతిరూపాలు. ముఖ్యంగా యువతలో పెరుగుతున్న భావన ఏమిటంటే - ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేసే ప్రక్రియగా కాకుండా, అధికారాన్ని ప్రశ్నించే హక్కుగా కూడా ఉండాలి అన్నది. అందుకే కాక్రోచ్ జనతా పార్టీ మ్యానిఫెస్టోను చాలామంది సరదాగా చూస్తూనే, దాని వెనుక దాగి ఉన్న ప్రశ్నలను మాత్రం గంభీరంగా చర్చిస్తున్నారు.

కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం అసలు స్వరూపాన్ని అర్థం చేసుకోవాలంటే, దాని సభ్యత్వ అర్హతలను ఒక్కసారి పరిశీలిస్తే సరిపోతుంది. ఈ వేదిక అధికారిక వెబ్‌సైట్‌లో, అలాగే దానికి సంబంధించిన పలు కథనాల్లో కనిపించే సభ్యత్వ ప్రమాణాలు సంప్రదాయ రాజకీయ పార్టీల నియమాల్లా కాకుండా, నేటి యువత జీవన వాస్తవాలను వ్యంగ్య భాషలో ప్రతిబింబించేలా ఉన్నాయి.

నిరుద్యోగి కావచ్చు - బలవంతంగా, ఇష్టపూర్వకంగా లేదా పరిస్థితుల వల్ల, రోజుకు గంటలకొద్దీ ఆన్‌లైన్‌లో ఉండాలి, ప్రొఫెషనల్ స్థాయిలో అసంతృప్తిని వ్యక్తపరచగలగాలి వంటి అర్హతలు బయటకు సరదాగా వినిపించినా, వాటి వెనుక నేటి యువత ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, మానసిక వాస్తవాలు దాగి ఉన్నాయి.

ఇవి నిజమైన రాజకీయ సభ్యత్వ నియమాలుగా కనిపించవు.. కానీ ఉద్యోగాల కోసం పోరాడుతున్న యువత, డిజిటల్ ప్రపంచానికే పరిమితమవుతున్న సామాజిక జీవితం, సోషల్ మీడియాలోనే ఆవేదన వ్యక్తపరచాల్సిన పరిస్థితి, మరియు వ్యవస్థ పట్ల పెరుగుతున్న నిరాశను ప్రతిబింబించే సామాజిక వ్యంగ్యంగా కనిపిస్తాయి.

ప్రత్యేకంగా వాయిస్ ఆఫ్ ద లేజీ అండ్ అన్‌ఎంప్లాయిడ్ వంటి నినాదాలు, యువతపై సమాజం వేసే సోమరులు, పని లేనివాళ్లు, ఎప్పుడూ ఫోన్లోనే ఉండేవాళ్లు వంటి ముద్రలను తిరిగి వ్యంగ్య ఆయుధాలుగా మార్చుకునే ప్రయత్నాన్ని సూచిస్తున్నాయి. అందుకే కాక్రోచ్ జనతా పార్టీ సభ్యత్వ అర్హతలను చాలామంది సరదాగా చూస్తూనే, వాటి వెనుక దాగి ఉన్న తరతరాల అసంతృప్తిని మాత్రం గంభీరంగా చర్చిస్తున్నారు.

సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీకు లభించిన ఆదరణ అనూహ్యమైనది. అతి తక్కువ సమయంలో వేగంగా విస్తరించిన డిజిటల్ వేదికగా ఇది నిలిచిందనే విషయంలో మాత్రం సందేహం లేదు. ముఖ్యంగా యువత ఈ ఉద్యమాన్ని కేవలం ఒక మీమ్ సంస్కృతిగా కాకుండా, తమ అసంతృప్తికి ప్రతీకగా స్వీకరించడం దీనికి మరింత బలం తీసుకువచ్చింది. సోషల్ మీడియా వేదికలపై వైరల్ పోస్టులు, మీమ్స్, రాజకీయ వ్యంగ్య వ్యాఖ్యలు ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా చర్చకు తీసుకెళ్లాయి.

ఇంకా ముఖ్యంగా, మహువా మోయిత్రా, కీర్తి ఆజాద్ వంటి జాతీయ స్థాయి రాజకీయ ప్రముఖులు, ప్రజా మేధావులు ఈ అంశంపై బహిరంగంగా స్పందించడంతో, ఇది సాధారణ ఇంటర్నెట్ ట్రెండ్ స్థాయిని దాటి జాతీయ రాజకీయ-సామాజిక చర్చగా రూపాంతరం చెందింది. ఒక వ్యంగ్య పదంతో ప్రారంభమైన స్పందన, దేశవ్యాప్తంగా యువత మనోభావాలను ప్రతిబింబించే డిజిటల్ ఉద్యమంగా మారడం ఈ పరిణామంలో అత్యంత విశేషమైన అంశం.

కాక్రోచ్ జనతా పార్టీ కేవలం ఒక సోషల్ మీడియా ట్రెండ్ మాత్రమే కాదు. నేటి యువత నిరసన వ్యక్తీకరణలో జరుగుతున్న పెద్ద మార్పుకు ప్రతీక. ఒకప్పుడు రాజకీయ నిరసనలు అంటే రోడ్లపై ర్యాలీలు, సభలు, ప్లకార్డులు, నినాదాలు గుర్తుకు వచ్చేవి. కానీ డిజిటల్ యుగంలో ఆ భాష పూర్తిగా మారుతోంది. ఇప్పుడు మీమ్స్, రీల్స్, వైరల్ పోస్టులు, హ్యాష్‌ట్యాగ్‌లు, డిజిటల్ క్యాంపెయిన్లు కొత్త తరహా రాజకీయ ఆయుధాలుగా మారుతున్నాయి.

నేటి యువత తమ అసంతృప్తిని కేవలం ఓటు రూపంలోనే కాదు.. సోషల్ మీడియా వ్యంగ్యం, డిజిటల్ చర్చలు, వైరల్ కంటెంట్ రూపంలో కూడా వ్యక్తపరుస్తోంది. ఒకప్పుడు సరదాగా కనిపించిన మీమ్లు, ఇప్పుడు సామాజిక-రాజకీయ అసంతృప్తికి ప్రతిబింబాలుగా మారుతున్నాయి.

కాక్రోచ్ అనే అవమానకర పదాన్నే యువత తిరిగి ప్రతిఘటన చిహ్నంగా మార్చుకోవడం ఈ పరిణామానికి అత్యంత స్పష్టమైన ఉదాహరణ. సమాజం చిన్నచూపు చూసిన పదాన్ని, అదే సమాజాన్ని ప్రశ్నించే రాజకీయ వ్యాఖ్యగా మలచుకోవడం ఈ ఉద్యమం ప్రత్యేకత.

ఇది కేవలం ఒక డిజిటల్ ఉద్యమం కాదు.. యువత తమ బాధను, నిరాశను, కోపాన్ని కొత్త భాషలో వ్యక్తపరుస్తున్న సంకేతం. భవిష్యత్తులో భారత రాజకీయాల్లో నిరసనల రూపం ఎలా మారబోతుందో సూచించే ఒక కొత్త సామాజిక-డిజిటల్ సంస్కృతికి కాక్రోచ్ జనతా పార్టీ ప్రతిబింబంగా నిలుస్తోంది.

ప్రస్తుతం కాక్రోచ్ జనతా పార్టీను సంపూర్ణ ఎన్నికల రాజకీయ పార్టీగా పరిగణించడం తొందరపాటు అవుతుంది. వ్యవస్థాపకుల ప్రకటనల ప్రకారం, ఇది ఇప్పటికీ ప్రధానంగా ఒక డిజిటల్ ఉద్యమ వేదికగానే కొనసాగుతోంది. భవిష్యత్తులో ఎన్నికల రాజకీ టయాల్లోకి ప్రవేశిస్తుందా? ప్రత్యక్షంగా పోటీ చేస్తుందా? అనే విషయాలపై ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన వెలువడలేదు.

అయితే ఈ ఉద్యమం ఒక కీలకమైన సామాజిక-రాజకీయ మార్పును మాత్రం స్పష్టంగా చూపిస్తోంది. నేటి యువత ఇక మౌనంగా పరిస్థితులను అంగీకరించే వర్గం కాదు. తమ అసంతృప్తిని, ఆవేదనను, నిరాశను కొత్త భాషలో వ్యక్తపరచగల డిజిటల్ పౌర సమూహంగా మారుతోంది.

ఒకప్పుడు అవమానంగా వినిపించిన పదాన్నే, ఇప్పుడు ప్రతిఘటన చిహ్నంగా మలచుకోవడం ఈ తరానికి ప్రత్యేకమైన రాజకీయ వ్యక్తీకరణ. ఎగతాళిని ఆయుధంగా, వ్యంగ్యాన్ని నిరసనగా, మీమ్‌లను రాజకీయ వ్యాఖ్యలుగా మార్చుకుంటున్న ఈ డిజిటల్ తరం, భవిష్యత్తులో భారత ప్రజాస్వామ్య చర్చల రూపురేఖలను కూడా మార్చే అవకాశం ఉంది.

అందుకే కాక్రోచ్ జనతా పార్టీ ఎన్నికల రాజకీయాల్లోకి అడుగుపెడుతుందా లేదా అన్నదానికంటే, యువత మనస్తత్వంలో జరుగుతున్న మార్పుకు ఇది ప్రతీకగా నిలుస్తోందనే విషయం మరింత ముఖ్యమైనది.

ముగింపు మాటగా... కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పటివరకు అధికారిక ఎన్నికల రాజకీయ పార్టీగా గుర్తింపు పొందకపోయినా, అది భారత సమాజంలో - ముఖ్యంగా యువత మనస్తత్వంలో - జరుగుతున్న ఒక లోతైన మార్పుకు ప్రతిబింబంగా నిలుస్తోంది. ఇది కేవలం ఒక డిజిటల్ ట్రెండ్ కాదు; అవమానాన్ని ఆత్మగౌరవంగా, వ్యంగ్యాన్ని ప్రతిఘటనగా, మీమ్ను రాజకీయ వ్యాఖ్యగా మార్చుకున్న కొత్త తరపు స్వరం.

ఈ కాక్రోచ్ జనతా పార్టీ ని ఒక పార్టీకి వ్యతిరేకంగా కొన్ని పార్టీలు వెనుక నుంచి ప్రోత్సహిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. అయితే, దీని వెనుక ఇతర పార్టీల హస్తం ఉందని చెప్పే ప్రచారానికి ఎలాంటి స్పష్టమైన ఆధారాలు ఇప్పటివరకు లభించలేదు.

ఒకప్పుడు చిన్నచూపు, ఎగతాళి, నిర్లక్ష్యానికి ఉపయోగించిన కాక్రోచ్ అనే పదాన్నే తిరిగి తమ గుర్తింపుగా మార్చుకోవడం వెనుక, వ్యవస్థ చేత వినిపించని గొంతుల ఆవేదన దాగి ఉంది. ఈ ఉద్యమం యువతలో పెరుగుతున్న నిరాశను మాత్రమే కాదు; తమను తాము వినిపించుకోవాలనే తపనను కూడా ప్రతిబింబిస్తోంది.

ఇది మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తు చేస్తోంది - నేటి యువత కేవలం ఓటర్లు కాదు; ప్రశ్నించే తరం. తమపై పడిన ముద్రలను మౌనంగా భరించే తరం కాదు; అదే ముద్రను ప్రతిఘటన జెండాగా మార్చగల డిజిటల్ పౌర సమూహం. ఒకప్పుడు వీధుల్లో వినిపించిన నిరసన స్వరం, ఇప్పుడు సోషల్ మీడియా పోస్టుల్లో, మీమ్లో, వైరల్ నినాదాల్లో కొత్త రూపం దాల్చుతోంది.

కాక్రోచ్ జనతా పార్టీ భవిష్యత్తులో నిజమైన రాజకీయ శక్తిగా మారుతుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. కానీ అది ఇప్పటికే ఒక విషయాన్ని స్పష్టంగా తెలియజేసింది - యువతను ఎగతాళి చేయడం సులువు కావచ్చు, కానీ వారి అసంతృప్తిని నిర్లక్ష్యం చేయడం మాత్రం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. అందుకే ఈ ఉద్యమాన్ని కేవలం ఒక వ్యంగ్య కథగా చూడలేం. ఇది భారత ప్రజాస్వామ్యంలో రూపుదిద్దుకుంటున్న కొత్త రాజకీయ భాషకు, కొత్త నిరసన సంస్కృతికి, కొత్త తరపు ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఒక ముఖ్యమైన సంకేతం.

**- ననుబోలు రాజశేఖర్**
9885739808

# ముక్తి దాయకం... పుష్కర స్నానం

నదుల పట్ల భారతీయుల ఆధ్యాత్మిక భావన యుగాలుగా కొనసాగుతున్నది. ఒకప్పుడు జలవనరులుగా మాత్రమే కాక, మానవుడి మానసిక శుద్ధికి మూలస్తంభంగా మారినవి. ప్రతి నదీ ఒక తీర్థంగా మారి మోక్షాన్ని అందించే మార్గంగా భావించ బడింది. ఆ నమ్మకానికి పుష్కరాలు ప్రాణం పోసే మహోత్సవాలు.

పుష్కరాలు అనే పదం పుష్కరుడు అనే ఒక బ్రాహ్మణోత్తముని కథనంతో ముడిపడి ఉంది. ఇతను శివుని గురించి తపస్సు చేసి, పరమ శివునితో ఐక్యమయ్యే వరం పొంది, జల స్వరూపంగా మారాడు. బ్రహ్మదేవుడు ఈ పవిత్ర జలరూపాన్ని తన కమండలంలో నిల్వచేసి, అనంతరంలో దేవగురువు బృహస్పతికి అప్పగించాడు. బృహస్పతి రాశిచక్రంలో ప్రవేశించే ప్రతి రాశికి సంబంధించిన నదిలో 12 రోజుల పాటు పుష్కరాలు జరుపుకుంటారు. ఆ సమయంలో పుష్కరుడు కూడా ఆ నదిలో ప్రవేశించి ముక్తిని ప్రసాదిస్తాడు.

‘మేషే గంగా వృషే రేవా మిథునేతు సరస్వతీ కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మతా కన్యాయాం కృష్ణవేణీచ కావేరీ ధటకే స్మతా వృశ్చికే తామ్రపర్ణీచ చాపే పుష్కర వాహినీ మకరే తుంగభద్రాచ కుంభే సింధునదీ స్మతా మీనే ప్రణీతా నదీచ గురోస్సంక్రమణే స్మతా పుష్కరాఖ్యో మునీనాంహి బుధై స్మతా.....‘ దేవ గురువగు బృహస్పతి మేష రాశిలో ఉన్నప్పుడు గంగానదికి, వృషభ రాశిలో ఉన్నప్పుడు నర్మదా నదికి, మిథున రాశిలో ఉన్నప్పుడు సరస్వతీ నదికి, కర్కాటక రాశిలో ఉన్నప్పుడు యమునా నదికి, సింహరాశిలో ఉన్నప్పుడు గోదావరి నదికి, కన్యారాశిలో ఉన్నప్పుడు కృష్ణా నదికి, తులారాశిలో ఉన్నప్పుడు కావేరి నదికి, వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు తామ్రపర్ణి నదికి, ధనూరాశిలో ఉన్నప్పుడు బ్రహ్మపుత్రకు, మకర రాశిలో ఉన్నప్పుడు తుంగభద్రా నదికి, కుంభ రాశిలో ఉన్నప్పుడు సింధు నదికి, మీన రాశిలో ఉన్నప్పుడు ప్రణీతా నదికి, పుష్కరాలు చెప్పబడ్డాయి. పుష్కరం అనగా జల స్వరూపం జలాది దేవతగా సమస్త తీర్థములకు నెలవై ఉండి తీర్థరాజు అను పేరుతో లోక కళ్యాణ కారకు డైనట్లు శాస్త్రములు తెలుపు తున్నాయి.

2026 సంవత్సరంలో భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతిలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన మహోత్సవాలలో యమునా నది పుష్కరాలు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. జూన్ 2 నుండి జూన్ 13 వరకు జరగనున్న ఈ పుష్కర మహోత్సవం కోట్లాది మంది భక్తులను ఆకర్షించనుంది. భారతీయ సనాతన ధర్మంలో నదులను కేవలం జల ప్రవాహాలుగా కాకుండా జీవనాధారాలుగా, మాతృస్వరూపాలుగా, పాప పరిహారిణులుగా భావిస్తారు. ఆ నదీ సంప్రదాయంలో గంగానదికి సోదరిగా, శ్రీకృష్ణుని బాల్య లీలలకు సాక్ష్యంగా, యమధర్మరాజు సోదరిగా యమునా నది అత్యున్నత స్థానం పొందింది. యమునా పుష్కరాలు అనేవి కేవలం పుణ్యస్నానాల పరంపర మాత్రమే కాదు; భారతీయ సంస్కృతి, పురాణ చరిత్ర, భక్తి సంప్రదాయం, సామాజిక సమైక్యత, పర్యావరణ చైతన్యం కలిసిన మహాసాంస్కృతిక వేడుకగా అవి నిలుస్తాయి.

యమునా పుష్కరాల సమయంలో ప్రధానంగా యమునోత్రి, హరిద్వార్ పరిసరాలు, మథుర, వృందావనం, ఆగ్రా, ప్రయాగ్రాజ్ ప్రాంతాల్లో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించ బడతాయి. ముఖ్యంగా మథుర-వృందావన ప్రాంతాల్లో లక్షలాది మంది వైష్ణవ భక్తులు పాల్గొంటారు. ఇస్కాన్ సంస్థలు, గౌడీయ మఠాలు, పీఠాధిపతులు, వివిధ హిందూ మత



సంస్థలు ప్రత్యేక యాగాలు, హరినామ సంకీర్తనలు, గీతా పారాయణాలు నిర్వహించనున్నాయి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, ఉత్తరాఖండ్ ప్రభుత్వం, ఢిల్లీ పరిపాలన సంయుక్తంగా ఘాట్ల అభివృద్ధి, భద్రతా చర్యలు, పారిశుధ్య నిర్వహణపై భారీ ఏర్పాట్లు చేపడుతున్నాయి.

పుష్కరాల సందర్భంగా పితృతర్పణాలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంటుంది. యమునా తీరంలో పిండప్రదానాలు, గో దానాలు, అన్నదానాలు, వేద పారాయణాలు నిర్వహించడం ద్వారా పితృదేవతలు సంతృప్తి చెందుతారని శాస్త్రాలు పేర్కొంటాయి. బ్రహ్మ పురాణం, పద్మ పురాణం, స్కాంద పురాణాల్లో పుష్కర స్నానాల ప్రాశస్త్యం ప్రస్తావించబడింది. పుష్కరే స్నానమాత్రేణ జన్మకోట్యఘనాశనం అనే శ్లోకం పుష్కర స్నాన మహిమను తెలియజేస్తుంది.

ఈ నేపథ్యంలో 2026 యమునా పుష్కరాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలుగా కాకుండా నదీ పరిరక్షణ ఉద్యమంగా మారాలని పర్యావరణ సంస్థలు కోరుతున్నాయి. పుష్కర ఘాట్ల వద్ద ప్లాస్టిక్ నిషేధం, జీవ వైవిధ్య పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణహిత పూజా సామగ్రి వినియోగంపై ప్రభుత్వాలు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాయి. నమామి గంగే తరహాలో యమునా సంరక్షణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల భక్తులకు కూడా యమునా పుష్కరాలకు ప్రత్యేక అనుబంధం ఉంది. శ్రీకృష్ణ భక్తి సంప్రదాయం తెలుగు సాహిత్యంలో విస్తృతంగా కనిపిస్తుంది. అన్నమయ్య సంకీర్తనలు, పోతన భాగవతం, తాళ్ళపాక కవుల రచనల్లో యమునా మహిమ విస్తృతంగా ప్రతిఫలించింది. యమునాతీర విహారిగా కృష్ణుని కీర్తించిన భక్తి సాహిత్యం యమునా పట్ల ఆధ్యాత్మిక భావోద్వేగాన్ని పెంచింది.భారతీయ నాగరికతలో నదులు కేవలం భౌగోళిక ప్రవాహాలు కాదు; అవి సంస్కృతికి మూలాలు. యమునా పుష్కరాలు ఆ సాంస్కృతిక వారసత్వాన్ని మరోసారి గుర్తు చేస్తున్నాయి. ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పురోగతి ఎంత పెరిగినా, మనిషి ప్రకృతితో అనుబంధాన్ని మరచిపోలేడని ఈ మహోత్సవాలు తెలియజేస్తాయి. యమునా నది భారతీయ భక్తి, పురాణం, సంగీతం, సాహిత్యం, వ్యవసాయం, జీవన విధానంతో ముడిపడి ఉన్న జీవనధార. అలాంటి యమునా పుష్కరాలు కోట్లాది ప్రజల విశ్వాసానికి ప్రతీకగా, భారతీయ సంస్కృతి నిరంతర ప్రవాహానికి చిహ్నంగా 2026లో మరొకసారి వైభవంగా ఆవిష్కృతం కానున్నాయి.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

### పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు...
# ప్రపంచానికి ముప్పు

ప్రపంచ రాజకీయాలు మరోసారి ప్రమాదకర మలుపు తిరుగుతున్నాయి. ఇప్పటికే రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, గాజా సంక్షోభం, ప్రపంచ ఆర్థిక మందగమనం వంటి సవాళ్లతో సతమతమవుతున్న ప్రపంచం ఇప్పుడు ఇరాన్- ఇజ్రాయిల్- అమెరికా దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను ఆందోళనగా గమనిస్తోంది. పశ్చి మాసియాలో చెలరేగుతున్న ఈ సంక్షోభం కేవలం మూడు దేశాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ఇంధన భద్రతను, అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే శక్తిని కలిగి ఉంది. ఇజ్రాయిల్ భద్రత పేరుతో అమెరికా మద్దతు కొనసాగుతుండగా, తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకునేందుకు ఇరాన్ ప్రతిఘటిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతీకార దాడులు, క్షిపణి ప్రయోగాలు, సైనిక హెచ్చరికలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలను పెంచుతున్నాయి. చిన్న ఘర్షణగా ప్రారంభమైన ఉద్రిక్తత పెద్ద యుద్ధంగా మారితే దాని ప్రభావం ప్రపంచంలోని ప్రతి దేశంపై పడే ప్రమాదం ఉంది.

పశ్చిమాసియా అంటే కేవలం యుద్ధాలు మాత్రమే కాదు. ప్రపంచ చమురు నిల్వలకు కేంద్రం కూడా. ప్రపంచ చమురు సరఫరాలో కీలక పాత్ర పోషించే హోర్ముజ్ జలసంధి ఇరాన్ పరిధిలో ఉండటం వల్ల అక్కడ ఏ చిన్న ఉద్రిక్తత జరిగినా ప్రపంచ మార్కెట్లు కుదేలవుతాయి. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం అన్నీ పెరుగుతాయి. ఇప్పటికే ప్రపంచ దేశాలు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి సమయంలో పశ్చిమాసియాలో యుద్ధం మరింత విస్తరించడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన దెబ్బ అవుతుంది. భారతదేశం తన ఇంధన అవసరాల్లో అధిక భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. అందులోనూ పశ్చిమాసియా దేశాల పాత్ర అత్యంత కీలకం. చమురు ధరలు పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం పడుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి ప్రజల జీవన వ్యయం అధికమవుతుంది.

అంతేకాదు..గల్ఫ్ దేశాల్లో లక్షలాది మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారు. యుద్ధం తీవ్రరూపం దాల్చితే వారి భద్రత, ఉద్యోగాలు, జీవనోపాధి ప్రశ్నార్థకమవుతాయి. విదేశీ మారక ద్రవ్య ప్రవాహంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం ప్రస్తుతం అత్యంత సున్నితమైన విదేశాంగ సవాలును ఎదుర్కొంటోంది. అమెరికా భారత్‌కు వ్యూహాత్మక భాగస్వామి. ఇజ్రాయిల్ రక్షణ రంగంలో కీలక మిత్రదేశం. మరోవైపు ఇరాన్‌తో కూడా భారత్‌కు చారిత్రక, వ్యాపార, వ్యూహాత్మక సంబంధాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఏ ఒక్క దేశానికి పూర్తిగా మద్దతు ప్రకటించడం భారత్‌కు ప్రయోజనకరం కాదు. అందుకే భారత్ ‘శాంతి, చర్చలు, దౌత్యపరమైన పరిష్కారం’ అనే విధానాన్ని అనుసరిస్తోంది. ప్రపంచ రాజకీయాల్లో తటస్థతను కాపాడుకుంటూనే జాతీయ ప్రయోజనాలను రక్షించడం మోడీ ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. చరిత్ర చెబుతున్న ఒక సత్యం ఏమిటంటే యుద్ధాలు విధ్వంసాన్ని మాత్రమే మిగులుస్తాయి. ప్రాణనష్టం, ఆర్థిక నష్టం, శరణార్థుల సమస్యలు, మానవతా సంక్షోభాలు తప్ప శాశ్వత పరిష్కారాలు ఇవ్వవు. ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా దేశాలు కూడా సైనిక చర్యల కంటే దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ శక్తులు శాంతి చర్చలకు మార్గం సుగమం చేయాలి. ప్రపంచం ప్రస్తుతం అభివృద్ధిని కోరుకుంటోంది. పేదరికం, నిరుద్యోగం, వాతావరణ మార్పులు, ఆహార భద్రత వంటి సమస్యలు మానవాళి ముందు ఉన్నాయి. వీటిని పరిష్కరించాల్సిన సమయంలో దేశాలు యుద్ధాల్లో చిక్కుకోవడం దురదృష్టకరం.

భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రపంచ శాంతికి మద్దతు ఇస్తూ సమతుల్య దౌత్యాన్ని కొనసాగించాలి. పశ్చిమాసియాలో శాంతి నెలకొంటేనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరపడుతుంది. లేదంటే దాని ప్రభావం ప్రతి కుటుంబం వంటగదిలోని ఖర్చుల నుంచి దేశాల ఆర్థిక విధానాల వరకు కనిపిస్తుంది.

ప్రపంచం మరో మహాయుద్ధం అంచుల వైపు వెళ్లకూడదంటే వివేకం, సంయమనం, దౌత్యం గెలవాలి. ఆయుధాలు కాదు, సంభాషణలే భవిష్యత్తును రక్షిస్తాయి.

**- ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
9440287170

# కేసీఆర్ కుటుంబం అబద్ధాల మాటల్లో దిట్ట

- రైతు సంక్షేమంపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు
- రైతన్నలకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**పెద్దపల్లి జూన్ 08 (మనం ప్రతినిధి):** పెద్దపల్లిలో కాంగ్రెస్ మీడియా సమావేశం జిల్లా కేంద్రంలోని నందన్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు బీఆర్ఎస్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీష్ రావు చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని పేర్కొన్నారు. విజయరమణరావు మాట్లాడుతూ, రైతుల రుణమాఫీ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్కు లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండా వారిని బ్యాంకుల వద్ద డిఫాల్టర్లుగా మిగిల్చిందని ఆరోపించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి అండగా నిలిచిందన్నారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వమే ముందంజ యాసంగి సీజన్లో కేంద్ర ప్రభుత్వం 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం 70 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు. అలాగే మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రం సహకరించకపోయినా, రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.3,500 కోట్ల వ్యయంతో రైతుల నుంచి మక్కలను కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేసిందన్నారు.

**రైతు పక్షపాతి రేవంత్ రెడ్డి**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని విజయరమణరావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన పంటను ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేస్తోందని, ధాన్యం అమ్మిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ అవుతున్నాయని చెప్పారు.

**కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు**

మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, హరీష్ రావు నాయకత్వంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా విజయరమణరావు విమర్శలు గుప్పించారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టు సమస్యలతో కూలేశ్వరం ప్రాజెక్టుగా మారిందని వ్యాఖ్యానించారు. మరోవైపు కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు ఇప్పటికీ సురక్షితంగా ఉన్నాయని చెప్పారు.

**మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు అసహనానికి గురవుతున్నారని విజయరమణరావు అన్నారు. ప్రజల మద్దతు కాంగ్రెస్కే ఉందని, వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, రేవంత్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు గోపగాని సారయ్య గౌడ్,ప్రజాప్రతినిధులు,జెడ్పీటీసీలు,ఎంపీపీలు,వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు,అనుబంధ సంఘాల ప్రతినిధులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల, జూన్ - 08(మనం ప్రతినిధి):** ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

**మొత్తం దరఖాస్తులు 154 వచ్చాయి**

**సద్వినియోగం చేసుకోవాలి...**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేని కలిసిన ఇందల్వాయి ఎస్ఐ



**నిజామాబాద్ రూరల్, జూన్ 8 (మనం న్యూస్):** ఇటీవల ఇందల్వాయి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన భూక్యా సుమలత సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన బాధ్యతల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, విధుల నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి ఆకాంక్షించారు. ఇందల్వాయి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ సమర్థవంతంగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

# పాఠశాలలు, హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యం

**జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశం**

**హాస్టళ్లలో పనిచేసే వంటవారు తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలి**

**ఆహార భద్రత నిబంధనల అమలుపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి**



**కామారెడ్డి, జూన్ 08 (మనం ప్రతినిధి):** జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్లో జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆహార భద్రత అధికారి జి. విక్రమ్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతతో పాటు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అక్కడ పనిచేసే వంటవారు, సిబ్బంది అందరూ తప్పనిసరిగావ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆహార భద్రత శాఖ, విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పాఠశాలలు, హాస్టళ్లలో ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, ఆహార భద్రత నిబంధనల అమలుపై క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సమికృత మండల సముదాయ కార్యాలయం ఎదుట గ్రామస్తులు ధర్నా




**రుద్రూర్, జూన్ 8 (మనం న్యూస్):** రుద్రూర్ మండలం అక్బర్ నగర్ గ్రామస్తులు సోమవారం తహసిల్దార్ కు వ్యతిరేకంగా సమీకృత మండల సముదయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ., అక్బర్ నగర్ గ్రామ శివారులో గల గుట్టకు మొరం త్రవ్వకాలు చేపట్టడానికి తహసిల్దార్ బయటి ఊరు వారికి విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారని, కానీ గ్రామ ప్రజలకు మాత్రం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు కొరకు మొరం తవ్వకానికి వేబిల్ తప్పనిసరి అని అన్నారు. గ్రామస్తులుగా తాము దానికి వ్యతిరేకంగా ఆ తవ్వకాలను నిలిపి వేశామని, దానిని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో హిందూ స్మశాన వాటికలో కీస్టోన్ కంపెనీ వారు దానిని అభివృద్ధి చేసి ఇస్తాం అంటే గ్రామ సభలో తీర్మానం చేసి ఇచ్చామని అన్నారు. తహసీల్దార్ వేబిల్ ఇచ్చిన మొరం తవ్వకాలు ఆపివేశారని కనుక మీ స్మశాన వాటిక కూడా నేను నడవనివ్వనని ఆ అభివృద్ధిని అడ్డుకున్నారని పేర్కొన్నారు. అంటే ప్రజా ప్రయోజనం కోసం గ్రామస్తులకు ఉపయోగపడే వాటికి అనుమతి ఇవ్వకుండా తహసీల్దార్ కు ఆదాయం సమకూర్చే వాటికి ఎక్కువ మక్కువ చూపుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ఇక నుండి గ్రామంలో గ్రామస్తులకు కాకుండా బయటి వ్యక్తులకు మొరం ఇవ్వమని అన్నారు. తక్షణమే తహసీల్దార్ స్మశాన వాటిక పనులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని యెడల దేనికైనా గ్రామస్థులు అందరం సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కార్తీక్, అశోక్ గౌడ్ , గౌతం, రజాక్, ఫహీమ్, రాకేష్, పవన్, మొహమ్మద్, అజార్ , ఇమ్రాన్, వినయ్, అశోక్ కాంబ్లె, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


# పునరావాస కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది



- రాష్ట్ర ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 08 (మనం బ్యూరో):** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని వట్టెం గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన పునరావాస, పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) కాలనీని అదనపు కలెక్టర్ అమరేందర్ తో కలిసి తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీలో నిర్మించిన గృహాలు, అంతర్గత రహదారులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య వ్యవస్థతో పాటు ఇతర మౌలిక వసతులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పునరావాసం పొందనున్న కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు నాణ్యతతో కూడినవిగా ఉండాలని కమిషనర్ సూచించారు. కాలనీలో కొనసాగుతున్న పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసితుల సంక్షేమం దృష్ట్యా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పునరావాస కాలనీల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రజలకు అందిస్తున్న సౌకర్యాల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. కాలనీలో నివసించనున్న కుటుంబాలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



**రుద్రూర్, జూన్ 8 (మనం న్యూస్):** రుద్రూర్ మండల కేంద్రంలోని జవహర్ నగర్ కాలనీ వాసులు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సెక్రెటరీ ప్రేమ్ దాస్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ కాలనివాసులు మాట్లాడుతూ., జవహర్ నగర్ కాలనీలో గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మాణాలు చేసుకున్నారని, 33స33 స్థలం కానీ జవహర్ నగర్ కాలనీలో వాటర్ ట్యాంకు ముందట వారి స్థలంలో కాకుండా ప్రభుత్వ స్థలంలో రుద్రూర్ గ్రామం ఏర్పడినప్పుడు ప్రధాన రోడ్డు ఉండేదని అన్నారు. ఆ స్థలంలోనే ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. గత సంవత్సరంలో కూడా వారు ప్రహరీ గోడ నిర్మిస్తామంటే గ్రామ సర్పంచ్ చొరవతో నిర్మాణాన్ని ఆపడం జరిగిందన్నారు. మళ్లీ ఇప్పుడు ప్రభుత్వ స్థలంలోనే ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నారని, ప్రభుత్వ స్థలంలో కాకుండా మీ స్థలంలో మీరు నిర్మాణం చేపట్టాలని చెప్పగా, వారు దురుసు పదజాలలతో దూషిస్తున్నారని పేర్కొన్నారు. కావున గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, పంచాయతీ సెక్రెటరీ ప్రేమ్ దాస్ లు వెంటనే స్పందించి ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి హద్దులు చూపెట్టి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. అదేవిధంగా జవహర్ నగర్ కాలనీలో కవిత ఇంటి నుంచి కల్లు డిపో వరకు అక్రమంగా నిర్మించుకున్న ఇళ్ల నిర్మాణాలను తొలగించాలని వారు కోరారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి**



**పెద్దపల్లి, జూన్ 08 (మనం ప్రతినిధి):** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి₹ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి పట్టణం నల్ల పోచమ్మ వాడకు చెందిన ఎం.డి.శాబాన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ తెలిపారు. గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన బి.శంకర్ తనకు దివ్యాంగుల ఫోటోలు వీల్ చైర్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డి.ఆర్.డి.ఓ కుశ రాస్తూ వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.అంతర్గాం మండలం ఎక్లాస్పూర్ గ్రామానికి చెందిన రవికుమార్ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న వాచ్మెన్ పోస్ట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీ కి రాస్తూ పరిశీలించి సమస్య పరిష్కరించాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, జూన్ 08 మనంప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను సమగ్రంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో స్వీకరించి, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పెండింగ్లో ఉంచకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ డివిజన్లు మరియు కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 70 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

వాటిలో కలెక్టరేట్లో 27, సంగారెడ్డి డివిజన్లో 17, ఆందోల్ డివిజన్లో 5, నారాయణఖేడ్ డివిజన్లో 11, జహీరాబాద్ డివిజన్లో 10 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. అంతకుముందు, హెచ్పీవీ వ్యాక్సిన్ ప్రయోజనాలు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో దాని ప్రాధాన్యత, అలాగే అతిసార వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్పీజీ ధరల పెంపుపై కాంగ్రెస్ భారీ నిరసన

**కరీంనగర్ జూన్ 8(మనం న్యూస్):**కేంద్రంలోని ఎన్డీఏ నేతృత్వ బీజేపీ ప్రభుత్వం పెంచిన ఎల్పీజీ గ్యాస్ ధరలకు నిరసనగా సోమవారం కరీంనగర్లోని ఇందిరా చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన, వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ఖాళీ సిలిండర్లతో, బీజేపీ వ్యతిరేక నినాదాల ప్లకార్డులతో రోడ్డుపై కట్టెల పొయ్యి మీద వంట చేస్తూ కాంగ్రెస్ నేతలు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ మాట్లాడారు: గత నెల రోజులుగా ప్రధాని నరేంద్ర మోడీ ఈ దేశంలో ఉన్న పేద మధ్యతరగతి ప్రజలంపైన రక్షకట్టినట్లుగా విపరీతమైన ధరలను పెంచుతూ పరిస్థితులను మనం చూస్తున్నాము.. పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు నిన్న ఎల్పిజి గ్యాస్ ధర ఒకేసారి 29 రూపాయలు పెంచి పేద ప్రజలపై భారం మోపుతున్న నరేంద్ర మోడీ సర్కారుకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ గారి పిలుపుమేరకు వారు మొదటి నుండి చెబుతున్నట్లుగా ఈ ఎన్నికల తర్వాత నరేంద్ర మోడీ దేశ ప్రజలపై ధరల పెంపు భారం మోపబోతున్నారని దేశ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఈ మోసపూరిత కేంద్ర ప్రభుత్వంపై మనమందరం పోరాడటానికి సిద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీ గారు హెచ్చరించినట్లుగానే ఎన్నికలు మోయగానే ఇప్పుడు ఇంధన ధరలు పెంచి వాటి ప్రభావం నిత్యవసరాలు పై పడటంతో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు, ఒకవైపు నరేంద్ర మోడీ నేను విశ్వగురు అని ఇది వికసిత భారత్ అని ప్రచారం చేసుకుంటూనే ఈ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని అంటగడుతూ రాహుల్ గాంధీ గారి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఈ ధరలను దించేంతవరకు ఈ పోరాటం కొనసాగుతుందని ఇట్టి పరిస్థితుల్లోనూ మోడీ సర్కార్ కు బుద్ధి వచ్చే విధంగా మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు.




# దివ్యాంగులకు ట్రై సైకిల్, వీల్ చైర్ అందజేత

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు కృతజ్ఞతలు తెలియజేసిన దివ్యాంగులు**

**రాజన్న సిరిసిల్ల, జూన్ -08(మనం ప్రతినిధి):** పలువురు దివ్యాంగుల ఇబ్బందులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పందించి.. సమస్యకు పరిష్కారం చూపారు. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన చింతకింది లస్మయ్య, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన ముద్రకోల దీన దివ్యాంగులు సోమవారం ఐడీఓసీకి రాగా, వారితో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. వారు ఎక్కడి నుంచి వచ్చారు? ఏ సమస్యపై వచ్చారో అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తక్షణమే స్పందించి చింతకింది లస్మయ్య కు మాన్యువల్ ట్రై సైకిల్, ముద్రకోల దీనకు వీల్ చెర్ అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. వారికి వెంటనే మాన్యువల్ ట్రై సైకిల్, వీల్ చైర్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి అందజేశారు. తమ సమస్య, ఇబ్బందులను అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో స్పందించి మాన్యువల్ ట్రై సైకిల్, వీల్ చైర్ అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# కుల బహిష్కరణపై ప్రజావాణిలో ఫిర్యాదు

**భిక్కనూర్, జూన్ 8 (మనం న్యూస్) :** బిక్కనూరు మండలం రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన దొంకెని నర్సింలు, మంజుల దంపతులు సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో తమ కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ., తమ కుమారుడు దొంకెని నవీన్కుమార్ 2025 ఏప్రిల్లో మేజర్ అయిన గర్గుల ప్రతిభను ప్రేమ వివాహం చేసుకున్నాడని తెలిపారు. అనంతరం సంప్రదాయం ప్రకారం గ్రామంలో విందు కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అయితే, తమ కులానికి చెందిన యువతిని వివాహం చేసుకోలేదనే కారణంతో కుల పెద్దలు రూ.50 వేల జరిమానా విధించారని, ఆ మొత్తం చెల్లించే వరకు తమతో ఎవరూ మాట్లాడొద్దని ఆంక్షలు విధించారని ఆరోపించారు. దీంతో గ్రామంలో సామాజికంగా ఒంటరితనానికి గురవుతున్నామని వాపోయారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు.



# పర్యాటక రంగానికి ప్రత్యేక రూట్ మ్యాప్

**రాష్ట్రంలో ఎనిమిది ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలకు సిద్ధం**

**ప్రపంచ స్థాయి వసతులు, ఐకానిక్ కట్టడాల దిశగా అడుగులు**

**ప్రపంచ స్థాయి పర్యాటక అనుభూతి కల్పించడమే లక్ష్యంగా ముందుకు**

**పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, కన్సల్టెంట్లు, ఆర్కిటెక్టులు, ఇంజినీర్లతో మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష సమావేశం**



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 08 (మనం బ్యూరో):** తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పర్యాటక శాఖ ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టిందని రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..... తెలంగాణ నూతన పర్యాటక విధానంలో భాగంగా తొలి దశలో ఎంపిక చేసిన 8 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను (మొత్తం 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలు) ఆకర్షణీయమైన గమ్యస్థానాలుగా అభివృద్ధి చేసేందుకు 'సమగ్ర మాస్టర్ ప్లాన్ల' రూపకల్పనపై దృష్టి సారించడం జరిగిందన్నారు. సోమవారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, ఆర్కిటెక్చరల్ ఇంజనీర్లు, కన్సల్టెంట్లతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు.

పర్యాటకులు కేవలం ప్రాంతాలను చూడటానికే పరిమితం కాకుండా, ఒక విభిన్నమైన అనుభూతిని కోరుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు. పర్యాటకులు మన రాష్ట్రానికి వస్తే వారికి అదొక మరపురాని జ్ఞాపకంగా మిగిలిపోవాలన్నారు. ప్రకృతి, వారసత్వం, ఆధ్యాత్మికత, సాహస క్రీడల కలబోతతో కూడిన 'స్లో టూరిజం'ను ప్రోత్సహించాలి అని మంత్రి దిశానిర్దేశం చేశారు. పర్యాటకులు కేవలం ఒక ప్రాంతాన్ని సందర్శించి వెళ్లిపోయేలా కాకుండా, అక్కడి ప్రకృతి, చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మికత, స్థానిక జీవనశైలిని ఆస్వాదిస్తూ మరపురాని అనుభూతిని పొందేలా సమగ్ర మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని సూచించారు. మొదటి దశలో భాగంగా వికారాబాద్, సోమశిల-అలంపూర్, వరంగల్-రామప్ప, నాగార్జునసాగర్, యాదాద్రి-పోచంపల్లి, ఆదిలాబాద్ గిరిజన క్లస్టర్, భద్రాచలం, కాళేశ్వరం ప్రత్యేక పర్యాటక ప్రాంతాలకు ఒకే తరహా ప్రతిపాదనలు కాకుండా, ఆయా ప్రాంతాల ప్రత్యేకతలు, భౌగోళిక పరిస్థితులు, చారిత్రక నేపథ్యం, పర్యాటక అవకాశాలను అధ్యయనం చేసి ప్రత్యేక మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రపంచంలోని విజయవంతమైన పర్యాటక గమ్యస్థానాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి తెలంగాణకు అనువుగా అమలు చేయాలని సూచించిన మంత్రి, కేరళలోని జటాయు తరహా ప్రాజెక్టులు పర్యాటకులను ఆకర్షిస్తున్న విధానాన్ని పరిశీలించాలన్నారు. తెలంగాణలోనూ ఐకానిక్ ల్యాండ్మార్క్లు, క్యాంటిలీవర్ వ్యూ డెక్స్, స్కైవాక్లు, అడ్వెంచర్ యాక్టివిటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రకృతి ఆధారిత అనుభూతులను కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. భువనగిరి కోట అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్న మంత్రి పేర్కొన్నారు. కేరళలోని జటాయు ప్రాజెక్టు కంటే భువనగిరి కొండ ప్రాంతం మరింత విస్తీర్ణం కలిగి ఉందన్నారు. చారిత్రక వారసత్వాన్ని పరిరక్షిస్తూ దేశంలోనే అత్యుత్తమ హెరిటేజ్, అడ్వెంచర్ టూరిజం కేంద్రంగా భువనగిరిని అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

సోమశిల-అలంపూర్ సర్క్యూట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. సోమశిల కృష్ణా బ్యాక్వాటర్స్ ప్రాంతంలో క్రూయిజ్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్ మార్గాలు, ఎత్తైన వ్యూ పాయింట్లు, ఎకో టూరిజం, వెడ్డింగ్ డెస్టినేషన్ల అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జటప్రోలు, మదనగోపాలస్వామి ఆలయం వంటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలను అనుసంధానం చేస్తూ సోమశిల సర్క్యూట్ను రాష్ట్రంలోనే అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని సూచించారు. తెలంగాణ పర్యాటక రంగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు కీలక శక్తిగా మారేలా ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, వివిధ ఏజెన్సీల ప్రతినిధులు, కన్సల్టెంట్లు, ఆర్కిటెక్టులు, ఇంజినీర్లు, శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వికలాంగులు, అనారోగ్య బాధితుల ఇంటి వద్దకే సర్పంచ్



**మహాదేవపూర్ జూన్ 08మనం న్యూస్:** మహాదేవపూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పెన్షన్ల ఈ-కేవైసీ ప్రక్రియను గ్రామ సర్పంచ హసీనా అక్బర్ ఖాన్ ప్రత్యేక చొరవతో పర్యవేక్షిస్తున్నారు వికలాంగులు, వృద్ధులు మరియుఅనారోగ్యంతో బాధపడుతూ బయటకురావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పెన్షన్లబ్ధిదారుల ఇళ్ల వద్దకే స్వయంగావెళ్లిఈ-కేవైసీ ప్రక్రియను నిర్వహించారుపెన్షన్ లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా,వారి ఇంటి వద్దనే సేవలుఅందేలా చర్యలుచేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మరియు వారికుటుంబసభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, ప్రభుత్వ సంక్షేమ పథకాలప్రయోజనాలునిరంతరాయంగా అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారుప్రజలకు చేరువగా ఉంటూ ముఖ్యంగా వికలాంగులు మరియు అనారోగ్య బాధితులకు అవసరమైన సేవలను వారి గడప వద్దకేతీసుకెళ్లడంఅభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. సర్పంచ్ హసీనా బానో సేవా దృక్పథాన్ని గ్రామ ప్రజలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యదర్శి కల్పన వార్డ్ సభ్యులు నల్ల బుగ్గ సమ్మయ్య మొహమ్మద్ బిన్ అలీ గ్రామ పంచాయతీ సిబ్బందిపాల్గొన్నారు

# ప్రజావాణి బాధితులకు జిల్లా కలెక్టర్ భరోసా



**కరీంనగర్ జూన్ 8(మనం బ్యూరో)** ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో వినూత్నంగా కొనసాగుతోంది. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. ప్రత్యేకంగా వృద్ధులు, దివ్యాంగుల వద్దకే వెళ్లి వారి అర్జీలను స్వీకరించిన కలెక్టర్, సంబంధిత అధికారులను సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించి, సమస్యలకు తగిన పరిష్కార మార్గాలు సూచించాలని అధికారులకు సూచించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. వివిధ శాఖల్లో ఫైళ్లను పెండింగ్లో ఉంచకుండా వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 144 దరఖాస్తులు అందాయి. జిల్లాలో 4, 6, 8, 10వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా గ్రామసభలు జరుగుతున్నాయి. ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సభల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావుతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఆటోలో వచ్చిన వృద్ధురాలు బొల్లం మల్లవ్వకు అండగా.. గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు బొల్లం మల్లవ్వ తన కుమారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేసేందుకు ప్రజావాణికి హాజరయ్యారు. ఆటోలో వచ్చిన ఆమె పరిస్థితిని గమనించిన జిల్లా కలెక్టర్ స్వయంగా ఆమె వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. జ తన కుమారులు తనను వేధిస్తున్నారని మల్లవ్వ విన్నవించగా, వెంటనే స్పందించిన కలెక్టర్ మహిళా సంక్షేమ శాఖ అధికారిణి సరస్వతిని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అధికారులు గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించి, కుమారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో మల్లవ్వ సమస్యకు పరిష్కారం లభించింది.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత రాకుండా చూడండి




- **మైనింగ్ శాఖ ప్రొఫైల్ సిద్ధం చేయాలి**
- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్ జూన్ 8(మనం బ్యూరో):** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఎలాంటి ఆటంకాలు లేకుండా అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డిస్ట్రిక్ట్ లెవల్ సాండ్ కమిటీ) సమావేశంలో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ గృహాల నిర్మాణంతో పాటు జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు కూడా ఇసుక కొరత తలెత్తకుండా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక సరఫరా ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మైనింగ్ శాఖ సమగ్ర ప్రొఫైల్ను సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాకు సంబంధించిన డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) రూపొందించి సమర్పించాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులు, కాలువల్లో పూడిక తొలగింపు (డీసిల్టేషన్) పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఇసుక నిర్వహణ, సరఫరా, పూడిక తొలగింపు తదితర ఐదు కీలక అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసాచారి, సీపీఓ రాందత్తారెడ్డి, మైనింగ్ శాఖ ఏడి వెంకటరెడ్డి, డీపీఓ జగదీశ్వర్తో పాటు వివిధ శాఖల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్ జూన్ 8(మనం బ్యూరో):** సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్లో మంగళవారం సాయంత్రం నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా స్వశక్తి మహిళా సంఘాలకు 553 బస్సులను సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేయనున్న నేపథ్యంలో సోమవారం రాత్రి కలెక్టరేట్లో జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కరీంనగర్ జిల్లాకు కేటాయించిన 16 బస్సులను మహిళా సంఘాలకు సీఎం అందించనున్నట్లు తెలిపారు. ప్రతి మండల సమాఖ్య నుంచి 50 మంది స్వశక్తి మహిళా సంఘ సభ్యులు సభకు హాజరయ్యేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళల ప్రయాణం, భోజనం, ఇతర సౌకర్యాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తనాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీఓ గీత, అదనపు డీఆర్డీఓ రవికుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్, ఆర్టీసీ డిపో మేనేజర్తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జై తెలంగాణ జై ఆంధ్ర ఐక్యత వర్ధిల్లాలి

**హైదరాబాద్, మనంన్యూస్:** ఇటీవల జరుగుతున్న తెలంగాణ మరియు ఆంధ్ర వివాదాలు గా మారిన నేపథ్యంలో క్రాంతి దళ అధ్యక్షుడు పృధ్వీరాజ్ యాదవ్ ప్రజలను రెచ్చగొడుతున్నట్టు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశాడు పవన్ కళ్యాణ్ ఒకవేళ భూమి కబ్జా చేసినట్లయితే తిరిగి ప్రభుత్వానికి ఇయ్యడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. దేశంలో ఎక్కడైనా పోటీ చేసే హక్కు ప్రతి ఒక్క భారత పౌలుడికి ఉందని గుర్తు చేశాడు గొంటి కుమార్ చౌదరి యాదవ్ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు ఎన్టీఆర్ విగ్రహాలను తీసేస్తామని అగౌరవపరిచే విధంగా గో బ్యాక్ ఆంధ్ర గో బ్యాక్ మార్వాడి అంటూ మాట్లాడుతున్న పృధ్వీరాజ్ యాదవ్ మాటల్ని తీవ్రంగా ఖండిస్తూ ఇటువంటి వ్యాఖ్యలు చేసే ఊరుకోమని మళ్లీ తెలంగాణలో ఎట్టి చాకిరి బాంచన్ నీ కాళ్ళు మొక్కుతా రజాకర్ల వారసుడుగా పృధ్వీరాజ్ యాదవ్ ప్రవర్తిస్తున్నాడు తెలంగాణలో పెట్టుబడులు రాష్ట్ర అభివృద్ధి నిరుద్యోగ సమస్య పోవాలంటే ఐక్యంగా ఉండాలని సమైక్యంగా పరిరక్షణ సమితి అధ్యక్షుడు గుంటి కుమార్ చౌదరి యాదవ్ స్పష్టం చేశారు.




# ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన కలెక్టర్

**ములుగు, జూన్ 8, మనం ప్రతినిధి:** ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు త్రైమాసిక తనిఖీ నిర్వహించారు.సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో



ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.డి. సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రొయ్యలు చేపల పులుసుతో వేలాది మందికి అన్నదానం

- **పశ్చిమ లో పేద ప్రజల ఆరోగ్యం, ఆక్వా రైతుల కోసం వినూత్న ప్రయోగం**



**పాలకొల్లు, జూన్ 8,మనం ప్రతి నిధి** రొయ్యలు చేపల పులుసుతో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గంల లో వేలాది మంది పేదలకు వినూత్న రీతిలో జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. దేశంలోనే ఈ కార్యక్రమం మొట్టమొదటిసారిగా జరిగింది. అనేక పోషక విలువలు ఉన్న రొయ్యలు చేపలు ప్రతి ఒక్కరు మృగశిర కార్తి నుంచి వినియోగించాలని ఆయన కోరారు. త్వరలోనే పాఠశాలల్లో మిడ్ డే మీల్స్, ఆర్మీ జవాన్ల ఆహారంలోనూ వినియోగించేలా తమ సంఘం తరఫున ప్రభుత్వానికి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. యాంటీబయటిక్ లేని రొయ్యల ఆహారాన్ని ఇతర దేశాలు వినియోగించడం జరుగుతుందని, మన దేశంలో అతి తక్కువగా వినియోగిస్తున్నారని ఈ వినియోగం పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీనివల్ల ఒకపక్క ప్రజల ఆరోగ్యం, మరోపక్క రైతులకు ఆక్వా ఉత్పత్తు ల డిమాండ్ పెరిగి గిట్టుబాటు ధరలు లభిస్తాయనే సదుద్దేశంతో సంఘం తరఫున ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు గాంధీ భగవాన్ రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కర్ణన గౌరు నాయుడు సంఘ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, స్థానిక ఆక్వా రైతు సంఘం నాయకులు రుద్రరాజు సత్యనారాయణ రాజు, మేడిది జాన్ డేవిడ్ రోజు, బొప్పన హరి కిషోర్,పి సత్యనారాయణ రాజు, సూర్యనారాయణ రాజు, రామ్భద్రరాజు, తదితరులు పాల్గొని మాట్లాడారు. పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గం లో వేలాదిమంది పేదలు రొయ్యలు గోంగూర కూర, చాపల పులుసు భోజనాలు చేశారు.

# మనభూమి.. మన హక్కు మహత్తర కార్యక్రమం

- **అభివృద్ధి పేరుతో దూసుకెళ్తున్న శబరి**
- **అభివృద్ధి అంటేనే బైరెటీ కుటుంబం**
- **ప్రపంచ పటంలో అభివృద్ధి అంటేనే చంద్రబాబు.. లోకేష్ బాబు.. బైరెడ్డి**




**నందికొట్కూర్(మనం న్యూస్)** మీ భూమి.. మీ హక్కు మీ తాత ముత్తాతల మి భూమిని రాజముద్ర పాస్ బుక్కు తో ఆక్రమించుకోవడానికి ఆస్కారం ఉండదని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే రాయలసీమ ఉద్యమ నేత ప్రజా హక్కుల కోసం పోరాడే వ్యక్తి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాత ముచ్చుమర్రి గ్రామంలో పాసుబుక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. సోమవారం నాడు పాసుబుక్కుల పంపిణీ కార్యక్రమం లో రాజముద్రం ఉన్న పాసుబుక్కులను పాత కొత్త ముచ్చుమర్రి గ్రామానికి సంబంధించి 883 బుక్కుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసినటువంటి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మన పగిడ్యాల మండలంలో రైతన్నల ఇబ్బందులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని కొత్త సంవత్సరం మృగశిర కార్తి సందర్భంగా రైతన్నలకు మంచి జరగాలని మంచి పంటలు పండి మంచి దిగుబడులు వచ్చి మంచి రేట్లతో ముందుకు సాగాలని వరుణ దేవుని ప్రార్థిస్తున్నానని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తెలియజేశారు. మన నంద్యాల పార్లమెంట్ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి డాక్టర్ గానే కాకుండా ప్రజల సేవ చేయాలనే సంకల్పంతో జాతీయ జనరల్ సెక్రెటరీగా మన ఆంధ్రప్రదేశ్లో ఏకైక మహిళ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రజాసేవలో ముందుండాలని అభివృద్ధిలో బైరెడ్డి కుటుంబానికి జిల్లాలోనే ఒక పేరు ఉందని మా నందికొట్కూరు నియోజకవర్గం శ్రీశైలం బ్యాక్ వాటర్ లో సర్వం కోల్పోయిందని కొత్త గ్రామాలను నిర్మించుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ లో సర్వం కోల్పోయినటువంటి కుటుంబాల కోసం కుటుంబాల కోసం శ్రీశైలం బ్యాక్ వాటర్ లో సర్వం కోల్పోయినటువంటి నష్టపరిహారం లక్షల కేసులను లోకాదాలతో నష్టపరిహారం ఇప్పించిన ఘనత ఒక బైరెడ్డి కుటుంబానికి ఉందని నేను ఆల్రెడీ చాలాసార్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి నిరుపేదల కష్టాలను గుర్తించి ఆదుకోవాలి. వారి యొక్క సమస్యలను పరిష్కరించే విధంగా కరెక్షన్లకు తావు ఇవ్వకుండా అభివృద్ధి కోసమే కష్టపడాలి అనే సంకల్పంతో ముందుకు సాగాలని చెప్పడం జరిగిందని బైరెడ్డి తెలియజేశారు ఈ కార్యక్రమానికి మండల తహసిల్దార్ శివరాములు.

మండల అభివృద్ధి అధికారిని సుమిత్రమ్మ. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ. వీఆర్వో. వీఆర్ఏలు. సచివాలయ సిబ్బంది. గ్రామ పెద్దలు వెంకట్రామిరెడ్డి. గ్రామ రైతులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అభిమానులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్కారు దవాఖానలో రోగుల అవస్థలు

## అందుబాటులో లేని కార్డియాలజిస్ట్ సేవలు...

## గుండె రోగులకు వైద్యం అందక ఆందోళన




**కొత్తగూడెం టౌన్, జూన్ 08 (మనంన్యూస్):** జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె సంబంధిత వ్యాధులకు చికిత్స అందించే కార్డియాలజిస్ట్ (హృదయ వైద్య నిపుణుడు) లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిగా ఉన్నప్పటికీ గుండె రోగులకు అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండె నొప్పులు, రక్తపోటు సమస్యలు, ఇతర హృదయ సంబంధిత వ్యాధులతో వచ్చే రోగులు ఖమ్మం, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. పేద కుటుంబాలకు ఈ ప్రయాణ ఖర్చులు, ప్రైవేట్ ఆసుపత్రుల బిల్లులు భారంగా మారుతున్నాయి.

**అందుబాటులో లేని కార్డియాలజిస్ట్ సేవలు**

ఇక కొత్తగూడెంలోని అనేక ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా పూర్తిస్థాయి గుండె వైద్య నిపుణులు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. సమయానికి వైద్యం అందక ప్రాణాపాయ పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో శాశ్వత కార్డియాలజిస్టును నియమించి, గుండె రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వెంటనే చర్యలు తీసుకుని హృదయ వైద్య విభాగాన్ని బలోపేతం చేయాలని, లేకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- నిర్మాణ పురోగతి ఆధారంగా ప్రతి సోమవారం బిల్లులు విడుదల
- రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి





**కూసుమంచి, జూన్ 08(మనం న్యూస్):** ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.సోమవారం కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. కేవలం ఇళ్ల మంజూరుతోనే బాధ్యత ముగిసిపోయిందని భావించకుండా నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి సోమవారం బిల్లులు విడుదల చేస్తున్నామని తెలిపారు.రాజుపేట గ్రామంలో వన్నాపురం సుభద్ర, దాసరి భద్రయ్య, కోట వీరారెడ్డి, సంద్ర ఎల్లమ్మ, గట్టు సింగారం గ్రామంలో గుంటి దుర్గా, గుడిపల్లి వెంకట నరసమ్మ, దివ్వల రమేష్, గుడిపల్లి జ్యోతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.రాజుపేట గ్రామంలో మంజూరైన గృహాల్లో నాలుగు పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని, గట్టు సింగారం గ్రామంలో 19 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 10 ఇళ్లు పూర్తై గృహ ప్రవేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు.ఈ లక్ష్యంతోనే రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామని వెల్లడించారు.అర్హులైన చివరి లబ్ధిదారుడికి కూడా ఇందిరమ్మ ఇల్లు అందే వరకు దశల వారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.నూతనంగా ఇళ్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసిన కుటుంబాలకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఇంట్లో సుఖ సంతోషాలతో, ఆత్మగౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



**ఖమ్మం, జూన్ 8(మనం న్యూస్):** సామాన్యులు గృహ అవసరాల కోసం వినియోగించే గ్యాస్ సిలిండర్‌పై 29 రూ.లు పెంచటాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. కొంతకాలం క్రితమే ఒకేసారి 60 రూపాయలు పెంచిన నరేంద్ర మోడీ ప్రభుత్వం మళ్ళీ 29 రూ.లు పెంచి సామాన్యులపై పెనుభారం మోపిందన్నారు. అంతర్జాతీయంగా పెరగకపోయినా యుద్ధం సాకుతో మొత్తం 89 రూపాయలు ఒక సిలిండర్‌పై పెంచటం గ్యాస్ కంపెనీలకు దోచి పెట్టటానికే అన్నారు. వెంటనే 89 రూ.ల పెంపును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకు ధరలు పెంచబోమని ప్రజల్ని నమ్మించిన బిజెపి ప్రభుత్వం ఎన్నికలు ముగిసిన వెంటనే నాలుగుసార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచిందన్నారు. తాజాగా గ్యాస్ ధరలు పెంచిందన్నారు. కొద్ది రోజుల్లోనే వంట గ్యాస్‌పై 25 రూ.లు పెంచే ప్రయత్నం చేస్తుందన్నారు. వాణిజ్య సిలిండ్ర ఈ కాలంలోనే 1300 రూ.లు పెంచి మొత్తం 3000 రూ.లు దాటిందని, ఫలితంగా అన్ని ఆహార పదార్థాల ధరలు, గ్యాస్ పెట్రో ఆధారిత రవాణా యితర ధరలు ఆకాశానికి అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు లాభాలు కురిపిస్తూ, సామాన్యులకు కడగండ్లు కలిగిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి నిరసనల సెగ తగిలిస్తామని హెచ్చరించారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి




- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- రూ.97 లక్షల సుడా నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనం ప్రారంభం
- వి.వి.పాలెంలో పర్యటించిన మంత్రి తుమ్మల



**రఘునాథపాలెం, జూన్ 8(మనం న్యూస్):** భావితరాలకు ఉపయోగపడేలా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను అత్యుత్తమ నాణ్యతతో అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.సోమవారం రఘునాథపాలెం మండలం వి.వి.పాలెం గ్రామంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి రూ.97 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వి.వి.పాలెం గ్రామంతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని తెలిపారు. 1982లో దివంగత ఎన్టీఆర్తో కలిసి తొలిసారిగా ఈ గ్రామానికి వచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వ కాలంలో ఎత్తిపోతల పనులు చేపట్టామని, అనంతరం ప్రతి ప్రభుత్వ హయాంలోనూ గ్రామ అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు.ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. జిల్లా పశు వైద్యశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆర్డీవోను ఆదేశించినట్లు చెప్పారు. పేదల్లో అత్యంత పేదలకు గృహ స్థలాలు అందించేందుకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ మండల ఉపకేంద్ర స్థాయి లో పశు వైద్యశాల భవనం వి.వి.పాలెంలో నిర్మించడం ఈ ప్రాంత ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పశు సంపద రైతులకు ఆర్థిక బలాన్ని అందిస్తుందని, పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ భవనం పూర్తి స్థాయిలో ఉపయోగపడుతుందని తెలిపారు.జిల్లా పశు వైద్యశాలకు పరిసర ఐదు, ఆరు జిల్లాల్లో మంచి గుర్తింపు ఉందని, కొన్ని మరమ్మతుల కోసం ప్రతిపాదనలు అవసరమని తెలిపారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు భూమి వినియోగం సమర్థవంతంగా ఉండాలని సూచించారు. పాఠశాలల కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాల్లో లేదా వినియోగంలో లేని ప్రభుత్వ భవనాలను మరమ్మతులు చేసి ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ ఛైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ హన్మంతరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్, వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, తహసీల్దార్ శ్వేత, సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఉప సర్పంచ్ గుగులోతు ప్రవీణ్ నాయక్, ఆత్మ ఛైర్మన్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులను బానిసలుగా చూడవద్దు

- సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం
- ఏవైనా ప్రాజెక్టులకు కొమరయ్య శేషగిరిరావు విఠల్ రావు పేర్లను పెట్టాలి
- యాజమాన్యానికి నేడు సమ్మె నోటీస్
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం సింగరేణి, జూన్8(మనం న్యూస్):** కార్మికుల శ్రమ శక్తితో మనుగడ సాగిస్తున్న సింగరేణి సంస్థ, అదే సంస్థల్లో అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులను ప్రభుత్వాలు, యాజమాన్యం కట్టుబానిసలుగా చూడడం సరైంది కాదని కార్మిక సమస్యలను పరిష్కరించకుంటే సింగరేణి వ్యాప్తంగా సమ్మెకు సిద్ధమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియూసి) గౌరవ అధ్యక్షులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రెండురోజులుగా వర్కర్స్ యూనియన్ జాతీయ కౌన్సిల్సమావేశాలు రుద్రంపూర్లో ఆర్సిఓఏ క్లబ్లో జరిగాయి. చివరి రోజు సోమవారం ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేసిన విలేకరుల సమావేశంలో కూనంనేని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని బంగారుబాతులా వాడుకుంటున్నాయని సంస్థ మనుగడకు పాటుడుతూ ఉత్పత్తిని ఆదాయాన్ని పెంచే మార్గాలను వదిలిపెట్టి సంస్థలో ఉన్నదంతా దోచుకుని సంస్థ మూసివేసే దశకు చేరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక యంత్రాల ద్వారా సంస్థ పనులు చేయించి కార్మికులు లేకుండా చేయలనే ఉద్దేశ్యంతో ఉన్నారని చెప్పారు. ఇక్కడ ఇత్పత్తి అయ్యే బొగ్గులో నాణ్యత లేదనే సాకులు చూపుతున్నారని నాణ్యత నాణ్యత తక్కువగా ఉన్న బొగ్గును కలిపి అవసరమైన పరిశ్రమలకు విక్రయించేందుకు దృష్టి సారించాలని చెప్పారు. దీనిని సాకుగా చూపి సింగరేణి మనుగడను దెబ్బతీయాలని చూస్తే ఊరుకోమని చెప్పారు. సంస్థ నష్టాల్లో నడుస్తోందంటూ చెబుతున్నారని ఎవరి వల్ల నష్టాలు వచ్చాయని ఎందుకు వస్తున్నాయని దానికి కారణాలు ఎంటో తేల్చాలన్నారు. నష్ట నివారణ చర్యలు చేపట్టకుండా చోద్యం చూడటం సరైంది కాదన్నారు. సింగరేణి వ్యాప్తంగా చేపడుతున్నప్రాజెక్టులకు కార్మిక నేతలు కొమరయ్య, శేషగిరి రావు, విఠల్ రావు పేర్లను పెట్టాలని డిమాండ్ చేశారు. సంస్థలో మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని సొంతింటికి రుణసదుపాయాన్ని కల్పించాలని డిపెండ్లకు ఉద్యోగాలు ఇవ్వాలని డిపార్ట్మెంట్ పోస్టులు భర్తీ చేయాలని సహజన మరణం పొందిన వారికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. 30 డిమాండ్ల సాధనకు గుర్తింపు సంఘం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఈ మేరకు సోమవారం యాజమాన్యానికి సమ్మె నోటీస్ అందిస్తున్నామని న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయకుంటే ఆర్టిసి సమ్మెకు మించిన సమ్మెను చేస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మిర్యాల రంగయ్య, కె.సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, మద్ది ఎల్లయ్య, వైవి రావు, ముస్కే నమ్మయ్య, వంగా వెంకట్, వీరస్వామితో పాటు అన్ని ఏరియాల బ్రాంచ్ కార్యదర్శులు, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి



- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 08 (మనంప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతితో కలిసి ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్హత మేరకు వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే అంశాలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ప్రతి సమస్య వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రజల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కట్టుబడి పనిచేయాలని ఆదేశించారు.

**ప్రజావాణిలో దరఖాస్తులలో ముఖ్యమైనవి**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ మున్సిపాలిటీ వనమ కాలనీలో నివాసముంటున్న విజయలక్ష్మి, తమకు ఇంటి నిర్మాణ స్థలం ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేక ఇల్లు నిర్మించుకోలేకపోతున్నామని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు.

దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్, తదుపరి చర్యల నిమిత్తం గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్కు ఎండార్స్ చేశారు. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో నివాసముంటున్న కొండపల్లి ఉమా, తమ కుటుంబం తీవ్ర పేదరికంలో ఉందని, పదో తరగతిలో మంచి ప్రతిభ కనబరిచిన తమ కుమార్తె టీజీఎస్డబ్ల్యూఆర్ఎస్ పాల్వంచలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిందని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో గురుకుల పాఠశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సమయంలో అనారోగ్యానికి గురికావడంతో పరీక్షకు హాజరు కాలేకపోయిందని, తమ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని సీటు కేటాయించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును కలెక్టర్ పరిశీలించి సంబంధిత ఆర్సీఓకు ఎండోర్స్ చేశారు. దుమ్ముగూడెం మండలం కోయి నర్సాపురం గ్రామపంచాయతీ పరిధిలోని ఆదివాసీ రైతులు, కోయి నర్సాపురం గ్రామంలో సుమారు 250 ఎకరాల భూమిలో 116 మంది ఆదివాసీలు సాగు చేస్తున్నారని, తమ తాతముత్తాతలు భూమి శిస్తు కూడా చెల్లించి యున్నారని , పట్టాలు జారీ చేయాలని పేసా గ్రామసభ తీర్మానం కూడా జరిగిందని తెలిపారు. సర్వే నంబర్లు 28, 29, 52లలో సర్వే నిర్వహించి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్, తగు చర్యల కోసం దుమ్ముగూడెం తహసీల్దార్కు ఎండోర్స్ చేశారు. అశ్వాపురం మండలానికి చెందిన కోడి నాగరాజు, రోడ్డు ప్రమాదంలో తన ఎడమ చేయిని కోల్పోయానని, డిగ్రీ వరకు చదువుకున్నానని, జీవనోపాధి కోసం ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగావకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్ దే



- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



**కొత్తగూడెం,జూన్8(మనం న్యూస్):** నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్ దేనని తెచ్చుకున్న తెలంగాణలో యువత కీలక పాత్ర పోషించడం జరిగిందని గత పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ హయాంలో నిరుద్యోగులకు సుమారు 1 లక్షా 67,000 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని రాజ్యసభ సభ్యుడు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నదమవుతున్న విద్యార్థి, నిరుద్యోగులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డిచే ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను కొత్తగూడెం క్లబ్ లో సోమవారం రాజ్యసభ సభ్యుడు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలకు తూట్లు పొడిచిందన్నారు. నిరుద్యోగ యువతకు అనేక వాగ్దానాలు చేసి మూడేళ్లు కావస్తున్న ఉద్యోగాలు ఇచ్చే విషయంలో ఊసెత్తడం లేదన్నారు. తెలంగాణ తెచ్చిన పార్టీనే శ్రీ రామ రక్ష అని తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండాలన్నారు. పార్లమెంట్ లో మన ఎంపీలు ఉన్నప్పుడే మన తెలంగాణకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యసభలో ముగ్గురం బీఆర్ఎస్ ఎంపీలము ఉంటే అనేక అంశాల మీద పోరాడటం జరుగుతుందని నిరుద్యోగ అంశంపై కూడా పోరాడుతామని భరోసా ఇచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో ముఖ్యంగా పరిశ్రమల ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కృషితో ఐటీ రంగం, ఫార్మా రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కేవలం నిరుద్యోగుల పక్షాన పోరాడటమే కాకుండా వారి ప్రిపరేషన్ లో తోడుగా ఉండటానికి బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి యాప్‘ను రూపొందించి పూర్తిగా అందించడం అభినందనీయమన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**యువత నోట్లో మన్ను కొట్టిన రేవంత్ రెడ్డి**

జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువత కాంగ్రెస్ ప్రభుత్వం నుండి ఉద్యోగ ప్రకటన వస్తుందని ఎంతగానో ఆశించారని కానీ మునుపటి లాగే రేవంత్ రెడ్డి నిరుద్యోగ యువత నోట్లో మన్ను కొట్టడం దుర్మార్గమని ఏనుగుల రాకేష్ రరెడ్డి ధ్వజమెత్తారు. ఒక్క ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి ఆకరికి మూడేళ్ల తర్వాత ఒక 5 వేలు ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని అదే జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు నిరుద్యోగ భృతి జాబ్ క్యాలెండర్ వంటి అనేక హామీలిచ్చి మాట తప్పిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వర్ రావు, తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి వ్యవహారంతో అప్పుడే జనాలు విసుగు చెందారని ఇంత స్వల్ప కాలంలో ఇంతటి ప్రజా వ్యతిరేకత మూటకట్టుకున్న ఏకైక ప్రభుత్వం ప్రపంచంలో ఇదేనని అన్నారు. గత శాసన మండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ పక్షాన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన ఏనుగుల రాకేష్ రెడ్డి స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ గెలిచిన అభ్యర్థి కంటికి కానరకున్నా రాకేష్ రెడ్డి నిరంతరం విద్యార్థులు నిరుద్యోగులు ఉద్యోగుల సమస్యలపై పోరాడుతూ తిరుగుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రజల గురించి నిరుద్యోగ యువత గురించి మనసుపెట్టి ఆలోచించి పరిష్కారం చూపే ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు తోడుగా ఉండాలన్న సంకల్పంతో రాకేష్ రెడ్డి అందిస్తున్న యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిండిగాల రాజేందర్, షైన్ ఇంటిట్యూట్ నిర్వాహకులు జలీల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సీతా మహాలక్ష్మి, కిలారు నాగేశ్వర రావు, మానే రామకృష్ణ, వనమా రాఘవేందర్, యువనేత అనుదీప్, స్థానిక కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామసభలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూల స్తంభాలు

## గ్రామసభతో గ్రామాల సమగ్రాభివృద్ధికి బాటలు పడాలి
## గ్రామ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు మహా కీలకం
## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
## చందుబట్ల గ్రామసభలో జిల్లా కలెక్టర్, ఎస్పీ

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 08 (మనం బ్యూరో)**: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నాగర్ కర్నూల్ మండల పరిధిలోని చందుబట్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ తిరుపతి గౌడ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన గ్రామసభకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, గ్రామ ప్రజలతో అధికారులు ముఖాముఖి సమావేశమై గ్రామంలోని సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై నేరుగా వివరాలు సేకరించారు. అనంతరం సంబంధిత అధికారులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ,. గ్రామసభలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభాలని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేసే వేదిక గ్రామసభ అని అన్నారు. గ్రామ ప్రజలు తమ అవసరాలు, సమస్యలను గ్రామసభలో స్వేచ్ఛగా తెలియజేయాలని ఈ సందర్భంగా సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధిదీపాలు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత



ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామసభల ద్వారా తీసుకునే నిర్ణయాలు గ్రామ ప్రగతికి దోహదపడతాయని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ,.. సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. ప్రస్తుతం యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. గ్రామాల్లో యువత డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. యువత విద్య, ఉపాధి, క్రీడలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించి తమ జీవితాలను ఉన్నత లక్ష్యాల వైపు మలుచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అదేవిధంగా సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మహిళల రక్షణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసభలో ఆర్డిఓ సురేష్ బాబు, డీఎస్పీ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, ఎంపీడీవో చిన్నమ్మ, ఎంపీఓ రాజీవ్ ప్రసన్న కుమార్, సెక్రటరీ అన్వేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూములు కబ్జా చేసిన అనిల్ రెడ్డిపై
# క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- సింగూర్ బ్యాక్ వాటర్ ఖాదిరాబాద్ కొరివికుంట భూములపై సమగ్రవిచారణ చేయాలి
- కబ్జా భూములు వెంటనే స్వాధీనం చేసుకోవాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



**సంగారెడ్డి జూన్ 8 మనం న్యూస్ ప్రతినిధి** : వటీపల్లి మండలం ఖాదిరాబాద్ గ్రామ పరిధిలో అధికారం అండతో ప్రభుత్వ భూములు కబ్జా చేసిన అనిల్ రెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. నేడు సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వటం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ వటీపల్లి మండలం ఖాదిరాబాద్ గ్రామ పరిధిలో సింగూర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ లో కొరివి కుంట భూముల కబ్జా పై సమగ్ర విచారణ చేయాలని, కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాౌడ్ చేశారు. రాష్ట్ర మంత్రి బంధువు కొరివి కుంట తో పాటు చుట్టూ వందల ఎకరాలు భూ కబ్జాకు పాల్పడుతున్న అధికారులు చర్యలు తీసుకోవటం లేదని అన్నారు.ప్రభుత్వ భూమి ఇరిగేషన్ భూములలో పెద్ద పెద్ద రాళ్లు వేసి, కరెంట్ స్తంబాలు వేసి కబ్జా చేస్తుంటే రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు కేసులు ఎందుకు నమోదు చేయటం లేదని ప్రశ్నించారు.అదికారులు తమకు పట్టనట్లు ఫార్మ్ హౌస్ కు పరిమితం అవుతున్నారని అన్నారు.నిర్లక్ష్యం గా వ్యవరిస్తున్నా అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. వందల ఎకరాలు భూములు కబ్జా అవుతుంటే 1.20 ఎకరాలు అని ఎలా ప్రకటన చేస్తారని అన్నారు.కబ్జా చేసిన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఫార్మ్ హౌస్ కు పరిమితం అయినా అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు నర్సిములు, నాగేశ్వరావు,రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ఫీజు బకాయిల విడుదలకు వినతి

## కోర్సులు పూర్తయినా సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందుల్లో విద్యార్థులు
## గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్లో ఉన్న బకాయిలు
## ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలి
## టీఎన్ఎస్ఎఫ్ నాయకులు డాక్టర్ బాలు



**కామారెడ్డి, జూన్ 8 (మనం న్యూస్)**: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ తెలుగునాడు విద్యార్థి సమైక్య (టీఎన్ఎస్ఎఫ్), తెలంగాణ జన సమితి (టీజేఎస్) ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ బాలు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కుంభాల లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ, ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వివిధ కోర్సులు పూర్తి చేసినప్పటికీ కళాశాలలు బకాయిల కారణంగా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు బకాయిలను విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో పలుమార్లు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. విద్యార్థి సంఘాల ఆందోళనల్లో పాల్గొని అప్పటి ప్రభుత్వాన్ని విమర్శించిన నాయకులు, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పెండింగ్ బకాయిల సమస్యను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్లో ఉన్న బకాయిలతో పాటు ప్రస్తుత బకాయిలను కూడా వెంటనే విడుదల చేసి విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫీజు బకాయిల సమస్యను అత్యవసరంగా పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# చందుబట్లలో వరి నిల్వలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

- ధాన్యం నిల్వల భద్రత, నాణ్యతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి
- ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియపై ఆకస్మిక తనిఖీలు
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 08 (మనం బ్యూరో)**: నాగర్‌కర్నూల్ మండలంలోని చందుబట్ల గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో నిల్వ ఉంచిన వరి ధాన్యాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ సోమవారం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం నిల్వలు, వాటి భద్రత, నిర్వహణ విధానాలను వారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో నిల్వ చేసిన వరి ధాన్యం వివరాలను సంబంధిత అధికారులు కలెక్టర్కు వివరించారు. ధాన్యం నిల్వ చేసే గోదాముల సామర్థ్యం, తేమ శాతం, నాణ్యత పరిరక్షణ చర్యలు, రవాణా ఏర్పాట్లు, భద్రతా ప్రమాణాలపై అధికారులు ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యానికి ఎలాంటి నష్టం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం నిల్వల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రైతుల శ్రమకు తగిన విలువ దక్కేలా ధాన్యం నాణ్యతను కాపాడాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, ధాన్యం దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల నుంచి ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేసి, రైతులు ఎక్కువసేపు నిరీక్షించాల్సిన పరిస్థితులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎలాంటి ఆలస్యం లేకుండా డేటా నమోదు ప్రక్రియను సకాలంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలు అందిస్తూ, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అలాగే నిల్వల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. ధాన్యం నిల్వ కేంద్రాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ, ధాన్యం నిల్వ కేంద్రాలు, గోదాముల వద్ద భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. నిల్వల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతుల కష్టార్జిత పంట భద్రంగా నిల్వ ఉండేలా అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ తనిఖీలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహారావు, డి ఎం సివిల్ సప్లై రాజేందర్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లు ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రామానికి విద్యుత్ లైను నియమకాన్ని వెంటనే చేపట్టాలి

**మోర్తాడ్ జూన్ 8(మనం న్యూస్)**: ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తీర్చడానికి ముందుంటానని ఏర్గట్ల మండలంలోని బట్టా పూర్ గ్రామ ఉపసర్పంచ్ మూడ్ దయానంద్ అన్నారు. నిజామాబాద్ కలెక్టరెట్ లోసోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అయన బట్టాపూర్ గ్రామానికి విద్యుత్ లైన్ మెన్ నియామక ఏర్పాటు గ్రామ రైతుల కోసం ప్రతి సీజన్ లో శాశ్వతంగా ప్రతి పంట ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్గట్ల సొసైటీ ద్వారా కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో పాటు గ్రామంలో జరగవల్సిన అభివృద్ధి పనులకు నిధుల మంజూరు బట్టాపూర్ పాటు ఏర్గట్ల మండలంలోని ఎనిమిది గ్రామాలలో ఒంటరి మహిళలకు , వితంతువులకు, వృద్దులకు, వికలాంగులతో పాటు బీడీ కార్మికులకు, గీత కార్మికులకు నూతన పెన్షన్ మంజూరి గురించి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేశారు. దీనితో పాటు మండలం లోని అన్ని గ్రామాల నుండి నూతన రేషన్ కార్డుల జారీ కోసం, రేషన్ కార్డులో కొత్త పేర్లు నమోదు కోసం, మార్పులు చేర్పులు కోసం దరఖాస్తులు చేసుకోని ఎదురుచూస్తున్న వారికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలనీ, అర్హులైన వృద్దులకు వితంతువులకు, ఒంటరి మహిళలకు, పేదలకు అంత్యోదయ పథకం క్రింద లభించే 35 కిలోల రేషన్ బియ్యం కార్డులు కూడా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కు అయన వినతి పత్రం ఉప సర్పంచ్ అందజేశారు.

# ప్రభుత్వ ఇచ్చిన గడువులోగా ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం ముందుకెళ్తూ సాధించాలి

- రైతుల ప్రయోజనాల పరిరక్షణతో భూసేకరణ పూర్తి చేయాలి
- పెండింగ్ అంశాల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఆర్అండ్ఆర్ కమిషనర్ కె. శివకుమార్ నాయుడు
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 08 (మనం బ్యూరో)**: నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర పునరావాసం, పునర్వ్యవస్థీకరణ (ఆర్అండ్ఆర్) కమిషనర్ కె. శివకుమార్ నాయుడు ఆదేశించారు. రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ చట్టబద్ధంగా భూసేకరణ, పరిహారం చెల్లింపులు, పునరావాస కార్యక్రమాలను పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్తో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పురోగతి, పెండింగ్ సమస్యలు, రైతులకు పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు, అవార్డుల జారీ తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ శివకుమార్ నాయుడు మాట్లాడుతూ,.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో పర్యటిస్తూ సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నట్లు, రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతాంగ అభ్యున్నతికి కీలకమైన ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. నాగర్కర్నూల్ జిల్లాలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, అచ్చంపేట రిజర్వాయర్తో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూముల సేకరణలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులతో చర్చించి వారిని ఒప్పిస్తూ, చట్టపరమైన అన్ని నిబంధనలను పాటిస్తూ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పెండింగ్లో ఉన్న ఆవార్డులను త్వరితగతిన జారీ చేసి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్న ఆయన అన్నారు. భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం, పునరావాసం, పునర్ వ్యవస్థీకరణ ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును సానుకూల దృక్పథంతో పరిశీలించి, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు వ్యవసాయాభివృద్ధికి వెన్నెముకలాంటివన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ప్రాజెక్టుల వారీగా భూసేకరణ స్థితిగతులను అధికారులు సమావేశంలో వివరించారు. ఎక్కడెక్కడ భూసేకరణ పెండింగ్లో ఉందో, పరిహారం చెల్లింపుల్లో ఎదురవుతున్న సమస్యలు, రైతులతో జరుగుతున్న చర్చల వివరాలను కమిషనర్కు తెలియజేశారు. వాటిపై స్పందించిన కమిషనర్, పెండింగ్ అంశాలన్నింటినీ నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, భూసేకరణ ప్రత్యేక అధికారులు, సంబంధిత ప్రాజెక్టు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు దూరం ఉందాం...
# ఆరోగ్యాన్ని కాపాడుకుందాం...

## మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు
## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరం
## మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖల సమన్వయం తప్పనిసరి
## యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడాలి
## నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్,
## జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్...



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 08 (మనం బ్యూరో)**: జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలపై అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం నాగర్కర్నూల్ ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశంలో వారు పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నియంత్రణలో పోలీసు, రెవెన్యూ, వైద్య, విద్యాశాఖలతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి విద్యార్థులకు సంపూర్ణంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేసి అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాజంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. యువత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకునేలా తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు యువతలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంకేశ్వరం గ్రామంలో 16 గంజాయి మొక్కలు, 19 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి గాయత్రి తెలిపారు. అక్రమ గంజాయి సాగు, నిల్వలపై ఎక్సైజ్ శాఖ చేపట్టిన చర్యలను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, పోలీసు శాఖ ప్రతినిధులు, విద్యాశాఖ, వైద్యశాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నకిలీ నంబర్ ప్లేట్తో వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు



- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి జూన్ 8 మనంప్రతినిధి**: సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసుల తనిఖీలలో నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌ను ఉపయోగిస్తూ వాహనం నడుపుతున్న వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు.వివరాల్లోకి వెళితే, తేది: 22-05-2026న పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ఒక స్కూటర్కు ఈ-చలానా విధించారు. అనంతరం ఆ స్కూటర్ నంబర్కు సంబంధించి హైదరాబాద్కు చెందిన ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసులు విచారణ చేపట్టడం జరిగింది. ఈ క్రమంలో సంగారెడ్డి పాత బస్ స్టాండ్ వద్ద వాహనాల తనిఖీల సందర్భంగా అదే నంబర్ ( టీఎస్ 12 ఈవి 2299) కలిగిన స్కూటర్ను గుర్తించడం జరిగింది. నిందితుడు తన అసలు వాహన రిజిస్ట్రేషన్ నంబర్కు బదులుగా నకిలీ నంబర్ ప్లేట్ను అమర్చి, ట్రాఫిక్ చలానాలు , చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకునాలనే ఉద్దేశంతో వాహనాన్ని నడుపుతున్నట్లు తేలింది. నిందితుడి వివరాలు: పూజారి అరుణ్ కుమార్ గౌడ్, దౌల్తాబాద్ గ్రామం, హత్నూర మండలం, సంగారెడ్డి జిల్లా. జిల్లాలో ఎవరైనా తప్పుడు నంబర్ ప్లేట్లను వినియోగించినా, వాహన నంబర్ స్పష్టంగా కనిపించకుండా చేసినా, లేదా ఇతర అక్రమాలకు పాల్పడినా వారిపై జిల్లా పోలీసు కార్యాలయం నుండి ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# వరద నీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి

- వరద ప్రాంతాలను పరిశీలించిన మున్సిపల్ ఏఈ వేణు ప్రసాద్



**కామారెడ్డి, జూన్ 8 (మనం న్యూస్)**: కామారెడ్డి మున్సిపాలిటీ 14వ వార్డులో వర్షాకాలంలో ఇళ్లలోకి వరద నీరు రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత మున్సిపల్ అధికారులను కోరారు. మున్సిపల్ ఏఈ వేణు ప్రసాద్, కాలనీవాసులతో కలిసి డిగ్రీ కళాశాల, శిశు మందిర్, కర్షక్ బీఈడీ కళాశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. డిగ్రీ కళాశాల గోడ కూలిపోవడంతో 14, 35 వార్డులలోని ఇళ్లకు వరద ముప్పు పెరిగిందని స్థానికులు తెలిపారు. గత రెండేళ్లుగా కాకతీయనగర్, ఎన్జీవోస్ కాలనీల్లో వరదల కారణంగా ఆస్తి నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. కళాభారతి, డిగ్రీ కళాశాల ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు కాలనీల్లోకి చేరకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, పాత ఎన్హెచ్ రహదారి వెంబడి కాలువ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కళాశాలల యాజమాన్యాలు కూడా స్పందించి వరద నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# భారత్ వద్ద 190 అణ్వాయుధాలు.. పాక్ కంటే అధికం..?

## అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ వెల్లడి



**స్టాక్‌హోమ్, జూన్ 8 :** ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, యుద్ధాల నేపథ్యంలో ఇటీవలి కాలంలో అనేక దేశాలు తమ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్నాయి. ముఖ్యంగా అణుశక్తి కలిగిన దేశాలు తమ ఆయుధ సంపత్తిని మరింత పెంచుకుంటున్నాయి. మన దేశం కూడా ఈ విషయంలో వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ఏడాది జనవరి నాటికి భారత్ వద్ద 190 అణ్వాయుధాలు (అణు వార్‌హెడ్‌లు) ఉన్నాయని స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ (సిప్రి) వెల్లడించింది. పాకిస్థాన్ కంటే భారత్ వద్ద 20 అణ్వాయుధాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. ప్రపంచ దేశాల వద్ద అణ్వాయుధాలపై వార్షిక నివేదికను సిప్రి సోమవారం విడుదల చేసింది. ఏడాది వ్యవధిలో భారత్ 10 వార్‌హెడ్‌లను పెంచుకుందని ఈ నివేదిక తెలిపింది. ఇక, చైనా వద్ద 620 అణ్వాయుధాలు ఉన్నాయని పేర్కొంది. గతేడాదితో పోలిస్తే బీజింగ్ 20 అణు వార్‌హెడ్‌లను తన ఆయుధాగారంలోకి చేర్చుకుందని తెలిపింది. ఇక, ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలున్న దేశాలుగా రష్యా, అమెరికా నిలిచాయి. రష్యా వద్ద 5,420, అగ్రరాజ్యం వద్ద 5,042 అణు వార్‌హెడ్‌లు ఉన్నాయని సిప్రి వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా అణుశక్తి దేశాలు కలిగిన దేశాలు తొమ్మిది కాగా.. వాటి వద్ద మొత్తంగా 12వేలకు పైగా అణ్వాయుధాలు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో ఫ్రాన్స్ (370), యూకే (225), ఇజ్రాయెల్ (90), ఉత్తరకొరియా (60) దేశాలున్నాయి. ఇక, ప్రపంచంలోనే అత్యధిక రక్షణ వ్యయం ఉన్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో ఉంది. 2025లో భారత రక్షణ వ్యయం 92.1 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు సిప్రి నివేదిక తెలిపింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 8.9శాతం ఎక్కువ. ఇక, 2021-25 మధ్య ప్రపంచవ్యాప్తంగా రక్షణ దిగుమతుల్లో 8.2శాతం మన దేశానివే.

# మమతకు వరుస షాక్లు..

## ఎన్డీయేకు 20మంది లోక్‌సభ టీఎంసీ ఎంపీల మద్దతు



**కోల్‌కతా, జూన్ 8 :** పశ్చిమ బెంగాల్లో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌లో తీవ్ర సంక్షోభం కొనసాగుతున్న నేపథ్యంలో లోక్‌సభలోని 20మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎంపీ కకోలీ ఘోష్ నేతృత్వంలో రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ సమర్పించారు. లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్‌గా తాను.. తోటి ఎంపీలతో సంప్రదింపుల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఘోష్ తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ.. వారు ఎన్నుకున్న ప్రభుత్వంతోనే కలిసి పని చేయాలని తమ బృందం నిర్ణయించుకుందని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంపై టీఎంసీ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ చీలికతో లోక్‌సభలో మమతాబెనర్జీ సారథ్యంలోని తృణమూల్‌కు కేవలం ఎనిమిదిమంది సభ్యులే మిగిలారు.

# మమతకు మరో ఎదురుదెబ్బ..

# పార్టీని వీడిన సీనియర్ ఎంపీ





**కోల్‌కతా, జూన్ 8 :** టీఎంసీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీతో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ అసెంబ్లీ సభ్యుల్లో తిరుగుబాటు పార్లమెంట్ వైపు కూడా పాకొచ్చని ఇటీవలే ఆయన పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. టీఎంసీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన పార్టీ నుంచి వైదొలగడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నాయకులలో ఒకరిగా సుఖేందు పేరు సంపాదించారు. పార్టీని వీడుతున్నట్లు సుఖేందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు. అందులో పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై తీవ్ర అణచివేతను, విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ, ఉపాధి, శాంతిభద్రతలతో సహా పలు రంగాలలో నెలకొన్న తీవ్ర అరాచకాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మరోవైపు బీజేపీపై ప్రశంసలు కురిపించారు. బెంగాల్ చరిత్రలో తొలిసారిగా ఓటర్లు ఆ పార్టీకి భారీ విజయాన్ని అందించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ప్రశంసించారు. ఇప్పటికే దాదాపు 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ ఆయనను నియమించారు. అసమ్మతి ఎమ్మెల్యేలతో ఆ పార్టీ ఎంపీలు కూడా టచ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సుఖేందు తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరో ఎంపీ కోయల్ మల్లిక్ కూడా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరో 14మంది టీఎంసీ ఎంపీలు బెంగాల్ సీఎం సువేందు అధికారిని కలిసినట్లు మీడియా వర్గాలు వెల్లడించాయి. వారు బీజేపీలో చేరనున్నట్లు తెలుస్తోంది.

## పశ్చిమబెంగాల్

# టీఎంసీ నేత అరెస్ట్



**కోల్‌కతా, జూన్ 8 :** బెంగాల్లోని ఫల్టాలో ఇటీవల రీపోలింగ్ నుంచి వైదొలిగిన టీఎంసీ నేత జహంగీర్ ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగాల్ ఎన్నికల సమయంలో దక్షిణ 24 పరగణాల నియోజకవర్గంలో ఈవీఎంలలోని కమలం గుర్తు దగ్గర ఉన్న బటన్‌ను వినియోగించకుండా దానిని టేప్‌తో కప్పి అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణల కేసులో ఆయనను అరెస్ట్ చేశారు. కొంతకాలంగా పరారీలో ఉన్న జహంగీర్ దేశం విడిచి పారిపోతున్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ అధికారులు ఆయనను నేపాల్ సరిహద్దుల్లో అదుపులోకి తీసుకున్నారు.

ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లను బెదిరించడం, బటన్ల ట్యాంపరింగ్ నిజమని తేలడంతో ఈసీ ఆయా నియోజకవర్గాల్లో రీపోలింగ్ నిర్వహించింది. ఈ కేసులో జహంగీర్‌పై ఏడు ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. కాగా కలకత్తా హైకోర్టు అతడికి ముందస్తు బెయిల్ ఇవ్వడంతో పోలీసులు అదుపులోకి తీసుకోలేదు. గతంలో మంజూరు చేసిన మధ్యంతర రక్షణను కోర్టు ఇటీవల ఉపసంహరించుకోవడంతో పోలీసులు తాజాగా అతడిని అరెస్ట్ చేశారు.

# ఆడుకుంటూ కుప్పకూలిన 14 ఏళ్ల బాలిక..

# గుండెపోటే కారణమా?

**అహ్మదాబాద్, జూన్ 8 :** బంధువులతో కలిసి హోటల్‌లో భోజనం చేసి, ఆ తర్వాత బయట ఆడుకుంటున్న ఓ టీనేజర్ అకస్మాత్తుగా కుప్పకూలిపడిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించినా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. గుండెపోటు వల్లే ఆమె మరణించి ఉండొచ్చని వైద్యులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు చెందిన 14 ఏళ్ల టీనేజర్ ఆనంది మోదీ.. వేసవి సెలవుల్లో రాజ్‌కోట్‌లోని తన మేనమామ ఇంటికి వెళ్లింది. ఆదివారం సాయంత్రం ఆ కుటుంబసభ్యులంతా కలిసి హోటల్‌కు వెళ్లారు. భోజనం చేసిన తర్వాత బయటకు వచ్చిన ఆనంది.. అక్కడ ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంది. ఆ క్రమంలోనే పరిగెత్తుతూ ఒక్కసారిగా కిందపడిపోయింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినా ప్రాణాలు మాత్రం దక్కలేదు. ప్రాథమికంగా గుండెపోటు కారణం కావొచ్చని భావిస్తున్నా.. పోస్ట్‌మార్టమ్ తర్వాత పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. గతంలోనూ ఇలా పిల్లలు ఆడుకుంటూ కుప్పకూలిన ఘటనలు జరిగాయి. 2024లో ఉత్తర ప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన ఒక పాఠశాలలో జరిగిన క్రీడల పోటీల్లో పాల్గొన్న టీనేజర్ మోహిత్ చౌధరీ గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. అదే ఏడాది అలీగఢ్‌లో 20 ఏళ్ల మమత పరిగెడుతూ ఇలాగే మృతి చెందింది.



## ఎప్పుడొచ్చాం కాదు..?

# పనిచేశామా లేదా

- ఎప్పుడొచ్చాం కాదు...పనిచేశామా లేదా
- బీఆర్ఎస్ నేతలు ఇసుక పేరుతో కోట్ల రూపాయలు దోచుకుతిన్నరు
- మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్,జూన్ 08(మనం న్యూస్):** శాఖ అనేది ముఖ్యం కాదని.. పని చేయడం అందులో మన మార్కు చూపించడం ముఖ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. సోమవారంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా వివేక్ వెంకటస్వామి విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలో ఉన్న పదేండ్లలో బీఆర్ఎస్ నేతలు ఇసుక పేరుతో కోట్ల రూపాయలు దోచుకుతిన్నరని మంత్రి వివేక్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెన్నూరు నియోజకవర్గంలో కూడా ఇసుక మాఫియా కోట్ల రూపాయలు కొల్లగొట్టిందన్నారు. సాండ్, మెటల్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్ రెడ్డి తనకు ముందే చెప్పారని, సీఎం ఆదేశాల మేరకు ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపామని తెలిపారు. ఇసుక లారీలు నెంబర్ ప్లేటతో దందా చేయకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఇసుక రవాణా సులభతరం చేయడంతో పాటు ధరల నియంత్రణకు కృషి చేస్తున్నామని తెలిపారు. దీంతో ఇప్పుడు ప్రభుత్వానికి ఆదాయం పెరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ గనులకు యాక్షన్ వేయలేదని దుయ్యబట్టారు.


**మైనింగ్ అక్రమాలపై విచారణ:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన మైనింగ్ అక్రమాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విచారణ కొనసాగుతోందని తెలిపారు. సీబీసీఐడీ విచారణలో ఎవరు బాధ్యులుగా తేలిన చర్యలు తీసుకుంటామన్నారు. కేటీఆర్ దేనిపైన అవగాహన లేకుండానే మాట్లాడుతారని.. ఇకనైనా గాలి మాటలు మాట్లాడటం మానుకోవాలని విమర్శించారు.తుమ్మిడి హట్టిపై హరీష్ రావు అన్ని అబద్ధాలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖా ఏదైనా నా వంతు కృషి చేసి ఒక మార్పు క్రియేట్ చేస్తానని చెప్పారు. శాఖ అనేది ముఖ్యం కాదని.. పని చేయడం అందులో మన మార్కు చూపించడం ముఖ్యమని మంత్రి వివేక్ పేర్కొన్నారు.



## పశ్చిమాసియాలో

# మళ్లీ దాడులు..



- భారత్ ఆందోళన
- ఉద్రిక్తతలను ముగించండి
- భారత్ విదేశాంగశాఖ పిలుపు

**ఢిల్లీ, జూన్ 8 :** ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పర దాడులతో పశ్చిమాసియా మరోసారి భగ్గుమంది. ఈ పరిణామాలపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే ఉద్రిక్తతలను తగ్గించుకుని, శాంతియుత పరిష్కారం కోసం ప్రయత్నించాలని కోరింది. ''పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు నెలకొనడం విచారకరం. ఈ పరిణామాలు అంతర్జాతీయ సమాజానికి అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయి. 100 రోజులకు పైగా కొనసాగుతోన్న ఈ ఘర్షణల కారణంగా ఇప్పటికే భారీ నష్టం వాటిల్లింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన సరఫరాలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఉద్రిక్తతలను తక్షణమే ముగించాలని, పౌరులకు ఎలాంటి హాని కలగకుండా చూడాలని అన్ని పక్షాలను కోరుతున్నాం. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం లభించే దౌత్య పరిష్కారాల కోసం జరుగుతున్న చర్చలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి'' అని భారత విదేశాంగ శాఖ పిలుపునిచ్చింది. మరోవైపు, తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్, ఇజ్రాయెల్ తక్షణమే పరస్పర కాల్పులు ఆపాలని తన ట్రూత్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ ఆదివారం అర్ధరాత్రి నుంచి దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది. ఇరాన్ కీలక మౌలిక సదుపాయాలు, చమురు ప్లాంట్లను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుపుతోంది. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ భీకర పరిస్థితులు నెలకొన్నాయి.

# దేశానికే ఆదర్శంగా 'యూరియా యాప్'

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**హైదరాబాద్,జూన్ 08 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యాప్ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, సమర్థత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. రైతులకు అవసరమైన సమయంలో, అవసరమైన ప్రాంతంలో ఎరువులు అందుబాటులో ఉండేలా సాంకేతికతను వినియోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణలో విజయవంతంగా అమలవుతున్న యాప్ పనితీరును పరిశీలించిన అనంతరం, పొరుగు రాష్ట్రాలు సైతం ఇదే తరహాలో ప్రత్యేక యాప్‌లను రూపొందించే దిశగా చర్యలు చేపడుతున్నాయని మంత్రి తెలిపారు. రైతు సంక్షేమం, ఎరువుల పంపిణీలో పారదర్శకత, స్టాక్ నిర్వహణ వంటి అంశాల్లో తెలంగాణ నమూనా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. ఈ యాప్‌నకు ఇప్పటికే కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రశంసలు లభించాయని తెలిపారు.

**పలుమార్లు లేఖలు :**

ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా యాప్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థను విస్తరించేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సైతం ప్రయత్నాలు చేస్తున్నదని, ఈ వానాకాలం నుండి పలు రాష్ట్రాల్లోని పైలెట్ జిల్లాల్లో కేంద్ర ఎరువుల యాప్ ఎఫ్ఎస్ఏఎస్ (ఫర్టిలైజర్స్ స్కేల్స్ అప్లికేషన్ సిస్టం) అమలుచేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాల వారీగా డీలర్ల స్టాక్ నిర్ధారణకు షెడ్యూలింగ్ వ్యవస్థ, మండల మ్యాపింగ్ సదుపాయం, మీ సేవ కేంద్రాల ద్వారా, టెలిఫోన్ ద్వారా ఎరువుల బుకింగ్ విధానం, రైతుల సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ ప్రాంతంలోని డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను ముందుగానే తెలుసుకునే అవకాశం కల్పించామని మంత్రి వివరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు పలుమార్లు లేఖలు రాశామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా ఇప్పటివరకు 3.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరిందన్నారు. మిగిలిన యూరియా కూడా సకాలంలో రాష్ట్రానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎరువుల సంస్థలతో నిరంతరం సమన్వయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని నియమించామని చెప్పారు. అదేవిధంగా పోర్టులకు చేరిన యూరియా నిల్వలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు త్వరితగతిన తరలించేందుకు ప్రత్యేక అధికారిని నియమించామని తెలిపారు. రైతులకు మేలు జరిగే ప్రతి కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం, అపోహలు సృష్టించడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం ప్రతిపక్షాల వైఖరిగా మారిందన్నారు.

# 'ఏఐసీసీ'ని 'ఆల్ ఇండియా నాజీ పార్టీ'గా మార్చండి

- ఢిల్లీలో రాజ్యాంగ రక్షకుడిగా ఫోజులు?
- తెలంగాణ సీఎం ఫాసిస్ట్ పోకడలపై ..రాహుల్ మౌనం ఎందుకు అని నిలదీత రాహుల్ గాంధీపై కేటీఆర్ ఘాటు విమర్శలు



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనాయకత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ తన సిద్ధాంతాల ముసుగును తొలగించి, అధికారికంగా తన పేరును 'ఆల్ ఇండియా నాజీ పార్టీ'గా మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారమే రేపుతోంది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా కేటీఆర్ నేరుగా లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని టార్గెట్ చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇచ్చే జాతీయ నినాదం 'మొహబ్బత్ కీ దుకాన్' కాస్తా, ఆయన స్వయంగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి క్రూర నియంత వారసత్వాన్ని అక్కున చేర్చుకోవడంతో తెలంగాణలో 'హిట్లర్ కా మకాన్' (హిట్లర్ ఇల్లు)గా మారిపోయిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నైతికతలోని ద్వంద్వ ప్రమాణాలను ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ పాలనా విధానాలకు, స్థానిక కూల్చివేతలకు జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్, ఆయన 'హంతక ముఠా' (అస్సాస్సినేషన్ స్క్వాడ్) స్ఫూర్తి అని బహిరంగంగా పేర్కొనడంతో ఈ రాజకీయ వివాదం చెలరేగింది. అంతేకాకుండా, ఈ స్థానిక కూల్చివేతలను అంతర్జాతీయ యుద్ధ ప్రాంతాల విధ్వంసంతో ఎంతో గర్వంగా పోల్చడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ పరిణామాలపై స్పందించిన కేటీఆర్.. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు వారి ఫాసిస్టు పాలనా ఆలోచనా విధానానికి నిదర్శనమని, ఇది దేశ పునాది విలువలపై జరిగిన క్షమించరాని దాడి అని మండిపడ్డారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ వహిస్తున్న వ్యూహాత్మక మౌనాన్ని వీడాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రిని మందలించకపోతే, ఆ నియంతృత్వ పద్ధతులను అధిష్టానం సమర్థించినట్లే అవుతుందని హెచ్చరించారు. 'డియర్ రాహుల్ గాంధీ జీ.. మీ 'మొహబ్బత్ కీ దుకాన్' అధికారికంగా 'హిట్లర్ కా మకాన్' అయిందా..? తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా క్రూర హిట్లర్‌ను కీర్తిస్తూ, అతని 'హంతక ముఠా'లను పాలనా స్ఫూర్తిగా పేర్కొంటుంటే.. మీరు మౌనంగా ఉంటూ, ఢిల్లీలో రాజ్యాంగానికి తానే స్వయంప్రకటిత రక్షకుడినని ఎలా చెప్పుకుంటారు?' అని కేటీఆర్ తన పోస్ట్లో నిలదీశారు. ఒక ప్రజాస్వామ్య నాయకుడు నిజమైన రాజనీతిజ్ఞుల నుండి స్ఫూర్తి పొందుతాడని, కేవలం అధికారం తలకెక్కిన, పారనాయిడ్ పాలకుడు మాత్రమే క్రూర నియంతల నుంచి పాఠాలు వెతుక్కుంటాడని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేంద్ర కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలను మరింత తీవ్రం చేస్తూ.. నియంతృత్వ పద్ధతులను పండగ చేసుకోవడం, స్థానిక నివాసాలను యుద్ధ ప్రాంతాలలా మార్చడమే ఆ పార్టీ అసలు సిసలైన పాలనా అయితే, వారు సిద్ధాంతాల ముసుగును పూర్తిగా తొలగించుకోవాలని కేటీఆర్ సూచించారు. 'నియంతృత్వ పద్ధతులను సెలబ్రేట్ చేసుకోవడం, స్థానిక కూల్చివేతలను అంతర్జాతీయ యుద్ధ ప్రాంతాల విధ్వంసంతో గర్వంగా పోల్చడమే మీ పార్టీ అసలు పాలనా విధానం అయితే.. ఏఐసీసీ తన సిద్ధాంతాల ముసుగును తీసివేసి 'ఆల్ ఇండియా నాజీ పార్టీ'గా పేరు మార్చుకోవాలి. మీ మౌనం ఈ వ్యాఖ్యలను అంగీకరించినట్లే అవుతుంది. దేశం మొత్తం మిమ్మల్ని గమనిస్తోంది' అని కేటీఆర్ ముగించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఖండిస్తున్న తరుణంలో.. కాంగ్రెస్ హైకమాండ్ నిజంగానే నాజీ పద్ధతులను తమ పాలనా విధానంగా అంగీకరిస్తోందా లేదా అనేదానిపై స్పష్టత ఇవ్వాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తులో ఈ వివాదం ఎటు దారితీస్తుందో చూడాలి? మరి.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమం

- జిల్లా ఎస్పీ తుషార్ డూడి



కుప్పం జూన్ 8 మనం న్యూస్: ప్రజల సౌకర్యార్థం సోమవారం కుప్పం సబ్-డివిజన్ పరిధిలో గల డి.ఎస్పీ కార్యాలయము నందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి,స్వయంగా హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎస్పీకి వివరించగా, ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విని సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, చిత్తూరు పట్టణంలోని జిల్లా సాయుధ దళం కార్యాలయంలో నాన్-కేడర్ ఎస్పీ ఎస్.ఆర్. రాజశేఖర్ రాజు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పబ్లిక్ గ్రీవిన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.ఫిర్యాదులపై స్పందించిన జిల్లా ఎస్పీ , ప్రతి అర్జీని నిర్లక్ష్యం చేయకుండా సమగ్రంగా విచారణ జరిపి, చట్టపరమైన విధానాల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, మరియు బలహీన వర్గాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రాధాన్యంతో పరిగణించాలన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారం కావడం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, న్యాయం చేయడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యలను పోలీస్ స్టేషన్లలో లేదా ఈ పబ్లిక్ గ్రీవిన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమంలో నేరుగా తెలియజేయాలని, ఏ విధమైన సమస్య అయినా చట్టబద్ధంగా పరిష్కారం పొందేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మొత్తం 62 ఫిర్యాదులు అందాయి తెలిపారు.

# రోడ్ల అభివృద్ధితోనే నగరం అభివృద్ధి చెందుతుంది

- రూ.245 లక్షలతో గాంధీ రోడ్డు అభివృద్ధి
- గాంధీ రోడ్డు ను ప్రారంభించిన కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



చిత్తూరు జూన్ 8 మనం న్యూస్ : చిత్తూరు నగరాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని, రోడ్లు అభివృద్ధి చెందితేనే నగరం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. చిత్తూరు నగర పరిధిలో రూ.245 లక్షలతో విస్తరించి, అభివృద్ధి చేసిన గాంధీ రోడ్డును కలెక్టర్, ఎమ్మెల్యే, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కొంగారెడ్డి పల్లి వద్ద రూ.61 లక్షలతో నూతనంగా నిర్మించిన డివైడర్, సెంట్రల్ లైటింగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో చిత్తూరు నగరంలో రోడ్ల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కట్టమంచి - సాంబయ్యకండిగా బైపాస్ రోడ్డును మరో నెలలో పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. దర్గా సర్కిల్ నుండి ఇరువారం వరకు రోడ్డు పనులు పూర్తి చేస్తామని, కట్టమంచి నుంచి ఎమ్మెస్సార్ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ అభివృద్ధి కోసం రూ.37 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. వచ్చే 9 నెలల్లో నగరంలోని ప్రధాన రోడ్లన్నింటిని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారంతోనే చిత్తూరు అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు.ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూఎన్నికల ముగిసిన తర్వాత సామాజిక మాధ్యమాల్లో చిత్తూరు రోడ్ల గురించి ఎక్కువగా సందేశాలు వచ్చాయని, 40-50 ఏళ్లుగా చిత్తూరులో రోడ్ల అభివృద్ధి ముందుకు పోలేదన్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రధాన రోడ్లు అన్నింటిని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకెళ్లాలని చెప్పారు. నగరంలో రోడ్ల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్క భవన యజమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, కలెక్టర్ సహకారంతో నగరంలో రోడ్లు అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. సాంబయ్యకండిగా కట్టమంచి రోడ్డును, దర్గా సర్కిల్ నుంచి ఇరువారం రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయిస్తామన్నారు. కట్టమంచి నుంచి ఎమ్మెస్సార్ వరకు నాలుగు వరుసల రోడ్డు అభివృద్ధి కోసం రూ. 37 కోట్ల మంజూరు అయిందన్నారు. ప్రజలు, స్థానిక నాయకుల సహకారంతో చిత్తూరును అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా నగరంలో రోడ్లను విస్తరించి అభివృద్ధి చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఎన్నిక సమయంలో హామీ ఇచ్చిన విధంగా చిత్తూరును స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో పనిచేసిన నగరపాలక అధికారులను, సహకరించిన ట్రాన్స్కో అధికారులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ పి నరసింహ ప్రసాద్, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, మాజీ మేయర్ ఎస్ అముద, రాజేష్ కుమార్ రెడ్డి, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ నిరసన




చిత్తూరు జూన్ 8 మనం న్యూస్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టిఏ) వరుస వైఫల్యాలు, నీట్ పరీక్ష పేపర్ లీక్, యూజీసీ-నెట్ దరఖాస్తుల నిర్వహణలో జరిగిన అవకతవకలు, సీబీఎస్ఈ పరీక్షల మూల్యాంకనంలో లోపాలు, సీయూఈటీ-యూజీ పరీక్షలను చివరి నిమిషంలో రద్దు చేయడం వంటి ఘటనలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) చిత్తూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు స్థానిక గాంధీ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు భగత్ రవి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దేశంలో ఉన్నత విద్య ప్రవేశాలు, జాతీయ స్థాయి పోటీ పరీక్షల నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్టీఏ పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా నీట్, యూజీసీ-నెట్, సీయూఈటీ వంటి పరీక్షల నిర్వహణలో వరుసగా లోపాలు బయటపడుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సంస్కరణలు చేపట్టకుండా విద్యార్థులను అయోమయానికి గురి చేస్తోందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటన దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగించిందని, అయినప్పటికీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. యూజీసీ-నెట్ దరఖాస్తుల ప్రక్రియలో సాంకేతిక సమస్యలు, పరీక్షల నిర్వహణలో గందరగోళం, సీబీఎస్ఈ మూల్యాంకనంలో వచ్చిన ఫిర్యాదులు, సీయూఈటీ-యూజీ పరీక్షలను చివరి నిమిషంలో రద్దు చేయడం వంటి చర్యలు విద్యార్థుల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపాయని అన్నారు. విద్యను హక్కుగా కాకుండా నిర్లక్ష్యంగా చూస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలంటే ఎన్టీఏ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలని, వైఫల్యాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి అక్బర్,మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు గంగరాజు,జిల్లా కన్వీనర్ మసుధ్ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దుర్గ ప్రసాద్, వివేక్, రూపేష్, సలీమ్, తేజ తదితర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
# పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్



తిరుపతి, జూన్ 8 మనం న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం కొలువుతీరి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై తిరుపతిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు.ఈ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర మంత్రి,యువ నాయకులు నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసు,తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని సమావేశం నిర్వహించనున్నారు,ఈ సమావేశంలో ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి,సంక్షేమ,సూపర్ సిక్స్ అమలు తదితర విషయాలపై మాట్లాడనున్నారు.ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు మంగళవారం తిరుపతి జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పగడ్బందీగా చేపట్టాలనీ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.సోమవారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా స్థానిక దామినేడు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జిల్లా ఎస్ పి ఎల్ .సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ గోవిందరావు, చంద్రగిరి, తిరుపతి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరని శ్రీనివాసులు, టిటిడి బోర్డు మెంబర్,తిరుపతి పార్లమెంటు పార్టీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి,యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్,శాప్ చైర్మన్ రవి నాయుడులతో కలిసి పరిశీలించారు. విధులు కేటాయించిన అధికారులు బాధ్యతగా నిర్వహించాలని, ఎలాంటి లోటు పాట్లు లేకుండా భద్రత ఏర్పాట్లు ఉండాలని తెలిపారు.పర్యటన సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, అత్యవసర సదుపాయాలు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ , ప్రజాప్రతినిధులు, పోలీసు, రెవెన్యూ మరియు ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం సభకు సమగ్ర భద్రతా

- జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి, జూన్ 8 మనం న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి , కేంద్ర మంత్రులు, రాయలసీమ ప్రాంతానికి చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు మరియు ఎమ్మెల్యేలు హాజరుకానున్న భారీ బహిరంగ సభకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ అన్ని రకాల భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీఎల్.సుబ్బరాయుడు,తెలిపారు. సభకు విచ్చేసే వివిఐపీలు, విఐపీలు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఎన్క్లోజర్లు, ప్రత్యేక ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. సుమారు 10 వేల మంది వరకు ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి కూడా ప్రత్యేక పార్కింగ్, సులభ ప్రవేశ ఏర్పాట్లు కల్పించినట్లు పేర్కొన్నారు. సభను తిరుపతి నగర పరిధి వెలుపల నిర్వహించడం వల్ల నగర ప్రజలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టామని తెలిపారు.సభ నిర్వహణ, భద్రతా పర్యవేక్షణ కోసం దాదాపు 800 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.అనంతరం బందోబస్తు పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి బందోబస్తు, భద్రతపై సమీక్షించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకటరావు (పరిపాలన) రవి మనోహర్ ఆచారి (శాంతిభద్రతలు) రామకృష్ణ (తిరుమల) శ్రీనివాసులు (క్రైమ్స్) కులశేఖర్ (రెడ్ శాండిల్) శ్రీలత (మహిళా పోలీస్ స్టేషన్ ) డీఎస్పీలు సిఐలు పాల్గొన్నారు.



# విజయోత్సవ సభ సక్సెస్ కు జన సైనికులు పెద్ద ఎత్తున తరలి రావాలి

తిరుపతి జూన్ 8 మనం న్యూస్: ఎన్నికల హామీల్లో మెజార్టీ హామీల్ని నెరవేర్చిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కి సమ ప్రాధాన్యత సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు ఇస్తున్నారని ఆయన చెప్పారు. తన కార్యాలయంలో మంగళవారం జరిగే రెండేళ్ల విజయోత్సవ సభ సక్సెస్ పై జనసేన ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టే సాయిలు సమావేశం నిర్వహించారు. విజయోత్సవ సభ విజయవంతానికి ప్రతి డివిజన్ నుంచి జన సైనికులను తరలించాలని నాయకులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. సభ సక్సెస్ లో జనసేన కీలకంగా వ్యవహరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు స్వాగతం, వీడ్కోలు ఘనంగా పలికేందుకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున సభా ప్రాంగణానికి తరలి రావాలవని ఆయన కోరారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు తోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ , యువ నాయకులు లోకేష్ తో పాటు రాయలసీమలోని ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులంతా పాల్గొననున్నారని ఆయన తెలిపారు.ఉమ్మడి మ్యానిఫెస్టో లో ప్రకటించిన సూపర్ సిక్స్ ను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానిదనీ ఆయన చెప్పారు. పది లక్షల కోట్ల అప్పు రాష్ట్రంపై వైఎస్సార్



కాంగ్రెస్ పార్టీ మోపి వెళ్లిందని ఆయన విమర్శించారు. ఉపాధి కల్పనలో భాగంగా 16, 346 మందితో మెగా డీఎస్సీ నిర్వహించి పారదర్శకంగా టీచర్ పోస్టులు భర్తీ ప్రభుత్వం చేసిందన్నారు. అలాగే బడి ఈడు పిల్లలందరికీ చదువు నేర్పించాలనే లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంతందికి ఏడాదికి 15వేలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. అలాగే దీపం పథకం 2.0 కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదని ఆయన చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదనీ ఆయన వివరించారు. రైతులకు అన్నదాత సుఖీభవ కింద సంవత్సరానికి 20వేలు అందిస్తున్నదని ఆయన తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి 4,500 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులకు ఆమోదముద్ర వేయించి గిన్నిస్ వరల్ రికార్డ్ సాధించారని ఆయన తెలిపారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులాల నిర్మాణం, ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు పచ్చదనం పెంపుకు పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయం అని ఆయన అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాజధాని లేకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేసిందని ఆయన చెప్పారు. అలాగే రాష్ట్రానికి జీవనాడైన పోలవరాన్ని ప్రభుత్వం పరుగులు పెట్టిస్తున్నదని ఆయన తెలిపారు. రాష్ట్ర పునర్ విభజన చట్టంలో పొందుపరిచిన రైల్వే ప్రత్యేక డివిజన్ ను సాధించిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వంకే దక్కిందన్నారు. అలాగే మంగళవారం జరిగే విజయోత్సవ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో దేశాభివృద్ధికి అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరిస్తామని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో జనసేన క్లస్టర్ ఇన్చార్జులు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



సూలూరుపేట జూన్ 8 మనం న్యూస్: యోగా ద్వారా శారీరక దారుఢ్యం,మానసిక ప్రశాంతత,ఏకాగ్రతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)ను పురస్కరించుకుని నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా సోమవారం నాయుడుపేట మండలంలోని పుదురు బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులు, నాయకులుయోగా సాధకులు,సామూహికంగా యోగాసనాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో ఏర్పడుతున్న అనారోగ్య సమస్యలను అధిగమించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. శరీరం,మనస్సు,ఆత్మ మధ్య సమతుల్యతను పెంపొందించే గొప్ప సాధనం యోగా అని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.యోగా ద్వారా శారీరక సామర్థ్యం పెరగడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గి జీవన నాణ్యత మెరుగుపడుతుందని వివరించారు.అనంతరం స్వచ్ఛభారత్ స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా గురుకుల పాఠశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేసి,మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ,జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,నిత్యా కృష్ణారెడ్డి,అవధానం సుధీర్,పలుకూరు ముత్యాలయ్య, వినుకొండ ధనుంజయ,ఇమిడి సెట్టి వెంకటేశ్వర్లు,వెంకటేశ్వర్లు రెడ్డి,అరిగొండ జయరామ్,శేషం ముని గోపి,మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా,గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్,పలువురు ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

# న్యూ మారుతి నగర్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



తిరుపతి జూన్ 8 మనం న్యూస్: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి ఎం.ఆర్. పల్లి అర్బన్ పిహెచ్సీ పరిధిలోని న్యూ మారుతి నగర్ లో పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై డాక్టర్లు చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు.స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ ప్రొఫెసర్,పింక్ బస్ ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ అంజు డి ఆదె మార్గదర్శకత్వంలో నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భవాని, డాక్టర్ శివసంతోష్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ధనుంజయ నాయుడు, బాలసుబ్రహ్మణ్యం, అనిల్ రాయల్, ఉదయ్, లక్ష్మణరావు, చంద్రశేఖర్ నాయుడు, భీమవరం ప్రసాద్, దుర్గామల్లేష్, మంజునాథ్ రెడ్డి, కేశవులు నాయుడు, మురళి, ఎం.ఆర్.పల్లి అర్బన్ పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశులు,పింక్ బస్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, డాక్టర్ లావణ్య, ఏఎన్ఎంలు యాస్మిన్, సరిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మామిడి రైతుల సమస్యలపై ప్రత్యేక చర్యలుచేపడుతున్నాం



- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు జూన్8 మనం న్యూస్: క్రిష్ణగిరి నందు మామిడి పంటకు ఎలాంటి ధర అందజేస్తున్నారు ఉద్యానవన, మార్కెటింగ్ టీం బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించాలి అనిజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు, సోమవారం స్థానిక కలెక్టరేట్లోనే సమావేశ మందిరంలో ఉద్యానవన శాఖ అధికారులతో మార్కెటింగ్ శాఖ అధికారులతో తోతాపురి మామిడికి గిట్టు బాటు ధర అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన వినతులు, సంఘాల డిమాండ్లు, ప్రజాప్రతినిధుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని సాధ్యమైన పరిష్కార మార్గాలను అన్వేషించాలని అధికారులను ఆదేశించారు జిల్లాలో 31 జ్యూస్ ఫ్యాక్టరీలో ఉండగా అందులో 28 ఫ్యాక్టరీలు పని చేస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఉన్న గుజ్జు పరిశ్రమల్లో కేవలం 14 ఫ్యాక్టరీలు మాత్రమే తోతాపురి మామిడి కొనుగోళ్లు చేపడుతున్నాయి. మిగిలిన పరిశ్రమలు కొనుగోళ్లకు ముందుకు వచ్చే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి గుజ్జు పరిశ్రమ వద్ద రైతులకు కిలోకు రూ. ధర పట్టిక ప్రదర్శించాలని ఆదేశించారు, ప్రతిరోజు ఎంత ధర రైతులకు చెల్లిస్తున్నారు నివేదికల రూపంలో నాకు అందజేయాలని ఆదేశించారు.

# తోపుడుబండ్ల వ్యాపారస్తుల సమస్యలు పరిష్కరించాలి

- చిరు వ్యాపారుల ఉపాధిపై దాడులు ఆపాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు



తిరుపతి జూన్ 8 మనం న్యూస్: తిరుపతి నగరంలోని స్విమ్స్ సర్కిల్ వద్ద ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతంలో దాదాపు రెండు దశాబ్దాలుగా తోపుడుబండ్లపై టిఫిన్లు, భోజనాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారస్తులను తొలగించే ప్రయత్నాలను నిరసిస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలు నిర్వహిస్తోందని అన్నారు. అయితే పేదలు, కార్మికులు, చిరు వ్యాపారులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం ఏ విజయాన్ని సాధించిందో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు.ప్రభుత్వాలు ఉపాధిఅవకాశాలు కల్పించకపోయినా, ఉద్యోగాలు ఇవ్వకపోయినా పేదలు అప్పులు చేసి, ఫైనాన్ల ద్వారా డబ్బులు సమకూర్చుకుని తోపుడుబండ్లు కొనుగోలు చేసి స్వయం ఉపాధితో జీవిస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై అధికార యంత్రాంగం ప్రతాపం చూపడం తగదన్నారు. ముందుగా చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించి, వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ఇటీవల అలిపిరి జూ పార్కు రోడ్డులో చిరు వ్యాపారుల బండ్లను జేసీబీలు, ట్రాక్టర్లతో ధ్వంసం చేయడం, వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేయడం తీవ్రంగా ఖండనీయమన్నారు. వారికి అండగా నిలిచిన సిఐటియు నాయకులపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఆ ఘటన జరిగిన కొద్ది రోజులకే స్విమ్స్ సర్కిల్ ప్రాంతంలోని వ్యాపారులను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎమ్మెల్యే, కూటమి నాయకులు స్పందించాలి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చిరు వ్యాపారుల సమస్యలపై స్పందించకపోవడం విచారకరమన్నారు. ప్రజల సమస్యలపై స్పందించాల్సిన ప్రజాప్రతినిధులు మౌనం వహించడం సరైన విధానం కాదన్నారు. అలాగే ఈ వివాదం తిరుపతి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మన్నూరు సుగుణమ్మ నివాసానికి ఎదురుగానే జరుగుతున్నప్పటికీ ఆమె స్పందించకపోవడం బాధాకరమన్నారు. చిరు వ్యాపారస్తుల పక్షాన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం, వారికి అండగా నిలవకపోవడం సమర్థనీయం కాదన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య కల్పించాలి



**పాఠశాలలు, వసతి గృహాల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**


**విద్యార్థులకు సురక్షిత, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి**

**అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలి**

**రాష్ట్ర మంత్రి సీతక్క**

**ములుగు, జూన్ 8,మనం ప్రతినిధిః** పాఠశాలలు, వసతి గృహాల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, విద్యార్థులకు సురక్షిత, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావుతో కలిసి పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాలు, వసతి గృహాల పునఃప్రారంభంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి హైదరాబాద్ నుంచి టెలిఫోన్ ద్వారా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఫోన్ ద్వారా మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి పాఠశాల, వసతి గృహంలో అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని విద్యాసంస్థల భవనాలు, తరగతి గదులు, వసతి గృహ గదులు, వంటశాలలు, భోజనశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకులను పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారణ కోసం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అధికారులు వసతి గృహాలు, పాఠశాలలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సామాజిక సేవ, సంస్కృతి, సంప్రదాయాలు, మంచి అలవాట్లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. 'నమస్కారం - మన సంస్కారం' అనే భావనను విద్యార్థుల్లో పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శ్రమదానం, విజ్ఞాన విహారయాత్రలు నిర్వహించాలని, జిల్లాలోని ప్రముఖ పర్యాటక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాల ప్రాముఖ్యత, స్థల పురాణాలను విద్యార్థులకు తెలియజేసే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆదివాసీ, గిరిజన విద్యార్థుల భాష, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ విద్యా కార్యక్రమాలు నిర్వహించాలని, వారి స్థానిక సంస్కృతిని పరిరక్షించే బాధ్యత బోధన, బోధనేతర సిబ్బందిపై ఉందని మంత్రి పేర్కొన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, బియ్యం, కూరగాయలు, గుడ్లు, ఇతర సరుకుల నిల్వలను పరిశీలించాలని ఆదేశించారు. వంటశాలల్లో పరిశుభ్రత పాటిస్తూ ఆహార భద్రత ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడానికి కృషి చేసిన జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రతి పాఠశాల, వసతి గృహాన్ని అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పునఃప్రారంభానికి పాఠశాలలు, వసతి గృహాలను అన్ని వసతులతో సిద్ధం చేయాలని, ఆర్ఓ ప్లాంట్ల పనితీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి సరఫరా తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పాఠశాలల్లో వైద్య శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల పరిసరాల్లో పొదలు, చెత్త, మురుగు నిల్వలు తొలగించాలని, మరుగుదొడ్లు వినియోగానికి అనుకూలంగా ఉండేలా మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు. బాలికల వసతి గృహాలు, పాఠశాలల్లో ప్రత్యేక పరిశుభ్రత, భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా నిరంతరాయంగా ఉండాలని, నీటి నాణ్యతను పరీక్షించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, లైట్లు, స్విచ్ బోర్డులు, విద్యుత్ వైరింగ్ను పరిశీలించి లోపాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా భవనాల భద్రతను కూడా తనిఖీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీవో కృష్ణవేణి, , వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**హనుమకొండ, జూన్ 8 (మనం న్యూస్)ః** హనుమకొండ జిల్లా హంటర్ రోడ్ అలకనంద కన్వర్షన్ ఏసి హాల్ లో అంగరంగ వైభవంగా నామకరణ మహోత్సవము మరియు ఉయ్యాలలో వేయడం కార్యక్రమం బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కవిత వీ ఎన్ నాయక్, కూతురు అల్లుడు కుమార్తె నామకరణ ఉయ్యాలలో వేయడం కార్యక్రమం వి ఎన్ నాయక్ ఆధ్వర్యంలో మరియు కృష్ణకుమారి బావసింగ్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, డాక్టర్ రూప్ సింగ్ నాయక్, డి.ఎస్.పి పెద్దన కుమార్, అజ్మీర శ్రీరామ్ నాయక్, డాక్టర్ బోజ నాయక్, మాజీ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్, మాజీ కార్పొరేటర్ సిరంగి సునీల్, జోహార్ లాల్ నాయక్, మాజీ జెడ్పిటిసి వీరమ్మ గోపి సింగ్ నాయక్, మాజీ జెడ్పిటిసి సత్తమ్మ బిక్షపతి నాయక్, పోరిక అమృనాయక్ సర్పంచ్, బిక్షపతి నాయక్, జాటోత్ కిషన్ నాయక్, ఏ ఆర్ నాయక్, డాక్టర్ చందు నాయక్, అర్పిత నాయక్, వీరన్న నాయక్, లక్ష్మణ్ నాయక్, రామన్న నాయక్, వసంత నాయక్, రాజన్న, లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ యూనియన్ ప్రెసిడెంట్ అధ్యక్షులు బాదావత్ బాలాజీ నాయక్, జవహర్ లాల్, పోరిక రమేష్ నాయక్, భూక్య శ్రవణ్ కుమార్, మూడు రమేష్, కిషోర్, గంగు నాయక్, గోవర్ధన్ నాయక్, రవీందర్ నాయక్, దేవేందర్ నాయక్, కిషన్ నాయక్, విజయ్ కుమార్, గులాబ్ సింగ్, రవినాథ్, సునీల్, శంకర్, ప్రవీణ్ కుమార్, బిజెపి రాజు నాయక్, రాజు, అనిల్, మోహన్ నాయక్, వెంకన్న నాయక్, బిక్షపతి, మున్సిపాలిటీ రాజు నాయక్, డి ఎస్ వెంకన్న నాయక్, దేశి రామ్ నాయక్, వీరయ్య, బాలు నాయక్, సరూప్ నాయక్, వెంకట్, మురళి నాయక్, భాస్కర్ నాయక్, జోహార్ లాల్, రామచంద్రనాయక్, రాజన్న, సుమన్, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు ముఖ్య నాయకులు మొదలైన వారు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు**




**ములుగు, జూన్ 8 మనం ప్రతినిధిః** పోలియో నిర్మూలన,చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న పల్స్ పోలియో, స్టాప్ డయేరియా క్యాంపెయిన్, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పల్స్ పోలియో, స్టాప్ డయేరియా క్యాంపెయిన్, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలపై జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు. వలస కార్మికులు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనుల ప్రాంతాలు వంటి అధిక ప్రమాద ప్రాంతాలను గుర్తించి అక్కడి పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. వర్షాకాలంలో ప్రబలే డయేరియా వ్యాధి నివారణకు గ్రామీణ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.జూలై నెలలో నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, పురపాలక శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 22,572 మంది 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి 312 పోలియో బూత్లు, మొబైల్ బృందాలు, ట్రాన్సిట్ పాయింట్లు, అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్ని శాఖల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మాట్లాడుతూ జూన్ 15 నుంచి జూలై 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి 0-5 సంవత్సరాల పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను పంపిణీ చేస్తారని చెప్పారు. డయేరియా నివారణపై గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూలై 13, 20 తేదీల్లో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ మాత్రలు అందజేయడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి సంపత్, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబర్దార్

- **మైనింగ్ వ్యాపారం మంత్రి బంధువులపై అంటగట్టడం సరికాదు**
- **భూదాన సమస్య కాంగ్రెస్‌కు సంబంధం లేదు**
- **సీనియర్ కాంగ్రెస్ నాయకులు**



**భీమదేవరపల్లి, జూన్ 8 మనం న్యూస్ః** మంత్రి పొన్నం పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబర్దార్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంయుక్తంగా హెచ్చరించారు. వారం రోజున మాజీ ఎంపీపీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోజ్జపూర్ అశోకముఖర్జీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కేతిరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రంగయ్య పల్లి గ్రామానికి చెందిన లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి మండల తాసిల్దార్ కార్యాలయంలో అధికారులతో మంత్రి పొన్నంపై, బంధువులపై నిరాధార ఆరోపణలు చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు చిదురాల స్వరూప తిరుపతి రెడ్డి నివాసానికి వెళ్లి మంత్రిపై మంత్రి బంధువులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిలదీసి అడగగా, తిరుపతి రెడ్డి మరోసారి మంత్రిపై మంత్రి బంధువులపై మైనింగ్ వ్యాపారం అంటగట్టి, మండల కాంగ్రెస్ నాయకుల పై అనుచిత వ్యాఖ్యలు పునరావృతం చేయడంతో ఖండిస్తున్నామని ఖబర్దార్ అనిహెచ్చరించారు. బతుకమ్మ బండ కోసం రంగయ్య పల్లి లో భూదానం చేసిన తిరుపతిరెడ్డి గ్రామంలో వివాదాస్పదంగా మారడంతో భూ సమస్య కాంగ్రెస్ పార్టీకి ఏ విధమైన సంబంధంలేదని, మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఏవిధమైన సంబంధం లేదని స్పష్టం చేసి, మైనింగ్ వ్యాపారం సంబంధిత శాఖలకు, తాసిల్దార్ కార్యాలయానికి సంబంధించిన విషయమని మంత్రి బంధువులకు ఏ విధమైన సంబంధం లేదని పేర్కొంటూ మంత్రిపై మంత్రి బంధువులపై ఏ విధమైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబర్దార్ అని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలుగూరి రాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఎల్కతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి, పిడిశెట్టి కనకయ్య, మంగ రామచంద్రం,సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు చిదురాల స్వరూప, ఊస కోయిల ప్రకాష్, ఆదరి రవీందర్, ఎర్రబెల్లి సర్పంచ్ కాలేరు శ్రావణ్, దస్తరి కిషోర్, మాచర్ల సదానందం, గుడి కందుల రాజు, అన్నపూర్ణ, బాలకృష్ణ, మాడుగుల కొమురయ్య, కొడకండ్ల సుదర్శన్ రెడ్డి, కస్తూరి శీను, చిటుకూరిఅనిల్, తదితరులు పాల్గొన్నారు

## ఇండ్లను కూల్చి వేసిన జిల్లా యంత్రాంగం

- **పేదల ప్రజల ఆందోళన**

**హనుమకొండ, జూన్ 8 (మనం న్యూస్)ః** హనుమకొండ జిల్లా గోపాల్పూర్ లో నివాసం ఉంటున్న పేద ప్రజల ఇండ్లను గుడిసెలను కులిచివేత చేసిన హనుమకొండ జిల్లా యంత్రాంగం కావున ఈరోజు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది ఇండ్లను పులిచివేసిన సందర్భంగా దీనికి నిరసనగా నడవకుండా జిల్లా కలెక్టర్ ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యులు ఇతర సభ్యులు అందరూ కలిసి నిరసన కార్యక్రమం చేయడం జరిగింది అలాగే డబుల్ బెడ్ రూమ్ లేదా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కలెక్టర్ గారికి వినతి పత్రం అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల నాయకత్వం నిర్వహిస్తున్న రమేష్ సబిత సమ్మయ్య మమత శృతి పావని యాకమ్మ మొదలైన సిపిఎం నాయకులు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.




## దైవ సేవ కోసం జీవితాన్ని త్యాగం చేసిన అబ్రహం పాస్టర్



**మహాదేవపూర్ జూన్ 08మనం న్యూస్ః** మహాదేవపూర్ మండలకేంద్రంలోని బేతస్థ ప్రార్థన మందిరంలో సోమవారం అబ్రహం పాస్టర్ జ్ఞాపకార్థ కూడికార్యక్రమంలో పాల్గొన్నపలువురు పాస్టర్లుఅబ్రహంపాస్టర్లనజీవితాంతం జీసస్ సేవలో తరించారని తన చివరి శ్వాస వరకుదేవునిసేవలో నేగడిపారనిపేర్కొన్నారు. మునగాలఅబ్రహంపాస్టర్ 21:04:1933లోకరీంనగర్ జిల్లా హుజరాబాద్ మండలం జూపాకగ్రామంలోజన్మించారని, సింగరేణిలోఉద్యోగరీత్యాగోదావరిఖని ప్రాంతంలోస్థిరపడ్డారని ,సింగరేణిలో ఫోర్ మెన్ ఉద్యోగం చేస్తూ పరిచర్య చేస్తుండేవాడు.ఏసుక్రీస్తు పరిచర్యకు సింగరేణి ఉద్యోగం ఆటంకంగా ఉందని ఫోర్ మెన్ ఉద్యోగాన్నితృణప్రాయంగా వదిలివేసి,ఏసుక్రీస్తుపిలుపుమేకు 1995సంవత్సరంలోమహాదేవ్పూర్ ప్రాంతంలో అడుగుపెట్టి ఈ ప్రాంతంలో తన పరిచర్యను ప్రారంభించి, ఎంతోమందిని దేవుని సన్నిధికి నడిపించాడని ఎంతో కష్టపడి, ఎన్నో దాడులను ఎదుర్కొని ఈప్రాంతంలోఎందరినో సన్మార్గంలోనడిపించాడు.నాసేవఇక్కడే,నాచావుఇక్కడేఅ నిదృఢసంకల్పంతో ఈ ప్రాంతంలో మార్పు కోసం తన చివరి శ్వాస వరకు దైవ సేవచేశారనిపలువురు పాస్టర్లు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్ గ్రామపంచాయతీ పాలకవర్గం,పాస్టర్లు జాన్, అశోక్, ప్రసాద్,చందు,దయాకర్, జ్యోతి బాబు, మోజెస్, హదాస్స, కుటుంబ సభ్యులు మరియు సంఘ పెద్దలు, సంఘ విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## మద్దులపల్లిలో గ్రామ సభ



**మహాదేవపూర్ జూన్ 08మనం న్యూస్ః** మహాదేవపూర్ మండలంమద్దులపల్లి గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ సరిత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగాగ్రామంలో నిలుసమస్యలను గుర్తించిదశల వారీగాపరిష్కరిస్తామని తెలిపారు. రాబోయే వర్షాకాలాన్నిదృష్టిలోఉంచుకునిపారిశుద్ధ్యపనులుచే ఎట్టాలని, వీధి విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, ప్రజలకు నిరంతరమంచినీటిసరఫరాఅందించాలనిసూచించ ారు.అలాగేసీజనల్వ్యాధులపట్లఅప్రమత్తంగాఉండి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు అవగాహనకల్పించారు.ఈ కార్యక్రమంలోఎంపిడిఓ రవీంద్రనాథ్, డిప్యూటీ తాసిల్దార్ యూసుఫ్, తాసిల్దార్ సత్యనారాయణ స్వామిద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ ఆర్డబ్ల్యూఎస్ నరేష్, అంగన్వాడి సూపర్వైజర్ స్పందన, గ్రామ కార్యదర్శి స్వాతి, వార్డు సభ్యులు తేజస్విని,శ్రీజ, మనక్క,దేవిక,శ్రావణి, ఆర్ ఐ రఘు, జిపిఓ రఘు,లైన్ఇన్స్పెక్టర్ సదానందం,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుసదయ్య,అంగన్వాడి టీచర్లు శ్రీకళ, సుచరిత, ఆశ వర్కర్ స్వరూప, ఫీల్ అసిస్టెంట్ వెంకటేష్ తోపాటుగ్రామ ప్రజలు పెద్దలు మరియు యువకులు తదితరులు పాల్గొన్నారు.


## నీట్-2026 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయ్**



**హనుమకొండ, జూన్ 08(మనం ప్రతినిధి)ః** ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్-2026 ప్రవేశ పరీక్షలను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన 12 పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నిర్వహణ, వైద్య సేవలు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన పరీక్ష అని, అందువల్ల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా, తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, తగిన బెంచీలు, ఫ్యాన్లు, లైటింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గదర్శకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స సదుపాయాలు, అవసరమైన వైద్య సిబ్బంది, అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పరీక్ష నిర్వహణలో పాల్గొనే కేంద్ర నిర్వాహకులు, ఇన్విజిలేటర్లకు మార్గదర్శకాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, పరీక్ష గోప్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రపరిచే ప్రక్రియలో నిర్దేశిత నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నీట్ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీట్ పరీక్ష జిల్లా కోఆర్డినేటర్, నోడల్ అధికారి బిక్షపతి, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి గౌరీశంకర్, ఈడీఎం శ్రీధర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దామెర చెరువులో ఉపాధి హామీ పనులకు శ్రీకారం



**మహాదేవపూర్ జూన్ 08మనం న్యూస్ః** మహాదేవపూర్ గ్రామపంచాయతీ పరిధి లోని దామెర చెరువులో ఉపాధి హామీ పథకం పనులను గ్రామ సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్ మరియుపాలకవర్గంప్రారంభించారుఈసందర్భంగా పనుల స్థలాన్ని సందర్శించిన సర్పంచ్ గ్రామస్థులతో మాట్లాడి ఉపాధి హామీ పథకం ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారుచెరువు అభివృద్ధి పూడిక తొలగింపు మరియు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేలక్ష్యంతోచేపడుతున్నఈపనులుగ్రామ రెతులకుకూలీలకుప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. పనులునాణ్యతతో,పారదర్శకంగా జరిగేలా అధికారులు మరియు సిబ్బందికి సూచనలు చేశారు గ్రామాభివృద్ధి, రైతుల సంక్షేమం మరియు ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూసర్పంచ్హసీనాబానోచేపడుతున్న గ్రామస్తులు అభినందించారుఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు నల్లబుగ్గ సమ్మయ్య బల్ల పద్మ మహమ్మద్బిన్అలీకొండపల్లిరాములుగ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పనులు ప్రారంభానికి హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం అందించాలి

- **జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు, జూన్ 8, మనం ప్రతినిధిః** ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 64 దరఖాస్తులు రాగా, వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 20, పెన్షన్లకు 17, ఇతర శాఖలకు సంబంధించినవి 27 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావు, డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీఓ కృష్ణవేణి, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వాణిలో పిర్యాదులను స్వీకరించిన సీపీ

**హనుమకొండ జూన్ 08( మనం ప్రతినిధి)ః** పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం శాంతి భద్రతలకు సంబందించి ప్రజలు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను కలుసుకొని ఫిర్యాదులను అందజేశారు. ఫిర్యాదులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సంబదించిన పోలీస్ అధికారులకు ఫోన్ చేసి క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా విచారణ జరిపి భాదితులకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ అదేశించారు. అదే విధంగా పోలీస్ సిబ్బంది సైతం శాఖ పరమైన సమస్యలపై సీపీ కలుసుకొని వివరించడం తో పాటు వినతి పత్రాన్ని అందజేశారు.

# సీఎం విజయ్కు చెక్ పెట్టిన ప్రజ్ఞానంద




ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. విన్సెంట్ కీమర్ (జర్మనీ)పై గెలుపొంది నార్వే చెస్ టోర్నీ టైటిల్ విజేతగా నిలిచిన తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద రికార్డు సృష్టించాడు. ఈ నేపథ్యంలో సోమవారం తమిళనాడు సెక్రటేరియట్లో ముఖ్యమంత్రి సీఎం విజయ్ని ప్రజ్ఞానంద తన తల్లిదండ్రులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా విజయ్ కాసేపు ప్రజ్ఞానందతో సరదాగా చెస్ ఆడాడు. కొద్దిసేపే జరిగిన ఈ గేమ్లో కొన్ని ఎత్తుల్లోనే సీఎం విజయ్కు ప్రజ్ఞానంద చెక్ పెట్టాడు. నార్వే చెస్ టోర్నీలో అద్భుతమైన విజయం సాధించి విజేతగా నిలిచినందుకు ప్రజ్ఞానందను సీఎం విజయ్ అభినందించారు.

అతడి ప్రదర్శనతో తమిళనాడు గర్విస్తోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వం తరఫున రూ.50 లక్షల చెక్కును రివార్డుగా అందజేశారు.

# ముల్లన్‌పూర్‌లో భారత్ మ్యాజిక్ షో

## భారత్ చారిత్రాత్మక విజయం




న్యూ చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్ వేదికగా జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్లో భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. కొత్త టెస్టు వేదికైన మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా, మొదటి ఇన్నింగ్స్‌లో8 వికెట్ల నష్టానికి 564 పరుగుల భారీ స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (126), వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ (100) అద్భుత శతకాలతో రాణించగా, సాయి సుదర్శన్ (81), రిషబ్ పంత్ (81), వాషింగ్టన్ సుందర్ (52) అర్ధ శతకాలతో భారత్కు కొండంత స్కోరును అందించారు.

### కుప్పకూలిన ఆఫ్ఘన్ బ్యాటింగ్ లైనప్..

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్తాన్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. మొదటి ఇన్నింగ్స్లో కేవలం 152 పరుగులకే ఆలౌట్ అయి ఫాలోఆన్ లో పడింది. భారత్ తరఫున అరంగేట్రం చేసిన స్పిన్నర్ మానవ్ సుతార్ మొదటి ఇన్నింగ్స్లో 33 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి అద్భుతమైన ప్రదర్శన చేశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆఫ్ఘనిస్తాన్ను భారత స్పిన్ ద్వయం వాషింగ్టన్ సుందర్ (4 వికెట్లు), కుల్దీప్ యాదవ్ (3 వికెట్లు) చేరి కోలుకోలేని దెబ్బ కొట్టారు. దీనితో ఆఫ్ఘనిస్తాన్ రెండో ఇన్నింగ్స్లో 112 పరుగులకే కుప్పకూలింది.

### రికార్డుల వేటలో భారత్

ఈ విజయంతో భారత జట్టు టెస్టు క్రికెట్ చరిత్రలో పరుగుల పరంగా తన అత్యంత భారీ ఇన్నింగ్స్ విజయాన్ని (ఇన్నింగ్స్ 300 పరుగులు) నమోదు చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. గతంలో 2018లో రాజ్కోట్లో వెస్టిండీస్‌పై సాధించిన ఇన్నింగ్స్ 272 పరుగుల రికార్డును ఈ మ్యాచ్ ద్వారా టీమిండియా అధిగమించింది.

# అప్పుడు ధోని... ఇప్పుడు హర్మీత్



ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభానికి ముందు భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తన సమాధానంతో వార్తల్లో నిలిచారు. టోర్నీకి ముందు లండన్లో నిర్వహించిన కెప్టెన్ల మీడియా సమావేశంలో ఓ రిపోర్టర్ అడిగిన రిటైర్మెంట్ ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్గా మారింది. 37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ కౌర్ తన కెరీర్లో 10వ టీ20 ప్రపంచకప్ ఆడేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇదే ఆమె చివరి ప్రపంచకప్ అవుతుందా అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మీడియా సమావేశంలో ఒక జర్నలిస్ట్ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ ప్రపంచకప్ మీ చివరిదా? అని ప్రశ్నించాడు. దానికి హర్మన్‌ప్రీత్ వెంటనే, ఎందుకు..? నేను ఆగిపోవాలని మీరు అనుకుంటున్నారా? అంటూ ఎదురు ప్రశ్నించారు. రిపోర్టర్ లేదు అని సమాధానం ఇవ్వగానే, అయితే ఈ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు? అంటూ చిరునవ్వుతో బదులిచ్చారు. ఆమె సమాధానంతో అక్కడున్న వారంతా నవ్వుల్లో మునిగిపోయారు.

ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు హర్మన్‌ప్రీత్ సమయస్ఫూర్తిని మెచ్చుకుంటున్నారు. చాలా మంది ఆమె సమాధానాన్ని భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఇచ్చిన ఓ సమాధానంతో పోలుస్తున్నారు. కొన్నేళ్ల క్రితం ధోనీని కూడా ఒక జర్నలిస్ట్ రిటైర్మెంట్ గురించి ప్రశ్నించగా.. ఆయన ఆ రిపోర్టర్ను తన పక్కన కూర్చోబెట్టి తన ఫిట్నెస్, పరుగెత్తే సామర్థ్యం, వయస్సు వంటి అంశాలపై ప్రశ్నలు అడిగి చివరకు సమాధానం చెప్పకుండానే ప్రశ్నకు సమాధానం ఇచ్చినట్లుగా వ్యవహరించారు. దానితో ఆ ప్రెస్ కాన్ఫరెన్స్ బాగా వైరల్ అయ్యింది.

ఇప్పుడు హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా అదే తరహాలో రిపోర్టర్కు ఎదురుప్రశ్న వేసి రిటైర్మెంట్ చర్చలకు చెక్ పెట్టారు. ఆమె సమాధానం అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా భారత మహిళల జట్టు నాయకత్వంపై మరోసారి చర్చకు దారితీసింది. ఇటీవల స్వదేశంలో జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్ను తొలిసారి గెలిచిన భారత జట్టు, ఇప్పుడు టీ20 ప్రపంచకప్పై దృష్టి సారించింది. ఇప్పటివరకు మహిళల టీ20 ప్రపంచకప్ టైటిల్ను అందుకోలేకపోయిన టీమిండియా, ఈసారి ఆ కలను నిజం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. హర్మన్‌ప్రీత్ నాయకత్వంలో భారత జట్టు చరిత్ర సృష్టిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

# సూర్యకుమార్ ముంబయి ఇండియన్స్కు గుడ్ బై చెబుతాడా?



టీమ్ఇండియా ఆటగాడు సూర్యకుమార్ యాదవ్కు ప్రస్తుతం కష్టకాలం నడుస్తోంది. కొంతకాలంగా పేలవఫామ్తో సతమతమవుతున్న అతడిని భారత టీ20 కెప్టెన్గా తొలగించడమే కాకుండా జట్టులోకి కూడా తీసుకోలేదు. యువ ఆటగాళ్ల నుంచి పోటీ ఎక్కువకావడంతో అతను తిరిగి జట్టులో చోటు దక్కించుకోవాలంటే చాలా కష్టపడాలి. ఈ క్రమంలో అతని గురించి మరో వార్త బయటికొచ్చింది. సూర్యకుమార్ యాదవ్ ఐపీఎల్లో ముంబయి ఇండియన్స్కు గుడ్ బై చెప్పే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

చాలాకాలంగా ఆ జట్టుకు కీలక ఆటగాడిగా ఉన్న సూర్య.. గత సీజన్లో తీవ్రంగా నిరాశపర్చాడు. అతను 270 పరుగులు మాత్రమే చేశాడు. పైగా ముంబయి ఇండియన్స్ కూడా కొన్నాళ్లుగా తమస్థాయికి తగ్గ ప్రదర్శన చేయట్లేదు. దీంతో వచ్చే ఏడాది ఆ ఫ్రాంఛైజీ జట్టులో భారీ మార్పులు చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో సూర్యకుమార్ ముంబయి ఇండియన్స్కు గుడ్ బై చెబుతాడనే ప్రచారం మొదలైంది. అతను ఇన్స్టాగ్రామ్లో ముంబయిని ఫాలో కాకపోవడం ఇందుకు మరింత బలం చేకూరుస్తోంది. సూర్య తన ఇన్స్టా ఖాతాలో ఆ ఫ్రాంఛైజీకి సంబంధించిన 100కి పైగా పోస్టులను డిలీట్ చేశాడు. అతని ప్రొఫైల్లో ఇటీవల ముంబయి ఇండియన్స్కు సంబంధించిన ఒక్క ఫొటో మాత్రమే ఉంది. రోహిత్ శర్మ, ధోనీతో కలిసి దిగిన చిత్రమది.

దీంతో సూర్య ముంబయికి గుడ్ బై చెబుతాడన్న ప్రచారం ఊపందుకుంది. హార్దిక్ పాండ్యను కూడా సూర్య ఫాలో కాకపోవడం గమనార్హం. మరోవైపు,హార్దిక్ను ముంబయి వదులుకుంటుందనే ప్రచారం చాలా రోజులుగా జరుగుతున్న విషయం తెలిసిందే.

# పూరి మార్క్ మేకింగ్.. సేతుపతి పీక్ పెర్ఫార్మెన్స్..!





డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కలయికలో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'స్లమ్ డాగ్ - 33 టెంపుల్ రోడ్' టీజర్ తాజాగా విడుదలైంది. పూరి జగన్నాథ్ మార్క్ మేకింగ్తో పాటు ఇందులో మునుపెన్నడూ చూడని రీతిలో భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయని టీజర్ హింట్ ఇస్తోంది.

ఈ చిత్రంలో విజయ్ సేతుపతి ఒక అంధుడైన భిక్షగాడు పాత్రలో కనిపిస్తున్నాడు. తమ జీవితాలను నాశనం చేయాలని చూసే విలన్లపై ఆయన తిరగబడే కథాంశంతో సినిమా రూపొందింది. వేరే దారి లేక, ప్రాణాలను కాపాడుకోవడానికి హీరో తుపాకులు పట్టి శత్రువులను ఊచకోత కోసే సీన్స్ టీజర్లో హైలైట్గా నిలిచాయి. పాటలు, యాక్షన్ కట్స్ను మిక్స్ చేస్తూ పూరి ఈ టీజర్ను చాలా విభిన్నంగా డిజైన్ చేశాడు.

పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్, జెబి నారాయణరావు కొండ్రోళ్ల సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో టబు, సంయుక్త, దునియా విజయ్, బ్రహ్మాజీ, వీటీవి గణేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ యాక్షన్ డ్రామాకు సంగీతం అందిస్తున్నాడు.

# క్రష్.. లక్కీఛాన్స్



భారతీయ సంగీత ప్రపంచంలో 'భారతరత్న' ఎం.ఎస్. సుబ్బులక్ష్మి స్థానం అజరామరం. ఆమె జీవిత కథ ఆధారంగా రాబోతున్న ప్రతిష్ఠాత్మక బయోపిక్ గురించి ఎప్పటికప్పుడు ఆసక్తికరమైన వార్తలు వస్తూనే ఉన్నాయి. మొదట ఈ పాత్ర కోసం నేచురల్ బ్యూటీ సాయి పల్లవి పేరు గట్టిగా వినిపించినా, ఇప్పుడు సీన్ పూర్తిగా మారిపోయింది. మన 'నేషనల్ క్రష్' రష్మిక మందన్న ఈ గోల్డెన్ ఛాన్స్‌ను దక్కించుకుందనే వార్త టాలీవుడ్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

### సాయి పల్లవి టు రష్మిక...

సంగీత దిగ్గజం ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్కు 'జెర్సీ' ఫేమ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పాత్రకు సాయి పల్లవి అయితే పర్ఫెక్ట్ అని మేకర్స్ భావించినప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకుందట. ఇక ఈ క్రమంలోనే ఆ అదృష్టం రష్మిక మందన్నను వరించింది. పుష్ప, యానిమల్ సినిమాలతో ఫుల్ ఫామ్లో ఉన్న రష్మికకు ఇది కెరీర్లోనే మైల్ స్టోన్ మూవీ కానుంది. సీక్రెట్గా లుక్ టెస్ట్ కూడా పూర్తి: ఈ బయోపిక్ కోసం రష్మికకు అప్పుడే ప్రత్యేకంగా 'లుక్ టెస్ట్' కూడా నిర్వహించినట్లు టాలీవుడ్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ లుక్ టెస్ట్ కోసం ప్రత్యేకంగా సాంప్రదాయ దుస్తులను డిజైన్ చేశారట. ఇక క్లాసికల్ లుక్లో రష్మిక చాలా పర్ఫెక్ట్గా ఒదిగిపోయిందని, అందుకే చిత్రబృందం ఆమెను ఫైనల్ చేయడానికి మొగ్గు చూపిందని ఇండస్ట్రీ టాక్.

# 'రామాయణ'లో కాజల్..



సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే ఉంది. బాలీవుడ్లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాలో రణ్బీర్ కపూర్.. రాముడి పాత్రలో, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు యశ్.. రావణుడిగా కనిపించనున్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ ఈ సినిమా గురించి మాట్లాడారు. తన కెరీర్లోనే ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం మొదటిసారి అని అన్నారు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

భారీ స్థాయిలో 'రామాయణ' రానుంది. గతంలో నితేశ్ తివారీఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ''5000 సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నాం'' అని అన్నారు. ఈ ఏడాది దీపావళికి మొదటి భాగం విడుదల కానుంది.

# సైలెంట్‌గా.. ఫౌజీ




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, అభిమానుల దృష్టి మాత్రం ఒక్క సినిమాపైనే నిలిచిపోయింది. డైరెక్టర్ హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న పీరియాడిక్ వార్ డ్రామా ఫౌజీ గురించి అధికారికంగా ఎలాంటి అప్డేట్ రాకపోవడంతో అభిమానుల్లో అసహనం పెరుగుతోంది. ఇప్పటికే సినిమా షూటింగ్లో కీలక భాగం పూర్తయిందని సమాచారం ఉన్నప్పటికీ, చిత్ర బృందం నుంచి రిలీజ్ డేట్ తో పాటు కనీస ప్రమోషనల్ కంటెంట్ కూడా బయటకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో సోషల్ మీడియా వేదికగా ప్రభాస్ అభిమానులు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం ఎక్స్ సహా పలు సోషల్ మీడియా ప్లాట్ఫార్మ్లలో ఫౌజీ అప్డేట్ ను వీలైనంత త్వరగా ఇవ్వాలని కోరుతూ వివిధ హ్యాష్ట్యాగ్ లను ట్రెండ్ చేస్తున్నారు. సినిమా గురించి ఏదైనా అధికారిక సమాచారం ఇవ్వాలని, రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేయాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా దసరా సీజన్లో సినిమా రిలీజవుతుందనే ప్రచారం కొంతకాలంగా జరుగుతున్నా, దీనిపై చిత్ర యూనిట్ ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. మరోవైపు పండుగ సీజన్కు ఇప్పటికే పలు భారీ సినిమాలు క్యూ కడుతుండటంతో ఫౌజీ నిజంగా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందన్న సందేహాలు మరింత పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మైత్రీ మూవీ మేకర్స్ సైలెన్స్ వెనుక ఏదైనా స్పెషల్ స్ట్రాటజీ ఉందా అనే చర్చ కూడా ఇండస్ట్రీ వర్గాల్లో మొదలైంది.

# నటనకు నై..



టాలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ తమన్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో మోస్ట్ బిజీయెస్ట్ టెక్నీషియన్గా దూసుకుపోతున్నారు. అయితే సంగీత దర్శకుడిగానే కాకుండా, ఆయన త్వరలోనే నటుడిగానూ వెండితెరపై మెరవబోతున్నారు. తమన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఒక తమిళ చిత్రం ప్రస్తుతం శరవేగంగా తెరకెక్కుతుంది. ఈ క్రమంలో తాజాగా తన యాక్టింగ్ కెరీర్పై తమన్ చేసిన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి.

### ఆ సినిమా ఎలా ఒప్పుకున్నానో నాకే తెలియదు..

థమన్ మాట్లాడుతూ.. నిజం చెప్పాలంటే అసలు ఆ సినిమా చేయడానికి నేను ఎలా ఒప్పుకున్నానో నాకే తెలియదు. ఆ దర్శకుడు నా దగ్గరకు వచ్చి కథ చెప్పినప్పుడు, నేను ఆ కథ వింటూ మైమరపులోకి వెళ్లిపోయాను. ఆయన నన్ను ఎలా ఒప్పించాడో కూడా నాకు గుర్తు లేదు. అలా ఆ ప్రాజెక్టులోకి వెళ్ళిపోయాను అని చెప్పుకొచ్చారు. సినిమాల్లో నటించడంపై తనకున్న అభిప్రాయాన్ని పంచుకుంటూ.. ఇకపై యాక్టింగ్కు గుడ్బై చెప్పేయబోతున్నట్లు తమన్ క్లారిటీ ఇచ్చారు. నిజజీవితంలో ఎలాగో మనం నిత్యం నటిస్తూనే ఉంటాం. కానీ, సినిమాల్లో కూడా నటించడం అంటే చాలా కష్టం. అందుకే నేను ఇప్పుడు నటిస్తున్న తమిళ సినిమా కాకుండా.. భవిష్యత్తులో మరే ఇతర సినిమాలోనూ నటించకూడదని నిర్ణయించుకున్నాను. ఇదే నా చివరి సినిమా అని తమన్ స్పష్టం చేశారు. ఈ క్రేజీ తమిళ చిత్రం అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని జూలై 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. సంగీత దర్శకుడిగా ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తమన్, నటుడిగా వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తారో అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# ఓటీటీలోకి 'కరుప్పు'..



సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కరుప్పు'(ఓ్చటఱఇఱ). తెలుగులో 'వీరభద్రుడు'గా విడుదలైంది. ఆర్జే బాలాజీ తెరకెక్కించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జూన్ 12 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో (అర్మ్ఠ్ఖౌ ౖటజీర్ఖు ఃజీఛ్ఛీౌ) స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమా ఓటీటీపై కొన్ని రోజులుగా వార్తలు వచ్చినప్పటికీ తాజాగా అమెజాన్ అధికారికంగా ప్రకటిస్తూ యాప్లో అప్డేట్ చేసింది. ఈ సినిమా కోలీవుడ్లో విజయాన్ని సాధించిన సూర్య కెరీర్లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో చోటు సొంతం చేసుకుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.